తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక




ఏప్రిల్ 01-15, 2021

సంపుటి 01, సంచిక 12

*Complimentary Copy - 11*



ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడు అవుతాడు
- డా॥ బి.ఆర్. అంబేద్కర్

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




శ్రీకృష్ణుడు సద్దులు ఆరగించిన మనోహర దృశ్యాన్ని ఆవిష్కరించిన **బమ్మెర పోతన** నాటి కవిత... **శ్రీకృష్ణుడు చల్దులాగరించుట** 22

04 వర్తమాన ప్రపంచంలోని కృత్రిమత్వం తెలుపుతున్న **ఎస్. గోపి** కవిత... **వర్తమాన్**



31 తెలంగాణ సినిమాల్లో వికసించిన ప్రక్రియ గురించి తెలుపుతున్న **వారాల ఆనంద్** వ్యాసం... **తెలంగాణ సినిమాల్లో సాహిత్య రూపాంతరీకరణ**



27 అన్ని ప్రక్రియల్లో చేయితిరిగిన **రచయిత్రి అమృతలత**తో నెలుట్ల **రమాదేవి** ముఖాముఖి...



17 కపిలభారతి, కొండరెడ్లపై జరిపిన పరిశోధన పాటవం తెలిపిన **నోరి** వ్యాసం... **కొండెత్తు నిలిపిన కొండ్లరెడ్ల పరిశోధన...**



41 నాటి గ్రామీణ సమాజానికి అద్దం పట్టిన **వింధ్యా వాసిని** వ్యాసం... **బతుకమ్మ కథలు**



09 విచిత్రంగా భర్తపైన తన చివరి విజయం ఆకాంక్షించిన యువతి, **జింబో** కథ... **ఆమె కోరిక**



13 కరోనా కాలంలో కూడా వికసించిన విద్యా చైతన్యం చెప్పిన **బివిఎస్ రాములు గురుకులం** కథ

పరలోకంలో కూడా మరచిపోని కులాల వ్యాకులాన్ని చెప్పిన **కాళోజి** నాటి కథ... **తెలియక ప్రేమ, తెలిసి ద్వేషం** 05

మరుగున పడిన మాణిక్యం వెల్చాల గురించి వివరించిన ఆర్. కమల వ్యాసం... **సాహితీవేత్త శ్రీ వెల్చాల కేశవరావు... 19 పేజీలో**

దాచుకున్న గాయాల మూటను తెల్లదస్తీలో చూసిన **ఆశారాజు** కవిత... **తెల్లదస్తీ... 07 పేజీలో**

సామాన్యుల జీవితాలను ప్రతిబింబించిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత **అమర్‌కాంత్** పరిచయం... ... **25 పేజీలో**

సాహిత్య విభాగంలో నోబుల్ బహుమతి విజేత **టోమస్ ట్రాన్ స్ట్రోమర్** పరిచయం... **26 పేజీలో**

జాగృతి నిర్వహిస్తున్న **హనుమాన్ చాలీసా పారాయణం** గురించి వివరిస్తున్న **రంగు నవీన్ ఆచారి... ... 23 పేజీలో**

**ఇంకా....**

పొలమర శెట్టి కృష్ణారావు **'నేస్తమా'... 8 పేజీలో**, రమేశ్వర రాజు **'భారతమ్మ పదాలు'... 8 పేజీలో**, వెలపాటి రామారెడ్డి **'ముక్తి భిక్ష'... 12 పేజీలో**, కరిపె రాజకుమార్ **'మూల మలుపు' ... 16 పేజీలో**, బెల్లంకొండ సంపత్ కుమార్ **'రెండు నదులు' ... 21 పేజీలో**

సినిమా ప్రపంచపు కుళ్ళును తెలిపే **సంఫీర్** కథ... **రంగుల కళ** 35

పుస్తక సమీక్ష... సభలు సమావేశాలు

# తంగేడు సంచికకు స్పందన...

మీ నేతృత్వంలోని తంగేడు పక్ష పత్రిక రెగ్యులర్‌గా వస్తున్నది... నా మనసును దోస్తున్నది...

**- మాగల రాజేంద్రప్రసాద్**
విశ్రాంత ఉద్యోగి

తంగేడు రోజు రోజుకు చక్కగా వికసిస్తోంది. మీ కృషి కనిపిస్తోంది.

**- ప్రొ॥ ఎన్. గోపి**
కవి

పత్రిక సాహిత్యంతో పరిమళిస్తున్నది.. శీర్షికలు, వ్యాసాలు అన్నీ బాగున్నాయి... సంపాదకీయాలు ఆలోచింపచేస్తున్నాయి...

**- టి. శ్రీరంగస్వామి**
సాహితీవేత్త, వరంగల్

నేనీమధ్య తంగేడును మాధ్యమాల్లో చూడటం జరిగింది. బాగుంది.

**- శివలెంక శ్రీశైలం**
మాసబ్‌ట్యాంక్

తెలంగాణ జాగృతి సాహిత్య పక్ష పత్రిక తంగేడు చాలా బాగుంది. చందా వివరాలు పంపగలరు.

**- వీరగోని సరస్వతీ, ఆంజనేయులు గౌడ్**
వేములవాడ

తెలంగాణ భాషా అస్తిత్వ సంరక్షణకు తంగేడు దర్పణం లాగా భాషిస్తోంది.

**- బి. పురుషోత్తమరావు**
నిర్మల్

మీరు అప్పుడప్పుడు ప్రచురిస్తున్న సినీ రంగ వ్యాసాలు తెలంగాణ సంస్కృతిని ప్రతిఫలిస్తున్నాయి. గత సంచికలోని హెచ్. రమేష్ వ్యాసం ఆకట్టుకుంది.

**- ఎస్వీ రామారావు**
సినీ రచయిత

తంగేడులో పాత వ్యాసాలు మళ్లీ మార్పుతో వస్తున్నాయేమోనని అనిపిస్తోంది. మిగత అంతా బాగుంది.

**- ప్రొ॥ జయధీర్ తిరుమలరావు**
సాహితీవేత్త




## 'తంగేడు' సంచిక వార్షిక చందా వివరాలు

'తంగేడు' పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 25 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు **http://www.thangedu.co.in** వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

***వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:***

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

1-15 ఏప్రిల్, 2021

సంపుటి 01 సంచిక 12





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614


# సత్య శోధన జరగాలి ...

సత్యం అత్యంత శక్తివంతమైంది. సత్యం మనిషికి ఆత్మవిశ్వాసం ఇస్తుంది. సత్య స్ఫూర్తి అనేక మహాకార్యాలకు హేతువౌతుంది. సత్య స్ఫూర్తి వల్ల సాహిత్యం మరింత శక్తివంతంగా నిలబడుతుంది.

అనేక సందర్భాలలో అబద్దాలు రాజ్యమేలుతాయి. తమ సామాజికవర్గం బలంవల్ల, లేక ప్రాంతం బలం వల్ల, చరిత్రలో అట్లాగే సాహిత్యంలో వక్రీకరణలు చొరబడుతాయి. ప్రజల్ని అదే నిజం అనేంత భ్రమలో పడేస్తాయి.

“People have a natural inclination to lie to others” అంటాడు బెకన్. అంటే మనిషిలో స్వాభావికంగా అసత్యం వైపు మొగ్గు ఉంటుంది. భ్రమల మీద ఆరాధన ఉంటుంది. ఈ బలహీనత, చరిత్రలనే వక్రీకరించిన విషయం మనకు తెలుసు. ఇది మనిషిలో అసాధారణ ప్రతిపత్తి ప్రోదిచేసిన విషయం మనం చూశాం. కాగా కాల్పనికతను వేరుగా చూడవలసిన అవసరం ఉంది. సాహిత్య సృజనకు కాల్పనికత ఒక అనివార్యమైన అంశం. విషయం యథాతథంగా వ్యక్తీకరిస్తే అలంకారికతకు చోటెక్కడ? పాఠక ప్రియమైన సన్నివేశ కల్పన ఎట్లా జరుగుతుంది? కాబట్టి సాహిత్యం కాల్పనికతను ఆశ్రయించక తప్పదు.

కాగా కాల్పనికత అంటే వక్రీకరణ కాదు. అసత్యాలు ప్రచారం చేయడం అసలే కాదు. కాల్పనికత ప్రధానంగా భావోద్వేగానికి, ఊహా చిత్రానికి ప్రతిపాదికగా నిలుస్తుంది. దీన్ని గురించి రికెట్ ఇట్లా అంటాడు “Romanticism surely widening of the imaginative horizon, a sharpening of emotional sensibility” ఇట్లా కాకుండా కేవలం అసత్యాలు ప్రచారం చేసే కాల్పనికత సమాజాన్ని రుగ్మమయం చేస్తుంది. చరిత్రను వక్రీకరిస్తుంది. సామాజిక న్యాయానికి తప్పుడు నిర్వచనం ఇస్తుంది.

కాల్పనికత కూడా వాస్తవికత పునాదిగా ఉండాలి. కాల్పనికతా సౌరభం వాస్తవికతా నేపథ్యం గానే కొనసాగాలి.

కావ్యం ఆనంద హేతువు ,సామాజిక ప్రయోజనకారి అనడం లో ఈ రెండు ఇమిడి ఉంటాయి. ప్రక్రియలో ఈ రెండు సమన్వయం పొందాలి. వాస్తవం పునాదుల మీద మాట్లాడేవాడు ప్రజల మనిషై ఉంటాడు. ప్రజాక్షేత్రంలోని సుఖదుఃఖాల మీద అవగాహన కలిగిఉంటాడు. పీడనను నిశితంగా వ్యతిరేకిస్తాడు. మానవలోపాల పట్ల సానుభూతితో ఉంటాడు.

మనిషిలో సహజాతంగా ఉండే భ్రమలను అతడు తొలగించ గలుగుతాడు. సృజనలో హేతుబద్ధతకు ఆస్కారం అవుతాడు.

ఇటువంటి సత్యం పునాదులుగా కొనసాగే సాహిత్యాన్ని స్వాగతిద్దాం. సత్యాన్వేషణ మన పరిశోధనకు మూలభూమిక అని విశ్వసిద్దాం.

ప్రస్తుతం మనకు కరోనా చీకటి ని ఇచ్చిన శార్వరిని విడిచి ప్లవనామ సంవత్సర ఉగాదిలో అడుగుపెడుతున్నాం. పాఠకులకు, సాహితీ మిత్రులకు, జాగృతి కార్యకర్తలకు, తెలంగాణ సమాజానికి, వెరసి సమస్త తెలుగు ప్రజానీకానికి ఉగాది శుభాకాంక్షలు.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత కల్వకుంట్ల

కవిత

# వర్తమాన్



ఎన్. గోపి

ఎదుట లేని వారిని
ఊహతో చూస్తున్నట్టే లెక్క
వారి మాటలను
రోమాంటిసైజ్ చేసుకొని వింటున్నాం.

పక్క వీధికి కూడా
నడక మర్చిపోతున్నాం
ఏదైనా ఫోన్‌లోనే
తెల్సుకుంటున్నాం.

ఎటు చూసినా పరుగులే పరుగులు
వేగానికి గమ్యం వేగమే అయినట్టు
నూరుమైళ్ల స్పీడ్
ఇంటి ముందు పార్క్ చెయ్యడానికే.

నలుగురు కూర్చొని
హృదయాలను వొంపుకొని ఎన్నాళ్లైంది!
సావధానంలో వున్న సౌందర్యం
సంరంభంలో ఉంటుందా!

గడియారం
కాలాన్ని ఒరుసుకుంటూ సాగిపోతుంది.
ట్యూబ్‌లైట్ స్టార్టర్
నిరర్థకంగా గర్జించినట్టు
ఎవరికీ స్థిమితంగా ఉండదు.

'అమ్మా నువ్వు లేవు
కాబట్టి ఏదీ రుచించదు'
అని పిల్లలు అనరు
అంతా ప్లానింగ్ ప్రకారమే జరుగుతుంది.
ఎండ కూడా అందమైందే!
దూరంగా
గాజు పలకలు మెరుస్తుంటాయి.
సంధ్య కాస్సేపే,
నేపథ్యంలో చీకటి
కిందికి దిగుతుంది.
గమనించడానికి సమయమే లేదు.
స్పందనలు లుప్తమని కాదు
అవన్నీ బంద్, కమ్‌రే మే బంద్.

ఏది ప్రాధాన్యమో
ఏది వెనకో మర్చిపోతున్నాం
పైకి పద్ధతిగా కనిపించినా
లోపలంతా కెయాస్!

ఇక ఆపేస్తాను
ఇది కవిత్వం కాకపోవచ్చు
ఎక్కడెక్కడో
మనఃపంజరంలో ఖైదీ అయిన
శబ్దాలను విడిపించి
ఎగరేస్తున్నానంతే!



# తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము

కాల్పనికత నుండే సామాజిక
దురంతాన్ని చెప్పిన కథ...



కాళోజి

"ఎంత బాగుందోయి పాట. కొంత సేపాగి, విని, మరిపోదామా."

"నాకు విందామనే వుంది కాని, సమయానికక్కడ చేరకపోతే దయా దాక్షిణ్యం లేక దండన విధిస్తాడు ఆ యమధర్మరాజు తెలుసా?"

"ఆ భయం మనకు లేనిదెప్పుడు, వైతరణి దాటితే యమపురి ఎంతదూరం. కొంచెం తొందరగా నడిస్తే వేళకందలేమా ఏమి?". "సరే నీ యిష్టం, కాని, పాశాల్లో జీవాలున్నావే, వెంట తీసుకొని ఎలా వెళ్ళడం గంధర్వులగానం వినేటందుకు?"

"వానిని వైతరణీ తీరాన వదిలేద్దాం. తిరుగుతాయి పాపం కొంచెం స్వేచ్ఛగా, ఎట్లైనా పారిపోతాయన్న భయమా లేదు. మళ్ళీ ఎన్నాళ్ళకో స్వేచ్ఛ. తలచు కుంటాయి కూడాను."

"సరే, నీవు చెప్పినట్లు చేయుటకు నాకేం అభ్యంతరం లేదు. కాని, అక్కడికెళ్ళి ఆ పాట వింటుంటే మనకు యమపురి సంగతి ఈ ప్రాణాల సంగతి జ్ఞాపకం వుంటుందా అని?"

"నేను చెపుతాను లేవోయి కొంత సేపు కాగానే, నీవు నడుద్దూ ఈ పాశాన్ని నా దానితో పాటిక్కడ వదలి."

"సరే, నడువు అట్లాగయితే."

★ ★ ★

2

"ఇదేమిటి? ఇప్పటికి నేనొక్కడనే అనుకుంటున్నాను ఈ ప్రదేశంలో, కాని! మీరెవరో వున్నారే నాతోపాటు? మనమెక్కడ వున్నది మీకేమైనా తెలుసా?"

"నేను అదే ఆలోచిస్తున్నాను. ఈ ప్రదేశం నాకు కొత్తే. ఎక్కడున్నది ఏమి బోధపడడం లేదు.

"సరే కాని, ఎక్కడివాడవు నాయనా నీవు?"

"అయ్యా, నేను భారతీయుడను."

"ఏమీ, భారతీయుడవా, నా తండ్రీ! మా దేశీయుడవేనా నీవు?"

"మహాభాగ్యం, మీరు భూలోక స్వర్గమగు భారతదేశం వారేనానండీ?"

"అవును కాని, ఏ ప్రాంతం నాయనా నీది?"

"అయ్యా, నేను నిజాం రాష్ట్రంలోని తెలంగాణా మనిషిని."

"ఏమిటి! ఏమంటివి! నిజాం రాష్ట్రంలోని తెలంగాణా వాడవే? స్వదేశీయుడవే స్వప్రాంతీయుడవు కూడానా నాయనా? మరి, నీవు మాట్లాడే భాష ఏది, తండ్రీ, ఆ ప్రాంతంలో?"

"ఇంకే భాష మాట్లాడమంటారు మమ్మల్ని? మేము మాట్లాడేది అచ్చం తెలుగండి మహాప్రభో"

'ఏమి! ఏమి! తెలుగే, అట్లయితే నీవు నిజాం రాష్ట్రాంధ్ర సోదరుడవేనా తండ్రీ? అందుకే. నిన్ను చూడడంతోనే ఒక విధమైన సోదర ప్రేమ కలిగింది. నాయినా. అయితే ఇక్కడికెలా రావడమైంది బాబూ?

"ఏమోనండి, అదే బోధపడడం లేదు నాకూనూ. ఉదయం మా ఊళ్ళో జరిగిన కొట్లాటలో - నా తలపైన దుడ్డుకట్ట పడ్డాక నాకు స్పృహ తప్పింది. తర్వాత ఏమి జరిగినదీ తెలియదు. ఇప్పుడు చూస్తే ఇక్కడున్నాను".

"ఎంత చిత్రం, మీ ఊళ్ళో కూడా ఉదయం గోల జరిగిందా. మా ఊళ్లో జరిగిందే నా తలపైన గొడ్డలిపడడం వరకు జ్ఞాపకం వుంది. తర్వాత ఏమి జరిగినదీ నాకు తెలియదు. ఇప్పుడు చూస్తే ఎక్కడున్నది బోధపడడం లేదు."

"సరే బాగానే వుంది. అయితే మీ ఊళ్ళో జరిగిన సంగతేమిటో చెప్పండి. నేను మా సంగతి చెపుతాను తర్వాత. చాలా అన్యాయంగా వుందండి కథ. ప్రపంచంలో దయ అనేది లేకపోవడం సత్యమని బోధపడుతుంది మీకే తర్వాత. మీరు కూడా నాతో మరియు నాతోటి వారితో సహానుభూతి చూపకమానరు నా కథ విన్నాక."

"నా కథా అలాగే వుంది అబ్బాయి. ప్రపంచంలో ధర్మమనేది నాశనమయి పోతున్నది దినదినం. ఆచార వ్యవహారాలు మంటగలుస్తున్నాయి లోకంలో. మా ఊళ్ళో జరిగిన కథ చెప్పితే ఆశ్చర్య పడడమే కాకుండా నమ్మనైన నమ్మవేమో

అని అనుమానిస్తున్నాను. అందుకే, నీవే నీ కథ మొదలు చెప్పితే - బావుంటుందని నా అభిప్రాయం.”

“నిజమేనండి, ప్రపంచంలో మనుష్యత్వమే లేకుండా అయింది. ఏమి చెప్పేది మా ఊళ్లో అవస్థ ఏదో చెపుతాను వినండి. ఆ ఊళ్ళో ఒక దేవాలయం వుంది. అది మా ప్రాంతంలో చాలా పురాతనమైనది, ప్రసిద్ధికెక్కినది కూడాను. ప్రతి సంవత్సరము పెద్ద తీర్థం సాగుతుంది. ఈ ఏడు జాతర అప్పుడు దేవాలయం ప్రవేశ విషయంలో వచ్చింది తగాదా అస్పృశ్యులకు సవర్ణ హిందువులకు. సవర్ణులలో కొందరు హరిజనుల పక్షం వహించి దేవాలయ ప్రవేశానికి సాయపడతాం అన్నారు. దాంట్లో ఒకరిద్దరు బ్రాహ్మణులు కూడా వుండడం తటస్థించింది. జాతర కంటే ఒక వారం ముందే హరిజనులందరు నిరసన వ్రతంతో దేవాలయ ప్రవేశ విషయమై సత్యాగ్రహం మొదలు పెట్టారు.

బ్రాహ్మణులు, యితర హిందువులూ లాఠీలతో గుడిచుట్టూ కాపలా కాస్తున్నారు. ఈ రోజు ఉదయం హరిజనులు కూడా, సత్యాగ్రహానికి స్వస్తి చెప్పి జబర్దస్తిగా దేవాలయ ప్రవేశం చేద్దామని లాఠీలతో తయారైనారు. జరిగింది సవర్ణ హిందువులకు లాఠీలతో సంగ్రామం.

‘ఏమీ, నీవూ ఈ దేవాలయ ప్రవేశ సందర్భములోనే నెత్తి పగిలి స్పృహ దప్పిన మహావీరుడవా నాయనా? ధన్యుడవు. స్వర్గంలో ఇంద్ర వైభవము పొందగలవు. ధర్మ సంగ్రామంలో పాల్గొన్నవాడవు. “నీ తల పగులగొట్టిన ఆ పాపాత్ముడెవడు? వానికి నరకం తప్పునా? నేనూ ఆ ధర్మయుద్ధంలో పాల్గొన్న వీరుడనే తండ్రీ. ఇంతకూ, మనమిరువురము ఒక్క ఊరివారమే నాయనా. అయిన నిన్ను కొట్టిన ఆ దుర్మార్గుడెవడో జ్ఞాపకమున్నదా?”.

కష్టమన్నది తెలియక రోజు మూడుపూటలూ అన్యాయంగా మమ్మల్ని దోచుకొని తిని బాగా బలిసిన ఒక లావాటి బాపనయ్య, ప్రక్క నుండి, నా తలపై దుడ్డుకట్ట వేసాడు. అతనికీ తగినశాస్తి అయిందనే నా అభిప్రాయం. మా వెంకడు అప్పుడే గొడ్డలితో అతని బుజ్జపై కొట్టినట్లు చూడడం నాకు జ్ఞాపకం.”

“ఓరి ముండాకొడుకా! మాదిగ వెధవవు ఇక్కడా దాపురించావు? పొద్దున్నే కసితీరా లాఠీతో కొట్టి దేవాలయ ప్రవేశం కంటె మొదలు యమపురి ప్రవేశం చేయిస్తామని అనుకుంటే ఆ గొడ్డలిదెబ్బ నా తలపై పడడం చేత తప్పించుక పోయావు. కాని ఇప్పుడెటు పోతావురా? గొంతుక పిసికి పారేస్తాను చూడు.”



ఆ బాపనయ్యవు నీవేనా? బొర్రపై ఒక లాఠీ కొట్టానంటే నిన్న సంతర్పణలో తిన్న భక్ష్యాలన్ని బయటపడాలే జాగ్రత్త! నా మెడ పిసకడమంటే పిండాలకూడు పిసకడం అనుకున్నావా”

“అబ్బా! ఎంత తన్ను తన్నితివిరా?”

“అయ్యో చస్తి! చేతకాక కొడుతావటయ్యా? ఉండు నీ పని పట్టిస్తా”

“అబ్బా ఎంత గుద్దు గుద్దితివిరా పేగులు వెళ్ళేటట్టు తొక్కుతానుండు.”

ఏడ్చావు బాపనయ్య కిందపడ్డా నాదే గెలుపంటావు. చూడు నీవు చేస్తానన్న పని నేనే చేస్తా.’

“అయ్యో చస్తీ! చస్తీ! ఎవ్వరన్నా రక్షించండి బ్రాహ్మణ్ణి, చచ్చిపోతున్నాను పుణ్యానికి.”

**“ఎంత చిత్రం, మీ ఊళ్ళో కూడా ఉదయం గోల జరిగిందా. మా ఊళ్లో జరిగిందే నా తలపైన గొడ్డలిపడడం వరకు జ్ఞాపకం వుంది. తర్వాత ఏమి జరిగినదీ నాకు తెలియదు. ఇప్పుడు చూస్తే ఎక్కడున్నది బోధపడడం లేదు.” “సరే బాగానే వుంది. అయితే మీ ఊళ్ళో జరిగిన సంగతేమిటో చెప్పండి. నేను మా సంగతి చెపుతాను తర్వాత. చాలా అన్యాయంగా వుందండి కథ. ప్రపంచంలో దయ అనేది లేకపోవడం సత్యమని బోధపడుతుంది మీకే తర్వాత.**

★ ★ ★

3

“అరే చాలురా పాట వినడం, నదీతీరాన ఏవో కేకలు వినిపిస్తున్నాయి. ప్రాణాలను పాశాల్లోంచి వదిలివచ్చాం. అలవాటు చొప్పున ఇక్కడా కొట్లాడుకుంటున్నాయో ఏమో.

“అవునురా ఈ కేకలక్కడివే. ఆ బ్రాహ్మణ మాదిగ పంచాయితేరా ఇక్కడ కూడా

“నడువుమరి”

మంచిది.

‘వీరికావరం మండా, ఇక్కడేదో పోనీ పాపమని కొంత స్వేచ్ఛయిస్తే మళ్ళీ తన్నుకుంటున్నారేమిరా?”

“చచ్చి ఇంకా సరిగా పది గంటలు

కాకపోయే. ద్వేషం అప్పుడే పోతుందా?"

"వీరి ద్వేషం చట్టుబండలు గాను. ఇదేం కావరంరా చచ్చినా ఈ మతపిచ్చి ఈ వర్ణ భేద శతృత్వం పోలేదే? యమపురిలో తీర్పు చెప్పిన తరువాత తెలుస్తుందిలే సంగతి."

"ఇంకా అలా ఆలోచిస్తున్నావేమి నేను పాశంలో వేసుకొని నడవటానికి సిద్ధంగా వుంటే?"

"సరే నడువు నేనూ ఇదే బంధిస్తున్నాను ఈ బాపనయ్యను."

"తొందరగా నడువాలి టైము ఎంతో లేదు మనకు."

"నీవు కదిలేగా మాటలతోనే సరిపోయే". "సరే నడువవోయి."

★ ★ ★

4

"ఏమి ఇతడు ఆ అమాయకులైన హరిజనులు దేవాలయం ప్రవేశం చేస్తామంటే అడ్డపడడమే కాకుండా ఒక హరిజనుని కర్రతో బాది చంపినాడా?"

"అవును మహాప్రభో"

"ఏమోయి, మా వాడు నీ విషయమై చెప్పేది నిజమేనా?"

"అయ్యా నిజమే కాని ధర్మ సంరక్షణ"

"నోరుమూయి ధర్మాధర్మములు ధర్మరాజునైన నాకా నీవు చెప్పేది? ఒరే ఇతనిని పది రోజులూ అగ్నిగుండంలో పడవేసి తరువాత కొచ్చిన్ లోని ఒక పరయా (మాదిగ) కుటుంబంలో పడెయ్యి సుఖపడుతాడు. ధర్మం తెలుస్తుంది కూడాను."

"చిత్తం మహాప్రభో."

"అయ్యో అగ్ని గుండమా? మాదిగ జన్మమా? అన్యాయం! ఘోరం..."

★ ★ ★

5

"వీడెవడురా?"

"దేవాలయ ప్రవేశానికి లాఠీతో పోయి ఇప్పటి బాపనయ్యతో చంపబడ్డ హరిజనుడు". "అట్లాగా... ఒరే నీవు మహాత్ముడు చెప్పిన అహింసా విధానం మాని లాఠీ సహాయమెందుకపేక్షించావు దేవాలయ ప్రవేశానికి?"

"ఎన్ని రోజులు ఊరికే ప్రయత్నించినా ఆ బాపనయ్యలకు దయ రాలేదు విసిగి వేసారి జబర్దస్తీకి దిగాం మహారాజా."

"అది తప్పే... ఒరే వీడిని రెండు రోజులు ఆ మంచులో పడవెయ్యి కోపం అంతా పోయి శాంతమలవడుతుంది. మూడో రోజు తిరువాన్ కూరులో హరిజన కుటుంబంలోకి పంపించు".

"తెనుగు దేశంలో కాక మలయాళ దేశంలో ఎందుకు తండ్రీ జన్మం?"

"మళ్ళీ దేవాలయ ప్రవేశపు చిక్కులేకుండా. లేకపోతే ఏ బ్రాహ్మణ చేతనో తల పగులకొట్టించుకొని చేరుకుంటావు నా వద్దకు."

"మహాభాగ్యం"



# తెల్ల దస్తీ

(దస్తీ, చేతి రుమాలు, కర్చీఫ్)



ఆశారాజు

పండుగ నాడు
సంబరాలు చూద్దామని
నేను బయటకు వెళితే,
రోడ్డు మీద పడిన
మల్లె పువ్వులాంటి
తెల్లని దస్తీ దొరికింది

దానిమీది లిప్ స్టిక్ మరక
సంతకంలా మెరిసి
మదిని మురిపించింది

కొద్ది సేపు ఎదురు చూసి
మడత విప్పి దులుపితే,
గుప్పుమని దస్తీ నుండీ
కన్నీళ్ళ వాసనొచ్చింది

ఎవరో ఏమో
దాచుకున్న గాయాల మూటను
దారిలో పరధ్యానంగా,
పారేసు కొన్నారనిపించింది

కనిపించే రంగులన్నీ నిజాలు కావు
వినిపించని కథలన్నీ అబద్దాలు కావు
బరువనిపించీ, బాధనిపించీ,
దస్తీని అక్కడే వదిలేసి వెళ్ళి పోయాను

# భారతమ్మ పదాలు....

క్రెడిటు కార్డులు చాల

గీకుడే అవలీల
అప్పు తీర్చుట గోల
ఓ! భారతమ్మ..!!

ప్రతి పనికి ఒక కార్డు
నేడు స్పైనల్ కార్డు
బ్రతుకేమొ మరి హార్డు
ఓ! భారతమ్మ..!!

కార్డుంటె గోకుడూ
క్యాష్ కై గీకుడూ
పైసంత నాకుడూ
ఓ ! భారతమ్మ

ఆన్లైను చెల్లింపు
ఆధునికులకు సొంపు
మోసకారులకింపు
ఓ! భారతమ్మ !!

డిస్కౌంటుతో మొరలు
కష్టమర్లకు ఎరలు
తండాలుగా తరలు
ఓ! భారతమ్మ!!

మీ డబ్బులంటాడు
మీ ఇష్టమంటాడు
ప్రకటనతో వెంటాడు
ఓ! భారతమ్మ !!

ప్రకటనలతో చేస్తారు మాయాజాలం,
పదే, పదే వినిపించి వేస్తారు గాలం
చిక్కితే మన బ్రతుక్కే వేస్తారు వేలం
అందుకే అన్నారు గదా ఇది కలి కాలం



రమేశ్వర రాజు

# నేస్తమా!

నీలో ప్రతికూలత పెరిగితే
జీవితాన్ని ద్వేషించేందుకు
ప్రపంచాన్ని దూషించేందుకు
కోట్లాది కారణాలు కనిపిస్తాయి

అదే నీకు సానుకూలత తోడైతే
జీవితాన్ని రమించేందుకు
ప్రపంచాన్ని ప్రేమించేందుకు
అనంతావకాశాలు వికసిస్తాయి

ఎ. పాలమరశెట్టి కృష్ణారావు

కథ

# ఆమె కోరిక

అనుచితమైన భర్త కోరికను తీరనీయని
భార్య మార్గం....



రాజేందర్ జింబో

నిజామాబాద్‌లో జాయిన్ అయి వారం రోజులు దాటుతుంది. చాలా కేసులు పెండింగ్‌లో వున్నాయి. భార్యా భర్తల మధ్య వున్న కేసులు కూడా ఎన్నో చాలా సంవత్సరాల బట్టి విచారణలో వున్నాయి. ఆస్తి తగాదాల కేసులు, క్రిమినల్ కేసులు వేరు. భార్యాభర్తల మధ్య వున్న కేసులు వేరు. రెండు జీవితాల వ్యవహారం. రెండు జీవితాలే కాదు ఆ రెండు జీవితాలతో మరెన్నో జీవితాలు ముడిపడి వుంటాయి.

ఆ కేసుల వైపు నా దృష్టిని కేంద్రీకరించాను. ఆ కేసులని సత్వరం పరిష్కరిస్తే వాళ్ళు మరో వివాహం చేసుకోవడమో లేదా కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అవకాశం చిక్కుతుంది. యవ్వనంలో వున్న వాళ్ళ కేసులని ఆలస్యంగా పరిష్కరిస్తే వాళ్ళకి అన్యాయం చేసినట్టుగా వుంటుంది. విడాకుల కోసం కోర్టులకి వస్తున్న వ్యక్తులు ఎందరో. ఎందుకిలా జరుగుతుంది.?

ఏమో. మారిన జీవన సరళి, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వాతంత్ర్యం, సున్నిత మనస్తత్వం ఇట్లా ఎన్నో కారణాలు. ఆలోచనలు ఎగురుతూ వున్నాయి. ఆ రోజు శనివారం. కోర్టు పని వుండదు. ఆఫీసు పని వుంటుంది. కేసు ఫైళ్ళు చదువుకోవడం, తీర్పులు చెప్పడం ఇలాంటి పనులని శనివారం చేస్తూ వుంటాం. సోమవారం వాదనల కోసం వున్న ఓ నాలుగు ఫైళ్ళని నా ముందు పెట్టాడు బెంచ్ క్లర్క్. వాటిని తీసి చదవడం మొదలుపెట్టాను. చాలా కాలంగా విచారణలో వున్న ఫైలుని తీసి చదవడం మొదలుపెట్టాను. సాక్ష్యాలను పరిశీలించాను.

భర్త విడాకుల కోసం కేసు దాఖలు చేశాడు. అయిదు సంవత్సరాలు దాటింది కేసు వేసి. భార్య దాన్ని వ్యతిరేకిస్తుంది. వాళ్ళిద్దరూ గత 25 సంవత్సరాలుగా వేరుగా వుంటున్నారు. మరి భార్య ఎందుకు వ్యతిరేకిస్తుందీ - అతన్ని సాధించడానికని అన్పించింది. ఫైలుని క్షుణ్ణంగా చదివేశాను. మంగళవారం ఆ కేసులో తీర్పు చెప్పాలని అనుకున్నాను. ఇరుపక్షాల వాదనలని విని తీర్పు ప్రకటించడమే మిగిలి వుంది.

సోమవారం నాడు ఆ కేసుని పిలవగానే ఆమె వచ్చి నిల్చుంది. అతనూ వచ్చాడు. మధ్యాహ్నం రెండు గంటలకి తమ న్యాయవాది వచ్చి వాదనలని చెప్పుతాడని ఆమె కోర్టుకి విన్నవించింది. తమ న్యాయవాది కూడా మధ్యాహ్నమే వస్తాడని అతనూ కోర్టుకు చెప్పాడు.

లంచ్ తరువాత ముందుగా వారి కేసు వాదనలనే వింటానని చెప్పాను. ఇద్దరూ బయటికి వెళ్ళిపోయారు. లంచ్ తర్వాత మళ్ళీ బెంచి మీదకు వచ్చాను. ఆ కేసులోని భార్యభర్తలూ, వాళ్ళ న్యాయవాదులూ లేచి నించున్నారు. హైదరాబాద్ మాదిరిగా కాదు. జిల్లాల్లో న్యాయవాదులు ఎప్పుడూ రెడీగా వుంటారు. చెప్పిన టైంకి మరీనూ. వాదనలు మొదలు పెట్టమని భర్త న్యాయవాదిని కోరినాను. విడాకుల కోసం కోర్టుకి వచ్చిన వ్యక్తి భర్త.

అతని న్యాయవాది తన వాదనలని మొదలు పెట్టాడు. ఇద్దరం విడిపోయి 25 సంవత్సరాలు దాటింది. రెండు మూడు సార్లు పంచాయతీలు అయినవి. కానీ ఎలాంటి పరిష్కారం లభించలేదు. ఎలాంటి కారణం లేకుండా ఆమె అతని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. వాళ్ళకి సంతానం ఒక్కడే. అతనూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆకారణంగా ఆమె వెళ్ళిపోయింది, వారి వివాహం భావోద్వేగం లేకుండా చచ్చిపోయింది. అందుకని విడాకులని మంజూరు చేయాలని అతని న్యాయవాది కోర్టుని కోరాడు.

అతని వాదనలు విన్న తరువాత వాళ్ళిద్దరి వైపు నిశితంగా చూశాను. ఆమెకు యాభై అయిదు సంవత్సరాలుంటాయి. మనిషి చాలా గంభీరంగా వుంది. వినయంగా నిల్చోనుంది. అతనికి అరవై సంవత్సరాలుంటాయి. ఈ మధ్యే పదవీ విరమణ చేశాడు. తెల్లటి దుస్తులు

కథ

వేసుకొని వచ్చాడు. అతనూ వినయంగా నిల్చొని వున్నారు. విడాకులు త్వరగా మంజూరు చేస్తే బాగుంటుంది అన్నట్టు వున్నాయి అతని చూపులు.

25 సంవత్సరాల నుంచి వాళ్ళు వేరుగా వుంటున్నారు. ఆ విషయంలో ఎలాంటి వివాదం లేదు. వారి వివాహం భావోద్వేగం లేకుండా చచ్చిపోయింది. విడాకులు మంజూరు చేయకపోయినా వాళ్ళిద్దరూ కలిసి జీవించే పరిస్థితి కన్పించడం లేదు. అతని న్యాయవాది వాదనలు చెబుతున్నప్పుడు అతని సాక్ష్యాన్ని గమనిస్తే అదే అనిపించింది.

అతని న్యాయవాది వాదనలు పూర్తి అయిన తరువాత ఆమె న్యాయవాది వైపు చూసి అతని వాదనలని క్లుప్తంగా చెప్పమని కోరాను. తన వాదనలని పూర్తి చేయడానికి ఓ గంట టైం పడుతుందని అతను చెప్పాడు. సమయం మూడవుతుంది. ఇంకా రెండు కేసుల్లో వాదనలని వినాలి.

ఆ న్యాయవాది వైపు చూశాను. దాదాపు డెబ్బై అయిదు సంవత్సరాలు వుంటాయి. ఆ వయస్సులో కూడా గంటసేపు వాదనలని చెబుతానని అనడం ఆశ్చర్యం కలిగించింది. 25 సంవత్సరాలుగా వారు వేరువేరుగా వుంటున్నారు. వారి వివాహంతో భావోద్వేగం లేదు. అది చచ్చిపోయింది. ఆమె టీచర్‌గా పని చేస్తుంది. కొడుకు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇక ఆ కేసులో వాదనలు ఏం వుంటాయి. అనవసర కాలయాపన అని అన్పించింది. అతను చాలా సీనియర్ అడ్వకేట్. అయినా ఇలా అన్నాను.

“వాళ్ళిద్దరి మధ్య భావోద్వేగం లేదు. 25 సంవత్సరాలుగా వేరుగా వుంటున్నారు. కలిసి వుండే అవకాశం లేదు. ఇంకా ఏమి వాదనలు వుంటాయి సార్!”.

“మీరన్నది నిజమే యువరానర్! మా క్లయింట్ తన వాదనలని మీకు విన్పించమని కోరింది. మా వాదనలు విని మీరు ఎలాంటి తీర్పు చెప్పినా పర్వాలేదు. కానీ మా వాదనలని పూర్తిగా చెప్పనివ్వండి సార్!” అన్నాడు చాలా వినయంగా.



ఆమె కూడా అలాగేనన్నట్టుగా నా వైపు చూసింది. సీనియర్ న్యాయవాది అలా అన్న తరువాత నేను కాదని అనడానికి ఏముంటుంది?

‘సరే సార్ చెప్పండి’ అన్నాను. మిగతా రెండు కేసుల్లో ఒక కేసు వాయిదా వేశాను. ఆ సీనియర్ న్యాయవాది తన వాదనలని మొదలు పెట్టాడు.

“వీళ్ళిద్దరూ టీచర్లు. హిందూ సాంప్రదాయాల ప్రకారం వీరి వివాహం అయ్యింది. రెండు సంవత్సరాలు మాత్రమే వాళ్ళు కలిసి జీవించారు. ఆమె గర్భవతి అయిన తరువాత ప్రసవాని కోసమని ఆమె తల్లిగారింటికి వెళ్ళింది. ఓ పిల్లవాడికి జన్మనిచ్చింది. నామకరణానికి వచ్చి అంటి ముట్టనట్టుగా వుండి పోయాడు. రెండు మాసాలు గడిచినా కూడా ఒక్కసారి కూడా వాళ్ళని చూడటానికి రాలేదు. ఆమెనూ కొడుకునీ తీసుకొని వెళ్ళలేదు. చివరికి ఆమె తల్లిదండ్రులే వాళ్ళిద్దరిని తీసుకొని వచ్చి ఆమె భర్త ఇంట్లో వదిలి వెళ్ళారు. మా క్లయింట్ ఎంత అడిగినా అతను ఏ కారణమూ చెప్పలేదు. ఆమెతో ముభావంగా వుండటం మొదలు పెట్టాడు.

వాళ్ళ అబ్బాయికి గ్రహణం కారణం మూతి మీద మొర్రి ఏర్పడింది. ఆ కారణంగా అలా ముభావంగా వుంటున్నాడని ఆమె అనుకొని ఓ

**అతని న్యాయవాది తన వాదనలని మొదలు పెట్టాడు. ఇద్దరం విడిపోయి 25 సంవత్సరాలు దాటింది. రెండు మూడు సార్లు పంచాయతీలు అయినవి. కానీ ఎలాంటి పరిష్కారం లభించలేదు. ఎలాంటి కారణం లేకుండా ఆమె అతని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. వాళ్ళకి సంతానం ఒక్కడే. అతనూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు.**

కథ

ఆరు నెలలు అతన్ని అలాగే భరించింది. ఆ తరువాత వాళ్ళ స్కూల్లో పని చేస్తున్న మరో టీచర్‌తో ప్రేమలో పడ్డాడని మా క్లయింట్‌కి తెల్సింది. రోజూ సాయంత్రాలు ఆమె ఇంటికి వెళ్ళడం, తన ఇంటికి ఆలస్యంగా రావడం మొదలుపెట్టాడు.

మా క్లయింట్ అతన్ని నిలదీసింది. గొడవ పడింది. ఇలా చేయడం సరైందేనా అని ప్రశ్నించింది.

'నేను ఇలాగే వుంటాను. నీకు ఇష్టం అయితే వుండు లేకపోతే మీ ఇంటికి వెళ్ళిపో అన్నాడు. కొంతకాలం భరించింది. అతను ఇంటికి రావడమే మానేశాడు. భరించలేక చివరికి ఆమె తన తల్లిగారింటికి వచ్చి వుండటం ప్రారంభించింది. ఆ తరువాత పెద్దవాళ్ళు పంచాయతీ పెట్టారు. ఆమె తనకిష్టం లేదని అన్నాడు. విడాకులు కావాలని అన్నాడు. అది మా క్లయింట్ ఇష్టం లేదు. పోలీసు కేసు కూడా పెట్టింది. కేసు పరిష్కరించడానికి పోలీసులు ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోయింది. అతను రెండో వివాహం చేసుకున్నాడనడానికి సాక్ష్యాలు లేక, వరకట్న డిమాండ్ లేదన్న కారణంగా ఆ కేసుని కోర్టు కొట్టివేసింది నిజమే!

ఆమె ఇంటి నుంచి తనకు తానుగా వెళ్ళలేదు. తన భర్త మరో అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకోవడం వల్ల ఆమె వెళ్ళిపోవాల్సి వచ్చింది. అయినా అతనితో కలిసి వుండటానికి ఆమె చెయ్యని ప్రయత్నం లేదు. ఎన్నో పంచాయతీలు జరిగాయి. కానీ ప్రతి పంచాయతీలో విడాకులనే కోరాడు. ఆమె భర్తకూ క్లయింట్‌ని తీసుకొని వెళ్తానని ఎప్పుడూ అనుకోలేదు.

తన దురదృష్టానికి చింతిస్తూ ఆమె తన ఉద్యోగం తాను చేసుకుంటూ కొడుకుని బాగా చదివించి అమెరికాకు పంపించగలిగింది. ఇప్పుడూ అతను అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని చదువు కోసం, పోషణ కోసం ప్రతివాది ఇచ్చిన డబ్బులు నామమాత్రం. అబ్బాయికి గ్రహణం మొర్రి అన్న కారణంగా అతన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రేమగా పలకరించలేదు.

ఇప్పుడు అతనికి ఇద్దరు పిల్లలు రెండవ భార్యతో. ఒకరి వివాహం కూడా చేశాడు. సుఖంగా వుంటున్నాడు. ఇప్పుడు నా క్లయింట్ వాళ్ళతో ఏమీ గొడవ పడటం లేదు. పంచాయతీలు పెట్టడం లేదు. ఆమె జీవితం ఆమె కొనసాగిస్తుంది. తన జీతం డబ్బులతో తాను బతుకుతుంది. తన జీవితం తాను కొన సాగిస్తున్నాడు ఆమె భర్త. ఈ విడాకుల దరఖాస్తు ఎందుకు పెట్టాడో అర్థం కాని విషయం యువరానర్!

ఒక్క నిమిషం ఆగి మళ్ళీ తన వాదనని ఇలా కొనసాగించాడు.

"యువరానర్! నేను చెప్పిన విషయాలు అన్నీ సాక్ష్యాలతో వచ్చాయి. భర్త తప్పిదం వల్లే ఆమె వేరుగా వుంటుంది తప్ప తనకు తానుగా ఆమె వెళ్ళిపోలేదు. ఈ 25 సంవత్సరాలలో ఆమెకు వేదనే మిగిలింది తప్ప సంతోషం లేదు. తన కొడుకును బాగా చదివించు కున్నానన్న తృప్తి తప్ప ఈ వివాహం వల్ల ఆమెకు ఏమి లభించలేదు. అయినా ఆమె విడాకుల కోసం ఎప్పుడూ కోర్టుకి రాలేదు. విడాకులని కోరుకోలేదు. ఎవరి జీవితం వాళ్ళు బతుకుతున్నారు. అతని జీవితంలో ఆమె జోక్యం లేదు. ఆమె జీవితంలో అతని జోక్యం లేదు. ఆ పరిస్థితుల్లో విడాకులు ఎందుకో అర్థం కాదు యువరానర్!

కేసు సాక్ష్యాల ప్రకారం అతని తప్పిదం వుంది. ఆమె తప్పిదం లేదు. అందుకని అతను విడాకులు కోరడానికి అవకాశం లేదు. కోరినా మంజూరు చేయడానికి ఎలాంటి యోగ్యతా లేదు. అందుకని అతను విడాకుల కోసం పెట్టుకున్న దరఖాస్తుని డిస్మిస్ చేయమని కోరుతున్నాను యువరానర్! కొంచెం సమయం తీసుకొని మళ్ళీ తన వాదనలని కొనసాగించాడు ఆ సీనియర్ న్యాయవాది.

25 సంవత్సరాలుగా వీరు వేరుగా వున్నంత మాత్రాన అతను విడాకులు

> **"నేను ఇలాగే వుంటాను. నీకు ఇష్టం అయితే వుండు లేకపోతే మీ ఇంటికి వెళ్ళిపో అన్నాడు. కొంతకాలం భరించింది. అతను ఇంటికి రావడమే మానేశాడు. భరించలేక చివరకి ఆమె తన తల్లిగారింటికి వచ్చి వుండటం ప్రారంభించింది. ఆ తరువాత పెద్దవాళ్ళు పంచాయతీ పెట్టారు. ఆమె తనకిష్టం లేదని అన్నాడు. విడాకులు కావాలని అన్నాడు. అది మా క్లయింట్ ఇష్టం లేదు. పోలీసు కేసు కూడా పెట్టింది. కేసు పరిష్కరించడానికి పోలీసులు ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోయింది.**

పొందడానికి అవకాశం లేదు. వారి వివాహం కోర్టు వారు చెప్పినట్టు చచ్చిపోయింది నిజమే! ఆ కారణంగా కోర్టు విడాకులు మంజూరు చేయదని నాకు తెలుసు యువరానర్! ఎందుకంటే అలా చేయడం చట్ట వ్యతిరేకం.

ఒకవేళ కోర్టు అలాంటి భావనకి వచ్చి విడాకులు మంజూరు చేద్దామని భావిస్తే నేను చెప్పే ఈ మాటలు విన్న తరువాత నిర్ణయానికి రావాలని ప్రార్థిస్తున్నాను యువరానర్!

ఈ వయస్సులో అతను విడాకులు తీసుకొని సాధించేది ఏమీలేదు. ఆమెను సాధించడం తప్ప. అతను మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. బహుశా మనుమడు కూడా వున్నాడనుకుంటాను. మా క్లయింట్ కోరుకునేది ఒకటే యువరానర్! ఆమె అతనితో జీవిస్తానని అనడం లేదు. దాంపత్య జీవనాన్ని కూడా ఆమె కోరుకోవడం లేదు. ఒక్క విడాకులు మాత్రమే వద్దని కోరుతుంది.

25 సంవత్సరాలుగా ఒక రకమైన జీవితాన్ని ఆమె అనుభవించింది. వాడి భార్యగా ఈ సమాజంలో చలామణి

అయ్యింది. అతను ఆమెకు అన్యాయం చేసినా, ఆమె కొడుక్కి అన్యాయం చేసినా ఆమె అట్లాగే తన జీవితాన్ని కొనసాగించాలని కోరుకుంటుంది. చివరగా రెండు మాటలు చెప్పి ముగిస్తాను యువరానర్! మొదటి విషయం - వాడికి అంటే మా క్లయింట్ భర్తకి హిందూ వివాహ చట్ట ప్రకారం విడాకులు పొందే అర్హత లేదు. ఇక రెండవ విషయం - నా క్లయింట్ తన శేష జీవితాన్ని డైవోర్సీగా అంటే విడాకులు పొందిన మహిళగా జీవించదలుచుకోలేదు యువరానర్!

ఏకబిగిన ఆవేశం లేకుండా అనర్గళంగా తన వాదనలని విన్పించి తన సీట్లో కూర్చున్నాడు ఆ సీనియర్ న్యాయవాది.

వాదనలని వినిపిస్తున్న క్రమంలో, అతను చెప్పిన విషయాలన్నీ సాక్ష్యాలలో చూపించాడు. వాడికి అతని రెండవ భార్య ద్వారా పుట్టిన పిల్లల సర్టిఫికెట్లని చూపించాడు. అందులో తండ్రిగా అతని పేరే వుంది. అతని వాదనలు విన్న తరువాత అనుకోకుండా ఆమె వైపు చూశాను. ఆయన వాదనలు సంతృప్తి కరంగా ఆమెకు అన్పించాయి. ఆమె మొఖంలో సంతోష ఛాయలు కన్పించాయి.

వాదనలు విన్న తరువాత తెల్లవారి తీర్పు అని చెబుతూ కేసు వాయిదా వేశాను. నమస్కారాలు చేస్తూ అందరూ వెళ్ళిపోయారు. మరోకేసు వాదనలని విని నేనూ బేంచి దిగి వెళ్ళిపోయాను. మర్నాడు ఉదయం స్టెనో బంగ్లాకి వచ్చాడు. ఆ కేసులో తీర్పుని డిక్టేట్ చేశాను.

**"వీళ్ళిద్దరూ టీచర్లు. హిందూ సాంప్రదాయాల ప్రకారం వీరి వివాహం అయ్యింది. రెండు సంవత్సరాలు మాత్రమే వాళ్ళు కలిసి జీవించారు. ఆమె గర్భవతి అయిన తరువాత ప్రసవం కోసమని ఆమె తల్లిగారింటికి వెళ్ళింది. ఓ పిల్లవాడికి జన్మనిచ్చింది. నామకరణానికి వచ్చి అంటి ముట్టనట్టుగా వుండి పోయాడు.**

లంచ్ సమయానికి చాంబర్లోని నా టేబుల్ మీద తీర్పు ప్రతిని టైప్ చేసి వుంచాడు స్టెనో. టైపు తప్పులని దిద్ది, లంచ్ తరువాత బేంచికి వెళ్ళాను. వాళ్ళ కేసుని క్లర్క్ పిలిచాడు. అటెండర్ గట్టిగా వాళ్ళని పిలవకముందే వాళ్ళు కోర్టు హాల్లోకి వచ్చి నిల్చున్నారు. ఎలాంటి తీర్పు వస్తుందోనన్నట్టు వాళ్ళిద్దరూ నిల్చొన్నారు. తీర్పుని ప్రకటించాను.

భర్త దాఖలు చేసిన విడాకుల కేసుని కొట్టివేస్తూ తీర్పుని చెప్పాను. ఆమెకు అనుకూలంగా తీర్పు వచ్చింది. సంతోషంతో ఆమె మొఖం వెలిగి పోయింది. రెండు చేతులతో కోర్టుకు దండం పెట్టింది. సంతోషమో, బాధో తెలియదు గానీ ఆమె కళ్ళల్లో నీళ్ళు కదలాడాయి. కేసులోని యోగ్యత ప్రకారమే ఆమెకు అనుకూలంగా తీర్పుని ప్రకటించాను. ఆ సీనియర్ న్యాయవాది చెప్పిన ముగింపు మాటల వల్ల కేసులో ఆమె వైపు యోగ్యత లేకున్నా అదే తీర్పుని ప్రకటించి వుండేవాడినేమోనని అన్పించింది. అతనిలో భావోద్వేగం లేదు. అయినా ఆ వివాహం చనిపోలేదు. ఆమె వివాహ బంధంలో ఏదో తెలియని బంధం వుందని అన్పించింది.

తీర్పు విన్న ఆమె మొఖంలో అదే భావం కన్పించింది.

# ముక్తి భిక్ష

**వెలపాటి రామిరెడ్డి**

మంత్రముల అర్థమెరుగ, అమాయకుండ
చిత్తశుద్ధి యే భక్తికి చిహ్నమగుట
భుజగహస్తియు శ్రీయును పొందినట్లు
భుక్తి సద్భక్తి కని నాకు ముక్తినొసగు

లేదు నీకు ఆకారమే లేదనుండ్రు
యిన్ని ఆకారాముల ప్రాణి నెట్లు సేతు
లేదు నీకు ఏ నామమూ లేదనుండ్రు
యిన్ని నామాలు ప్రాణులకెట్లు నిడుతు

ఊరు వాడ లేకుండనే ఉందువన్రు
యిన్ని ఊళ్లను వాడలనేలుడెట్లు
లేదు నీకు విలాసము లేదనుండ్రు
నా విలాప మెటకు చేతునయ్య స్వామి



కథ

# గురుకులం

విద్యార్థి చైతన్యానికి అద్దం పడుతూ....



బి ఎస్ రాములు

"నేను వచ్చేసరికి బట్టలు పిండెయ్యి. పప్పు ఉడకవెట్టు నేను వచ్చినంక తాలింపు వెడ్త" అంటూ బయలుదేరబోయింది సుజాత.

"ఇయ్యాల నేనే పనికి పోత. నువ్వే బట్టలుతుకు. వంట చెయ్యి" అని తయారయింది ప్రతిమ.

"ఎందుకే? నన్ను తిట్టిచ్చుటానికా? చిన్న పిల్లగాన్లతోటి పని జేపిత్తున్నని?"

"కాదే! నాకు అమ్మతోని పని ఉంది"

"అమ్మతోని నీకేం పనే?"

"పోయి వచ్చినంక చెప్త"

"అమ్మ ఎందుకు రాలేదే? అని అడిగితే ఏమని చెప్తవే?"

"అమ్మకు జ్వరం వచ్చిందని చెప్త"

"అట్ల చెప్తే నిన్ను నన్ను ఇద్దర్ని రానీయరు కరోనా జ్వరం అనుకొని."

"కడుపునొప్పి అని చెప్త"

"సరే కాని నిన్న అమ్మ ఇచ్చిన ఈ గిన్నె కూడ తీస్కపో!"

"అట్లనే" అంటూ బయల్దేరింది ప్రతిమ.

ప్రతిమ గురుకుల పాఠశాలలో చదువుతోంది. మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో సెలక్టు అయినపుడు ఉద్యోగం వచ్చినంత సంతోషపడ్డారు. స్కూల్లో చేరిన తరువాత ప్రతిమ మాటతీరు మారిపోయింది. రాత తీరు మారిపోయింది. భాష మారి పోయింది. ఇంగ్లీషు మీడియం కావడంతో ఇంగ్లీషులో మాట్లాడ్డం నేర్చింది. ఇరుగు పొరుగు అందరూ ప్రతిమను బాగా మెచ్చుకుంటారు. పౌష్టికాహారం దొరకడంతో నునుపు దేరింది. జొన్నకర్రలా వేగంగా పెరుగుతోంది.

ఈ మధ్య కరోనా కోవిడ్-19 రావడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. ఎవరూ ఇంటినుంచి బయటకు ఎక్కడికి వెళ్లవద్దని నిషేధాజ్ఞలు విధించారు. రాత్రుల్లు కర్ఫ్యూ విధించారు.

స్కూల్లు మూసివేశారు. ఆఫీసులు మూసివేశారు. ఎపుడు తెరుస్తారో తెలియదు.

కొంత కాలం తర్వాత ఆఫీసులు తెరిచారు. సగం మంది ఒకరోజు మరుసటి రోజు మిగతా సగం మంది ఆఫీసుకు వెళ్లాలన్నారు. స్కూల్లు కూడా అట్లనే తీస్తారని ప్రతిమ ఎదురు చూస్తున్నది. ఎంతకూ తెరుస్తలేరు. మార్చ్ నెల పోయింది. ఏప్రిల్ నెల పోయింది. ఎండకాలం పోయింది. వాన కాలం పోయింది. కాలం గడుస్తోంది. స్కూల్లు ఇంకెపుడు తీస్తరో అని ఎదురు చూస్తున్నది ప్రతిమ. ఆన్‌లైన్ క్లాసులంటూ సెల్ ఫోన్లో పాఠాలు చెప్తున్నారు. ప్రతిమకు అవి వినడం విసుగ్గా ఉంది.

శశాంక్ సార్‌ను అడగాలనుకుంది ప్రతిమ. ప్రతిమ ఎంట్రన్సు దరఖాస్తు నింపి అన్ని విధాల సాయం చేసి, స్కూల్లో చేర్పించింది శశాంకే. అపుడు ఎంట్రన్సు ప్రిపరేషన్లో శశాంక్ సార్ బిడ్డ హన్సిత ఎంతో నేర్పించింది. హంసితలా ఎదగాలని ప్రతిమ ఇష్టంగా చదివి సీటు సంపాదించింది.

విసుగు వచ్చి ఓసారి అడగనే అడిగింది ప్రతిమ. హంసిత డాడీ అని పిలుస్తుంటే చనువు పెరుగుతున్న కొద్దీ ప్రతిమకు శశాంక్‌ను సార్ అని పిలిచే బదులు అంకుల్ అని పిలువాలనిపించేది. ఆరోజు చొరవతో అదే ప్రయత్నం చేసింది.

అంకుల్! "మా రెసిడెన్షియల్ స్కూల్లు ఎపుడు తెరుస్తరు? ఇంటికాడ బోర్‌గ ఉంది. పాఠాలు పోతున్నయి అంకుల్".

అంకుల్ అని పిలవనైతే పిలిచింది గాని, పిలిచిన తర్వాత ప్రతిమకు నాలుక తడబడింది. "ఎందుకులే! సార్ అని పిలిస్తే అయిపోయె" అనుకుంది. అంకుల్ అనే సంబోధనను శశాంక్ గమనించక పోలేదు.

"ప్రతిమా! కరోనా కాలంలో వందల మంది స్టూడెంట్స్ కలిసి ఉంటే ఇంకేమైనా ఉందా? ఎంత ప్రమాదమో!" వివరించాడు శశాంక్.

"అయితే సర్! ఒక మాట అడుగ వచ్చా.?" అంకుల్ సంబోధనను వదిలివేసి మళ్లీ సర్ అనే సంబోధనలోకి వచ్చేసింది ప్రతిమ. అది కూడా గమనించాడు

శశాంక్.

"అడుగు" అన్నాడు.

"సర్! ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ టీచర్లు పని చేయక పోయినా కరోనా కాలంలో జీతాలిస్తున్నారు. మీరు కూడా మాకు రెండు నెలలు పని చేయక పోయినా పూర్తి జీతం ఇచ్చిన్రు. థాంక్స్. సర్! అయితే మా కోసం రెసిడెన్షియల్ స్కూల్లో ఏడాదికి లక్ష ఖర్చు పెడుతున్నది. మాకిది ప్రభుత్వ ఉద్యోగం తీరుగ నెలకు పదివేలు ఖర్చు పెడుతున్నదని మీరే అన్నరు. అందుకే ఉద్యోగంలాగా కెజి టు పిజి ఉచిత రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిస్తుంది అన్నారు. మరి మాకు కనీసం డైట్ ఛార్జెస్ అయినా మాకు నెల నెల ఇస్తే బాగుంటుంది గద సర్! మేం ఆన్ లైన్ క్లాసులు కూడ వింటున్నం గద సర్! మాకు ఇంట్లో కష్టంగా ఉంది సర్!"

ఆ మాటతో శశాంక్ ఆలోచనలో పడ్డాడు. పిల్లలు ఎంత లాజికల్‌గా ఆలోచిస్తారో అనుకున్నాడు.

"అలా చేస్తే బాగానే ఉంటుంది." అంటూ శశాంక్ ప్రతిమను మెచ్చుకున్నాడు.

అట్ల స్కూల్ గురించి, క్లాస్ మేట్స్ గురించి, టీచర్ల గురించి ఆలోచిస్తూ నడుస్తున్నది ప్రతిమ. ఎన్ని ఆటపాటలు, పాఠాలు మిస్సయ్యాయో! ఎల్లుండే తన బర్త్‌డే. స్కూల్లో అయితే అందరిలో ఎంత గ్రాండుగా ఉండేదో! స్కూల్ నడిస్తే ఈ పాటికి లెసన్స్ ఒక రౌండు పూర్తయి ఉండేవి. హన్సిత తన క్లాసే చదువు తోంది. కాని ఆ ప్రయివేటు బడిలో ఫీజులమోత, పుస్తకాల మోత ఎక్కువ. ఆటపాటలు తక్కువ. అంతా బట్టీయం. హన్సిత ఒకోసారి తననే అడుగుతుంది. తనకు స్కూల్లో క్లాసులు చెప్పడం, ఉపన్యాసాలివ్వడం కూడ నేర్పించారు. తను క్లాసు చెపుతుంటే హన్సిత ఎంత ఆసక్తిగా చూస్తుందో! తనకలా చెప్పడం రావాలని ఎంత కష్ట పడుతుందో! ఆలోచనతోనే ఇల్లు చేరుకుంది ప్రతిమ.

"గుడ్ మార్నింగ్ సర్" అంటూ ఇంట్లోకి అడుగు పెట్టింది ప్రతిమ.

"గుడ్ మార్నింగ్" అంటూ చిరునవ్వు నవ్వాడు శశాంక్.

"గుడ్ మార్నింగ్ హన్సిత" అంటూ పలకరిస్తూ చేయి చాపింది ప్రతిమ. హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్‌తో కుస్తీ పడుతున్న హన్సిత టేబుల్ ముందు నుంచి లేసి షేక్ హాండిచ్చింది.

"గుడ్ మార్నింగ్ అమ్మా!" అంటూ నమస్కరించింది ప్రతిమ.

"ఇవాల నువ్వచ్చినవేమే ప్రతిమా.? బోల్లు, బట్టలు బాగున్నయి." అంది స్వరూప.

"అమ్మకు కడుపు నొప్పి. నన్ను పొమ్మన్నది" అంటూ పొయికాడి గిన్నెలు బాల్కనీలోకి తెచ్చింది ప్రతిమ.

"అయ్యో! మాస్కు కట్టుకోలేదేమే! కరోనా తెచ్చుకొని అందరికి అంటిస్తవ! ఆగు." అంటూ ఒక కొత్త మాస్కు టేబుల్ మీద పెట్టింది స్వరూప.

ముందు బట్టలు వాషింగ్ మిషన్లో వేసింది ప్రతిమ. ఎండిపోయిన గిన్నెల మీద నల్లా తిప్పి నీల్లు చల్లింది. చీపురు తీసుకొని ఊడ్వడం మొదలు పెట్టింది.

"దేవునిగదికెయి పోకు"

"అమ్మా నేను స్నానం చేసి వచ్చిన"

"ఈమె ఉన్నది చూడు. ఏమాయెనే హన్సితా! ప్రతిమ స్నానం చేసి అంత దూరం నుంచి వస్తే నువ్వు ఇంకా అట్లనే ఉన్నవులే! స్నానం చెయ్యి!"

"మాకు పొద్దున్నే స్నానం చేయడం అలవాటు. ఈ పాటికి టిఫిన్ కూడా పెట్టరమ్మా!" అంది ప్రతిమ.

"దీన్ని కూడ ఏదైనా రెసిడెన్షియల్ స్కూల్లో వేస్తే ఇది కూడ అన్ని నేర్చుకుంటుండె." స్వరూప నవ్వుతూ ప్రతిమను మెచ్చుకొంది.

లైజాల్ ఫ్లోరింగ్ క్లీనింగ్ మందు వేసి తుడిచింది ప్రతిమ. అంట్లు తోమి, రెండు టిప్పుల బట్టలు ఆరేసింది.

రెసిడెన్షియల్ స్కూల్‌కు పోయినంక ప్రతిమ "నాకన్న ఎక్కువ ర్యాంకు తెచ్చుకుంటున్నది. దీనికి నైంటీ ఫైవ్. నాకు సెవెంటీ ఫైవ్ వచ్చినయి." అని మెచ్చుకుంది హన్సిత.

"ఈమెకు మంచి ఉద్యోగమే వస్తుంది, ఎంత మర్యాద! ఎంత సంస్కారం! బాగా చదువుకోవే! "మన సార్ కూడ సాయం చేస్తడు" అంది స్వరూప.

"అట్లనే అమ్మా!"

చేతులు తుడుచుకొని నిలబడింది ప్రతిమ.

ప్రతిమకు స్వరూప నాలుగు ఇడ్లీలు సాంబారు ప్లేటు అందించింది.

"మాస్కుతోని ఎట్ల తినాలె అమ్మా!" అంటూ నవ్వింది ప్రతిమ.

స్వరూప కూడ నవ్వింది.

"రెసిడెన్షియల్ స్కూలుకు పోయినంక మస్తు హుషారైనవే" అని మెచ్చుకుంది స్వరూప.

"అక్కడ చాలా మంది అక్కలుంటరు కదమ్మా! సీనియర్లను చూసి నేర్చుకుంటం."

"మాస్కు తీసి అట్ల దూరంగ కూర్చో".

"దానికే ముందు పెట్టినవు. నాకేది?"

"నువ్వేం పని చేసినవే? ఇది బండెడు గిన్నెలు తోమింది. వాషింగ్ మిషన్లో బట్టలు వేసి, రెండు ట్రిప్పుల బట్టలు ఆరేసింది. ఇల్లు తుడిచింది. నీకు చదువు గూడ చెప్పవట్టె!"

ప్రతిమకు అమ్మ మెచ్చుకునే సరికి అలసటంతా పోయినట్లయింది. టిఫిన్ ప్లేట్ తీసుకొని దూరంగా కింద

**"సర్! ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ టీచర్లు పని చేయక పోయినా కరోనా కాలంలో జీతాలిస్తున్నారు. మీరు కూడా మాకు రెండు నెలలు పని చేయక పోయినా పూర్తి జీతం ఇచ్చిన్రు. థాంక్స్. సర్! అయితే మా కోసం రెసిడెన్షియల్ స్కూల్లో ఏడాదికి లక్ష ఖర్చు పెడుతున్నది. మాకిది ప్రభుత్వ ఉద్యోగం తీరుగ నెలకు పదివేలు ఖర్చు పెడుతున్నదని మీరే అన్నరు. అందుకే ఉద్యోగంలాగా కెజి టు పిజి ఉచిత రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిస్తుంది అన్నారు.**

కథ

కూర్చోబోయింది.

“బట్టలు పాడైతై. ఆ స్టూల్ మీద కూర్చోవే అంది స్వరూప.

“చదుకునే పిల్లను కింద కూర్చో బెట్టడం మర్యాద కాదని స్వరూపకు తెలుసు.

టిఫిన్ తిని ప్లేటు కడిగి తోమి పెట్టేసింది ప్రతిమ. మళ్లీ మాస్క్ కట్టుకుంది.

ఏదో అడగాలని నిలబడింది.

“అమ్మా! ఎల్లుండి నా బర్త్‌డే. మా స్కూల్లోనైతే బర్త్ డేని ఎంత గ్రాండ్‌గా చేస్తారంటే...” చెప్పుతూ పోయింది.

“ఇక్కడ ఇంటికాడ కూడ చేసుకోవచ్చు గదనే.”

“పైసలు లేవు. కొత్త డ్రెస్ కూడ లేదు.”

“కరోన కాలంల ఎవల దగ్గరున్నయే పైసలు. అయినా సార్నడుగు”

కరోనా లాక్ డౌన్‌లో రెండు నెలలు తానే పని చేసుకుని జీతం మాత్రం చిన్న జీతాలు కదా అని ఫుల్ జీతం ఇచ్చేసింది.

పేపర్ చదువుతున్న శశాంక్ సార్ దగ్గర నిలబడింది ప్రతిమ. అడుగుల చప్పుడుకు ప్రతిమ వైపు ఏంటి సంగతి అన్నట్టు చూశాడు శశాంక్.

“ఎక్స్ క్యూజ్ మి సర్. ఎల్లుండి నా బర్త్ డే. రెండువేలు కావాలె సర్. వచ్చే నెల నుంచి నెలకైదు వందలు పట్టుకోండి”

ఆ అడిగే తీరు చూసి శశాంక్‌కు భలే ముచ్చటేసింది. ప్రతిమ ఎంత తొందరగ ఎదిగింది! ఆ అడగడంలో ఎంత ఆత్మ విశ్వాసం! ఎంత వినయం! ఎంత సంస్కారం! మనసులో మెచ్చుకొని ప్రశంసా పూర్వకంగా నవ్వాడు శశాంక్.

“ఇవ్వు డాడీ!” అంటూ హన్సిత గారాబం పోయింది మెడ చుట్టూ చేతులు వేస్తూ.

అయిదు వందల నోట్లు నాలుగు చేతిలో పెట్టాడు శశాంక్.

“ఇందులో వెయ్యి నీ బర్త్‌డేకి నా గిఫ్ట్. హన్సితకు క్లాస్ కూడా చెప్తున్నవు”

“థాంక్యూ సర్!” అంటూ కృతజ్ఞతగా చూసింది ప్రతిమ.

వచ్చిన పని పూర్తయినట్టు మాస్కు సరిచేసుకుంటూ చెంగున పరుగెత్త బోయింది ప్రతిమ.

“ఈవినింగ్ తొందరగ రావే. పాఠం చెప్పాలె” హన్సిత పిలుపుతో ప్రతిమ సరేనంటూ సంతోషంగా ఇంటికేసి నడిచింది”.

తోవలో కనపడితే కొన్ని కూరగాయలు కొన్నది. పోస్టాఫీస్‌కు పోయి ఫ్రెండ్స్‌కు రాయడానికని కొన్ని పోస్ట్‌కార్డులు కొన్నది. ఇంటికి చేరేసరికి తల్లి సుజాత కుట్టు మిషను మీద ఏదో కుడుతున్నది. వంట అయిపోయినట్లుంది అనుకున్నది ప్రతిమ.

ఫోన్ తీసుకొని నెంబర్లు కలిపింది. రెండు మూడు సార్లకు ప్రిన్సిపల్ మేడమ్ సుహాసిని ఫోన్ ఎత్తింది.

“గుడ్ మార్నింగ్ మేడమ్”.

“గుడ్ మార్నింగ్ ప్రతిమ, బాగున్నావా? బాగా చదువుతున్నావా?”.

“బాగా చదువుకుంటున్నాను మేడమ్.

**అట్ల స్కూల్ గురించి, క్లాస్ మేట్స్ గురించి, టీచర్ల గురించి ఆలోచిస్తూ నడుస్తున్నది ప్రతిమ. ఎన్ని ఆటపాటలు, పాఠాలు మిస్సయ్యాయో! ఎల్లుండే తన బర్త్‌డే. స్కూల్లో అయితే అందరిలో ఎంత గ్రాండుగా ఉండేదో! స్కూల్ నడిస్తే ఈ పాటికి లెసన్స్ ఒక రౌండు పూర్తయి ఉండేవి. హన్సిత తన క్లాసే చదువు తోంది. కాని ఆ ప్రయివేటు బడిలో ఫీజులమోత, పుస్తకాల మోత ఎక్కువ. ఆటపాటలు తక్కువ. అంతా బట్టీయం. హన్సిత ఒకోసారి తననే అడుగుతుంది. తనకు స్కూల్లో క్లాసులు చెప్పడం, ఉపన్యాసాలివ్వడం కూడ నేర్పించారు. తను క్లాసు చెపుతుంటే హన్సిత ఎంత ఆసక్తిగా చూస్తుందో! తనకలా చెప్పడం రావాలని ఎంత కష్ట పడుతుందో! ఆలోచనతోనే ఇల్లు చేరుకుంది ప్రతిమ.**



కథ

రెసిడెన్షియల్ స్కూల్లు ఎప్పుడు తీస్తారు మేడమ్. ఇంటికాడ బోర్‌గా ఉంది" అంది ప్రతిమ.

"ఏమో చెప్పలేము. కరోనా ప్రమాదం ఎప్పుడు తగ్గుతుందో అప్పుడు స్కూల్లు తెరుస్తారు. అయినా తెలుగులో మాట్లాడుతున్నావేంటి? ఇంగ్లీషులో మాట్లాడాలని చెప్పినా కదా!" అంటూ ఇంగ్లీషులో ప్రశ్నించింది సుహాసిని.

"ఇంగ్లీషులో మాట్లాడితేనే ప్రాక్టీస్ అవుతుంది" అంది మళ్లీ.

"ఓకే మేడమ్ ఐ విల్ స్పీక్ హియర్ ఆఫ్టర్ విత్ హన్సిత అండ్ హిజ్ ఫాదర్".

"ఆర్ యూ టీచింగ్ హన్సిత?"

"యస్ మేడమ్ దే గిఫ్టెడ్ మి ఆల్సో ఆన్ ది అకేషన్ ఆఫ్ మై బర్త్‌డే. ఐ విల్ సెలబ్రేట్ మై బర్త్‌డే ఎట్ మై హోమ్".

"విష్ యు హ్యాపీ బర్త్‌డే ప్రతిమ"

"థాంక్యూ మేడమ్" "ఐ యామ్ రైటింగ్ బర్త్ డే గ్రీటింగ్స్ టు మై ఫ్రెండ్స్. ఆన్ దేర్ బర్త్‌డేస్".

"ఓకే ఓకే" కంగ్రాచులేషన్స్.

ప్రతిమ తన క్లాస్ టీచర్‌కి పీడి మేడమ్‌కు ఫోన్ కలిపి మాట్లాడింది. కొంతమంది ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసింది. అరగంట మాట్లాడిన తర్వాత అప్పుడు రెసిడెన్షియల్ స్కూల్లో ఉన్నట్లుగా ఫీలింగ్ కలిగి సంతోషపడింది ప్రతిమ.

"మీ స్కూల్లు ఎప్పుడు తీస్తరటనే".

"కరోనా తగ్గినంక తీస్తరట" అంది ప్రతిమ.

కరోనా ఎప్పుడు తగ్గుతుందో బిడ్డ! బిడ్డ స్కూలుకు ఎప్పుడు పోతుందో అనుకుంటూ సుజాత తనలో తాను గొనుక్కుంది.

"ఆకలవుతుందేమో తినవే" అంది పాతబట్ట ఏదో కుట్టుకుంటూ సుజాత.

"అమ్మ ఇడ్లీ పెట్టిందే ఫుల్ అయిపోయింది. ఇవాళ విజిటేబుల్ కర్రీ కూడా వండుతా. వండిన తర్వాత లంచ్ చేస్తనే".

ప్రతిమ అప్పుడప్పుడు తల్లికి ఇంగ్లీషు పదాలు నేర్పుతుంది. సుజాత కూడా ఇంగ్లీషు పదాలు వాడడం నేర్చుకుంటున్నది.

"సార్ తౌజండ్ రూపీస్ గిఫ్ట్‌గా ఇచ్చిండు. కొత్త డ్రెస్ రెడీమేడ్‌ది కొనుక్కుంటా. రేపు హన్సితను తీసుకుపోయి డ్రెస్ సెలెక్ట్ చేసుకుంట".

"కొత్త ఫ్యాషన్స్ చాలా వచ్చినయ్" అంది ప్రతిమ.

అమ్మా అని, మా మమ్మీ అంటూ గారాబం పోతూ సార్ ఇచ్చిన రెండువేలు తీసి చూపించింది ప్రతిమ.

"అందుకేనా పనికి పోతానన్నది" అంటూ మురిపెంగా చూసింది సుజాత.

కవిత

# మూల మలుపు

**కరిపె రాజ్ కుమార్**

కోడికూతే మేలుకొలుపై
పాడితీతే పొద్దుపొడుపై
పొలంకోతే ఆటవిడుపై
హరికథే మూలమలుపై
ఊరు సద్దుమణిగే తీరు!

పచ్చిమట్టి పరిమళాలు
వచ్చి తట్టే పైరగాలులు
తట్టి లేపే పలకరింతలు
తుళ్ళి పాడే పలవరింతలు...
పల్లె! ఒకనాటి పసిడి ముల్లె!!

గుప్పుమనే గంజాయి ఘాట్లు
గుట్టు విప్పుమనే అశ్లీల వెబ్సైట్లు
గట్లు తెంచుకున్న గలాసు శృంఖలాలు
పందాలు కాసే పైలాపచ్చీసులు
ప్రాణాలు పణం పెడుతున్న పడుచుప్రాయాలు!

పట్టణాలకే పరిమితమైన పలుజాడ్యాలు
గ్రామాలను చుట్టుముట్టిన విపరీత విశృంఖలాలు
వింత పోకడల వంతపాటలు! ఉరుముతున్న ఉపద్రవాలు
తల్లిదండ్రులే ఆలోచనాలోచనాలై వ్యవహార దక్షతతో
మూల మలుపు కాపలాదారులై పెడదారులు పట్టకుండా
పల్లెకు పుటం పెట్టాలి!!!



# కొండెత్తు నిలిపిన కొండరెడ్ల పరిశోధన

పరిశోధనలోని ఎత్తు పల్లాలను స్పృశించిన వ్యాసం...



డా॥ నోరి రాజేశ్వరరావు

కాలంతో పనిలేకుండా కాలమే వారైనా, కనుమరుగైన జీవితాల గురించి వర్తమానంలో అధ్యయనం ఎంతో సంతోషకరం. "హరిజనులు గిరిజనులు అందరు నేడు పురజనులే" అన్న సినారె వాక్య నేపథ్యంలో మనలో చేర్చుకోవ డానికి, మనమున నిలుపుకోవడానికి తోడ్పడే మూలకం పరిశోధనే. ఆ పరిశోధనలు 21వ శతాబ్దం తొలి రెండు దశకాల్లో మరింత వృద్ధి పొందిన కారణంగా వచ్చిన వినూత్న ఫలాలలో డా. కపిల భారతి కొండరెడ్డి గిరిజనుల జీవనం - భాషాసాహిత్యాంశాల పరిశోధన గుర్తించదగినది.

నిజానికి ఈ పరిశోధన రెండు ప్రధాన విషయాలలో సఫలత సాధించిందనవచ్చు అవి నిర్దిష్ట ప్రణాళిక, క్షేత్ర పర్యటన. ఈ రెండు విషయ పరిధిలో అకడమిక్ సైన్సులో లక్ష్యాన్ని సాధించాయి.

ఈ వేగవంతమైన జీవితంలో వ్యక్తులు యాంత్రికంగా తయారవుతున్నారు. చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష అన్నమాట. మనిషి ఆలోచనా పరిధిని తగ్గించివేసింది. జంతు, బుద్ధిజీవులుగా విడివడిన సమాజాల నేపథ్యంలో బుద్ధిజీవుల విస్మృతిలో మానవ సమాజానికి ఆదిమూలాలైన గిరిజన సమాజాల సంస్కృతి సంప్రదాయాలు, భాషాసాహిత్యాలు కనుమరుగవు తున్నాయి. ఇలాంటి సమయంలో భారతి ఈ పరిశోధనను ఇష్టపూర్వకంగా చేశారనే విషయం ఈ సిద్ధాంత వ్యాస గ్రంథం ప్రతిపుటలో దర్శనమిస్తుంది. ఆచార్య కసిరెడ్డి గారన్న మాటలు స్ఫురణకు తెచ్చుకుంటే "కొండరెడ్లది తెలుగు భాషే కాని ఆ భాష వేదాల్లోని సంస్కృతం లాంటిది. అష్టాధ్యాయి వంటి వ్యాకరణానికి వేద సంస్కృతం లొంగనట్లే. ఈ కొండరెడ్ల గిరిజన భాష బాల వ్యాకరణానికి వంగదు". ఇక భారతి పరిశోధనలో అంశాలు, ఉమ్మడి కుటుంబ భావన, గౌరవ మర్యాదలందించే




సభ్యతాసంస్కారం, స్నేహబంధాన్ని పాటించడం. ఈ కారణంగా కొండరెడ్లు కోయ, నాయకపోడులతో సాన్నిహిత్యం కలిగి వుంటారనే అంశాలన్నీ భారతిగారి పరిశోధనా ఫలాలే.

పుట.53లో పరిశోధకురాలు కొండరెడ్ల పెళ్ళి ప్రస్తావనలో (3 రోజుల పెండ్లి) పెండ్లి 3వ రోజు వసంతాల నిర్వహణ వివరణ తెగపరంగా నూతనాంశంగా తెలియజేశారు. అయితే ఈ తెగలో మనకు రాని, మనం ఊహించని సమసమాజ భావన ప్రధానంగా ఆర్థిక, అనార్థిక భేదాలు లేకుండా జరుపుకోవడం తెలియజేయడం ద్వారా ఈ తెగ ఉన్న తత్వం, ఉత్తమత్వాన్ని బహిర్గతం చేశారు.

అలాగే పుట.55లో పండుగలు శీర్షికలో వీరికి భూమి పట్ల విశ్వాసం, భూమి తన హక్కుగా భావిస్తారనే విషయం చదివి నప్పుడు ఈ తెగ పట్ల గౌరవ భావం పెరుగుతుంది. ఎందుకంటే ఆశకు పోయి, ఎండమావులను వెంబడిస్తూ, భూమిని అమ్ముకుని తాత్కాలిక సుఖాలే శాశ్వతం అనుకనే నాగరిక జాతికిది ఒక చెంపపెట్టుగా అనిపిస్తుంది. ఈ విషయాల్లో కొండరెడ్లే అధికులు అన్న భావన కలుగుతుంది. కొండరెడ్లను పాండవ రెడ్లుగా తెలియజేయడం పరిశోధకురాలి విషయసేకరణకు ఫలితంగా కనిపిస్తుంది. (పుట.71) "అప్పు

చేయనివాడు, తప్పు చేయనివాడు ముప్పారిన పడడు" అన్నాడొక కవి. ఆ కవివాక్యాలు కొండరెడ్లకు నూటికి నూరు శాతం వర్తిస్తుంది. పరిశోధకురాలు పుట. 102లో "అప్పు అనేది కొండరెడ్డి గిరిజనులకు తెలియని పదం" అని చెప్పడం ద్వారా కొండరెడ్ల తెగవారి ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్ఠమైనదని అనిపిస్తుంది. అంటే వారిది ప్రణాళికాబద్ధమైన జీవితం. అయినదానికి, కానిదానికి అప్పు చేసే వాళ్ళు ఈ తెగ నుంచి అప్పు లేకుండా బతకడం నేర్చుకోవాలన్న సత్యం ఈ పరిశోధనలో బహిర్గతమైందన్నది నిజం.

ఈ పరిశోధనలో ప్రధానంగా భారతి కొండరెడ్ల మాండలిక భాషలో కథను, తెలిపి తదుపరి తెలుగులో చెప్పడం చక్కని సంభావ్యతను కలిగిస్తుంది. ఇది నిజానికి శ్రమతో కూడింది. ఇక్కడ కూడా భారతి కష్టంతో విజయం సాధించింది. కొండరెడ్ల పాటల్లో 'లేలేలేలేలే' అనే ప్రయోగపదం ఉత్సాహానికి ప్రతీకగా చెప్పడం కొత్త విషయం. ఇదే మనం ధ్వన్యర్థక పదంగా సంభావిస్తాము. (పుట.165) అలాగే వీరి పాటలో (175 పుట. పాట.6) 'వీరాపు వీరుడమ్మ' పద ప్రయోగం. సాధారణంగా వీరాధివీరుడమ్మ అనటంగా ప్రచారంలో వుంది. వీరి పాటలో రెండు దీర్ఘాక్షరాల తరువాత హ్రస్వ ప్రయోగం అటు పాడుకోవడానికి, ఇటు ఛందశాస్త్ర పరిశీలనకు దోహదపడేదిగా కనిపిస్తుంది. (185) పుటలో 'బెజమ్' వివరణ బాగుంది.

ఈ పరిశోధనకు శిఖరాయమానం 5వ అధ్యాయం "కొండరెడ్డి గిరిజనుల భాషా విశేషాలు". కొన్ని టకారం బదులు తకారం (అంటారొఅంతాం) (పుట.187) కొన్ని పదాలు పూర్ణ బిందువు రూపం కలిగి వుంటాయి. (పుట.188) కూతొకూంత (7వ శతాబ్దం శాసన సాహిత్యంలో ఈ మాట ప్రచారంలో వుంది) అలాగే 'లబ్బి' వికృతి పదం (పుట.190) ఒడుపు ఉపాయం (పుట. 192) ఈ పదం తిక్కన భారతంలో పలుమార్లు ప్రయోగించబడింది (మాండలిక పదం).

ఈ విధంగా ఒక మంచి పరిశోధన జీవిత సార్థకతకు ఉపకరణంగా శ్రమించి, తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య భట్టు రమేష్ గారి పర్యవేక్షణలో రావడం సంతోషకరం. ఈ పరిశోధన చదువుతున్నపుడు పరిశోధకురాలి అక్షరాల్లో, అమరికలో, కృషిలో నిద్రలేని రాత్రులు, తిండి లేని పగళ్ళు, ఆమె శ్రమకు గుర్తులుగా నిలుస్తాయి.

ఏదేమైనా పరిశోధకురాలు డా. కపిల భారతి ఈ పరిశోధనా కృషి అభినందనీయం. క్షేత్ర పర్యటనాపరమైన పరిశోధనలు చేపట్టే పరిశోధకులకు ఈ పరిశోధనా గ్రంథం మార్గదర్శనం చేస్తుంది అన్నది సత్యం.






## By Many a Happy Accident: Recollections of a Life

ముహమ్మద్ హమీద్ అన్సారి, రెండు పర్యాయాలు దేశ ఉపరాష్ట్రపతిగా సేవలందించారు. హమీద్ అన్సారి తన ఆత్మకథను **By Many a Happy Accident: Recollections of a Life** అనే పుస్తక రూపంలో పొందుపరిచారు. తన జీవితంలో జరిగిన అనేక అనుకోని సంఘటనలను, జీవిత గమనాన్ని మార్చిన విధానాలను ఈ పుస్తకంలో వివరించారు. అంతేకాదు దేశ విభజన నాటి నుండి నేటి వరకు తన జీవితంలోని రాజకీయక, సామాజిక, మతపరమైన, దౌత్య పరమైన అనేక అనుభవాలను హమీద్ అన్సారి ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## Wild and Wilful

మానవులతో పాటు, జంతువులు, పక్షులు, కీటకాలు లాంటి అనేక ప్రాణులు భూమిపై జీవిస్తున్నాయి. అయితే అన్ని జీవుల మనుగడ, వాటిపై మానవుల ప్రభావం వంటి అంశాలపై Wild and Wilful పుస్తకాన్ని రచించారు నేహా సిన్హా. ముఖ్యంగా మన దేశంలో వివిధ జంతుజాతులకు మానవులు నుండి జరుగుతున్న హాని, వాటి మనుగడ




ప్రశ్నార్థకమవుతున్న విధానాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఏనుగులు, పులులు, పక్షులు వంటి అనేక జంతుజాతుల సంరక్షణకు అవసరమైన చర్యలను సైతం ఈ పుస్తకంలో వివరించారు.

వ్యాసం

# సాహితీవేత్త శ్రీ వెల్చాల కేశవరావు

నాటి తరం సహృదయ సాహిత్యాన్ని చిత్రిస్తూ...



డా॥ ఆర్. కమల

తెలంగాణ కవులలో కవిరాయలు, కవి భూషణ బిరుదాంకితులు గుండి ప్రాంత నివాసి వెల్చాల కేశవరావు గారు. ఒడ్డూ పొడుపూ హుందాతనంతో పాటు, మనసున్న మనీషి. 1908లో జన్మించిన వీరు పెత్తండ్రికి దత్తుగా గుండి గ్రామానికి వెళ్ళినా,జన్మస్థలం కురిక్యాల. ఈ ఊరికి దగ్గరగా శిలాఫలకంపై జైన శాసనమున్నది. అరి కేసరి ప్రభువు పంపమహాకవి తమ్ముడైన జినమల్లునికి ఈ ప్రాంతాన్ని దానమిచ్చినట్లు అక్కడి జనులు చెప్పగా కేశవరావు చిన్నతనంలోనే తెలుసుకున్నాడు. అప్పటి నుండి భారత భాగవతాలు శ్రద్ధతో చదివారు. ఉర్దూ ఆంగ్ల భాషలు నేర్చుకున్నారు. అమరం కంఠస్థం చేసారు.

పెరిగి పెద్దయ్యాక గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికై శ్రమించారు. ఆధునిక భావాలున్న ఆయన అనేక సత్కార్యాలు చేశారు. బాధ్యత గల పదవులు నిర్వహించి అధికారుల ప్రశంసలందుకున్నారు. సారస్వత పరిషత్ పరీక్షలు గుండీలో నిర్వహించారు. ధనం సంపాదించటమే కాదు, పాత్రోచితంగా దానమివ్వాలనే వారు. "ఊహాలోకం" గేయ సంకలనం, మిత్రనీతి శతకం (కంద పద్యాలతో) "నేను నా జ్ఞాపకాలు - వారి కుటుంబ జీవితం" వంశవృక్షం రచించారు. వీరి రచనల్లో పాండిత్యంతో పాటు, సామాజిక దృష్టి ఉన్నది. ఆత్మపరిశీలన, విమర్శ, సంస్కరణ కనిపిస్తాయి. వాస్తవికత, మానవతావాద దృక్పథం వారిది.

కవి సమ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ గారు ఆయన రచించిన "కేదార గౌళ" కృతిని వీరికి అంకితమిస్తూ యిలా అన్నారు.

"వెలమ వారిలోన వెల్చాల కేశవ
రావనగ నొక యువరావు కలడు
చదువు కవిత సరియు సంపతి
కలవాడు
ఈ కరీంనగరపుటరుగులందు"

**పరాయి రాష్ట్రాల్లో, ప్రక్క ప్రాంతాల్లో జరుగుతున్న విషయ సేకరణ మన తెలంగాణలో జరుగుట లేదని బాధను వ్యక్తం చేసేవారు. స్వంత లాభం కొంతమానుక , మీమీ ప్రాంతాల్లో పడిపోతున్న దేవాలయాలు, కుడ్యాల మీది చిత్రాలు శాసనాలు, శిల్పకళలు, గుహలు కనివిని ఎరిగిన కవులు ప్రచురణ కాక, ప్రజల నాల్కల మీద నున్న మౌఖిక సాహిత్యం, పూర్వకవుల రచనలు చిరిగి పోతున్న, చెదలు పడుతున్న సాహిత్యం సేకరించాలనేవారు.**

అని ప్రశంసించారు. జంట కవులైన శేషాద్రి రమణ కవులలో ఒకరైన దూపాటి వేంకట రమణా చార్యులు.

"చవిచూచి నాడవు సరస్వతీ
సాహిత్య సంపూర్ణ సౌష్టవంబు" అని
వెల్చాల వారినిలా కొనియాడారు.

వీరేకాక ప్రజాకవి చెన్నుపల్లి సుబ్బారావు, దప్పూరి సత్యనారాయణాచార్య, వీరిని కొనియాడిన కవులు. గర్రెపల్లి సత్యనారాయణ రాజు "శ్రీ వెల్చాలా న్వయాపారావార సుధాకరా! ధీనిధీ కేశవరాయా!" అని అభివర్ణించారు.

కవి పండితులకు కరీంనగర్ జిల్లా పెట్టింది పేరు. నాటి నుండి నేటి వరకు సారస్వత జ్యోతి మిత్రమండలి సంస్థ ద్వారా కవి సమ్మేళనాలు, కవితా గోష్టులు, పుస్తకావిష్కరణలు జరుగుతుంటాయి. ఆ కార్యక్రమాలన్నీ కరీంనగర్ గాంధీగా పిలువబడే శ్రీ బోయినపల్లి వేంకటరామారావు చూసుకునేవారు. కవి సమ్మేళనాలకు శ్రీ కేశవరావు అధ్యక్షులుగా వ్యవహరించేవారు. అప్పటికే కరీంనగర్ గ్రంథాలయ వారోత్సవాలు, సాహిత్య సభలు, స్వాతంత్ర్య సమర యోధుల సభలు, కమ్యూనిష్టు సభలు ఘనంగా జరిగేవి. సభలకు జనులు చాలా మంది వచ్చేవారు. వక్తలు చెప్పిన విషయాలు శ్రద్ధగా వినేవారు. రజాకార్ల ఊచకోతలు, నిజాం నిరంకుశ పరిపాలన

గురించి సభల్లో ప్రసంగించటమే కాక, విజ్ఞాన ప్రచురుణ గ్రంథమాల ద్వారా జ్యోతి, జయంతి పత్రికల ద్వారా ప్రచురించి ఆవిష్కారం చేశారు.

ఆ సభల్లో కొన్నింటిలో వక్తగా, మరికొన్నింటిలో శ్రోతగా శ్రీ కేశవరావు గారు పాల్గొనేవారు. తెలంగాణ ప్రాంతపు గుళ్ళు, కోటలు వాటి పూర్వవైభవం, ప్రాచీన రాజు లేలిన పట్టణ ప్రాంతాలు, పురాతన చరిత్రాంశాలు, నాణాలు, శాసనాలు వాటి వాటి జాడలు, ఆ ప్రాంతాల్లో జరిగే పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు అవకాశమిచ్చినప్పుడల్లా సవివరంగా విన్పించేవారు. అంతేకాక, పేద పండితులను వెదికి వారి వారి అడ్రసులు కనుక్కొని, వారి పూర్వీకులు వ్రాసి పెట్టుకున్న వ్రాతపత్రులను, తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, ప్రచురణల కవసరమయ్యే ధనమిచ్చిన దాత. ఆయన యిచ్చిన గుప్తదానాలెన్నో తీసుకున్నవారికే ఎరుక. ఆయన యిచ్చిన వెంటనే మరచేవారు.

మనకు తెలిసిన ప్రాచీన వైభవం, చరిత్ర చాలా తక్కువని తెలుసుకున్నది గోరంత, తెలుసుకోవలసింది కొండంతని ప్రతి సభలో పదే పదే చెప్పేవారు. ఉత్సాహవంతమైన యువకులు ఓర్పుతో, నేర్పుతో వెదికి తెలుసుకోవాలనే వారు. యువకుడు నిత్య పరిశోధకుడు కావాలని, రాబోయే తరాలకు పరిశోధనాంశాలు అందించగల బాధ్యత మనందరిదని నొక్కి వక్కాణించేవారు.

పరాయి రాష్ట్రాల్లో, ప్రక్క ప్రాంతాల్లో జరుగుతున్న విషయ సేకరణ మన తెలంగాణలో జరుగుట లేదని బాధను వ్యక్తం చేసేవారు. స్వంత లాభం కొంతమానుక, మీమీ ప్రాంతాల్లో పడిపోతున్న దేవాలయాలు, కుడ్యాల మీది చిత్రాలు శాసనాలు, శిల్పకళలు, గుహలు కనివిని ఎరిగిన కవులు ప్రచురణ కాక, ప్రజల నాల్కల మీద నున్న మౌఖిక సాహిత్యం, పూర్వకవుల రచనలు చిరిగి పోతున్న, చెదలు పడుతున్న సాహిత్యం సేకరించాలనేవారు. ఏయే రాజులు, ప్రభువులు, ప్రజాహితకార్యాలు చేసిన ధనవంతులు వారు తవ్వించిన చెరువులు, కట్టించిన సత్రాలు, విద్యాదాతలు, అన్నదాతలు ఏయే ప్రాంతాల్లో ఉండేవారో వారిని స్మరించి, ముందు తరాల కందించాల్సిన బాధ్యత మనందరిదని వెతికి వెలికితీసి పత్రికల ద్వారా ప్రకటించాలని ప్రబోధించేవారు.

ప్రతి పనికి పైసా అవసరమని పైకం లేదని పనులు కావని యువకులు తల్లిదండ్రుల మీద ఆధారపడి జీవిస్తారు కనుక జీతభత్యాలు లేనివారికి ధనవంతులు ఈ సర్వేకు కొంత డబ్బు సాయం చేయాలని సూచించేవారు. విద్యార్థుల సెలవులు చాలా విలువైనవి. హాయిగా తిని పడుకోక బంధువుల ఇళ్ళకే, మిత్రుల యిళ్ళకో వెళ్ళినపుడు ఆ ప్రాంతానికా పేరెలా వచ్చింది. అక్కడ పుట్టి పెరిగిన గొప్ప వ్యక్తులు, పరిపా లించిన ప్రభువులు వారు కట్టించిన గుళ్ళు గోపురాలు ఒక డైరీలో తప్పక నోట్ చేసుకోవాలనేవారు.

ఆడపిల్లలకు ఆటపాటల గురించి, పండుగలు, ప్రసాదాలు వంటలు వారి కట్టు బొట్టు, ఆచార వ్యవహారాలు తెలుసుకోవాలని, మగవారితో సమానంగా వీరు అన్ని రంగాల్లో రాణించాలనీ భావించేవారు. వారికి ధీటుగా వీరు ఎంతో విషయ సేకరణ చేయగలరు. వీరు మాత్రమే చేయగల పనులుకొని ఉన్నవి. మన ప్రాంతాల్లో స్త్రీలు పాడుకునే పాటలు వ్రతాలు, నోములు పండుగలు వాటి పరమార్థం, ఆడపిల్లలాడుకునే ఆటలు వేసవికాలం యింట్లో ఉండి ఆడుకునే కచ్చకాయలు, చింతపిక్కలాట, ఓమన గుంటలు వీటి ద్వారా వివేకం చేకూరుతాయని చెప్పేవారు.

స్త్రీ విద్య గురించి వీరేశలింగం గారి సంస్కరణలు, దయానందుని సత్యార్థ ప్రవచనాలు, రామకృష్ణ, వివేకానందుల రచనలు, అరవిందుల, రమణ మహర్షుల బోధనలు త్రిపురనేని విమర్శలు క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలనే వారు.

అవకాశము దొరికినప్పుడల్లా శరత్ చంద్ర రచనలు నార్ల, గోరా, సహేతుక నడవడి న్యాయమూర్తి ఆవుల సాంబశివరావు గారి మాటలు వార్తల్లో చదివి రేడియోల్లో విని సభల్లో సవివరంగా వివరించేవారు. క్రొత్త పుస్తకాలు ఏవి వచ్చినా హైదరాబాదు వెళ్ళి వచ్చేవారితో కొని తెప్పించుకునేవారు. పేపర్లో కాని, మ్యాగజైన్‌లో కాని, పుస్తక సమీక్షలు చదివి స్పందించేవారు. వేల రూపాయలతో పుస్తకాలు తెప్పించేవారు.

విషయ సేకరణ, ముద్రణ ఒక్కరితో జరిగే పని కాదని, రచయితలంతా ఏకమై మెంబర్ షిప్ ఫీజు సేకరించి, సహకార సంఘ సంస్థాపకులై ప్రాచీన రచనలు సేకరించి, సవరించి, ముద్రించాలని

**ఆడపిల్లలకు ఆటపాటల గురించి, పండుగలు, ప్రసాదాలు వంటలు వారి కట్టు బొట్టు, ఆచార వ్యవహారాలు తెలుసుకోవాలని, మగవారితో సమానంగా వీరు అన్ని రంగాల్లో రాణించాలనీ వారికి ధీటుగా వీరు ఎంతో విషయ సేకరణ చేయగలరు. వీరు మాత్రమే చేయగల పనులు కొని ఉన్నవి. మన ప్రాంతాల్లో స్త్రీలు పాడుకునే పాటలు వ్రతాలు, నోములు పండుగలు వాటి పరమార్థం, ఆడపిల్లలాడుకునే ఆటలు వేసవికాలం యింట్లో ఉండి ఆడుకునే కచ్చకాయలు, చింతపిక్కలాట, ఓమన గుంటలు వీటి ద్వారా వివేకం చేకూరుతాయని చెప్పేవారు.**

విదేశీయులైన బ్రౌను తెలుగు భాషకు చేసిన సేవ ప్రతి తెలుగువాడు చేయాలన్నాడు. ప్రతి విద్యార్థి విధిగా నియమావళి తయారు చేసుకొని పండుగ సెలవుల్లో అమ్మమ్మ నాయనమ్మ యిళ్ళకు వెళ్లే సమయం వృధా చేయక కొంత సమయం వారికి కేటాయించి

పూర్వీకుల చరిత్ర తెలుసుకోవాలి. ముసలి వాళ్ళ దగ్గర మూడు తరాల విషయాలుంటాయి. అన్నీ పుస్తకాల్లో దొరుకుతాయనుకోకూడదు. మారుమూల ప్రాంతాల్లో మౌఖిక సాహిత్యమెంతో ఉన్నది. ఈ రోజుల్లో కెమెరాలు, టేపు రికార్డులు మొదలైన వస్తువులు చాలా ఉన్నాయి. నాలుగు జతల బట్టలు కొనుట మాని, వీటిని కొని వాటిలో నిక్షిప్తం చేయాలి. వృద్ధులకు మతిమరుపు రాకముందే సేకరించాలి. కాని వారెక్కడ పోతార్లే మరోసారి అని వాయిదా వేయకూడదు. వీరికి ఓపిక తగ్గవచ్చు, మాటపడిపోవచ్చు. అందుకే మౌఖిక సాహిత్యం వెంటనే సేకరించాలి.

పేద సోదర కవుల నాదుకోవాలి. రాసి పెట్టుకున్న రచనలు అచ్చు వేయించు కోలేక పోవచ్చు. ధనవంతులు కృతి భర్తలు కావాలి. అక్షరం క్షరం లేనిది. ధనం శాశ్వతం కాదు. కాని కృతి ఉన్నంత కాలం కృతికర్త, కృతిభర్త పేరుంటుంది. కనుక, పుస్తక ప్రచురణకు సాయం చేయాలనే వారు. ఆసక్తి గల విద్యార్థులు, పేద విద్యార్థులు విరామ సమయాల్లో గ్రామనామాల, ఇళ్ళ నామాల పేర్లు, పలు ప్రాంతాల్లో నివసించే కవి కాలం, రచనలు సేకరించే కార్యక్రమం ఉద్యమంలా సాగాలి. ఇది నిరంతర వాహిని. పాత నీరు వెనుక క్రొత్త నీరు వచ్చినట్లు కొత్త కవులు, క్రొత్త ప్రక్రియలు వస్తుంటాయి. కనుక ఇది సర్వకాలీనం, సార్వజనీన మనేవారు కేశవరావు గారు.

ఇవే కాక, ప్రజల నాల్కల పైన ఉన్న తెలంగాణ పదాలు, శాతవాహనుల కాలంలోని హాలుని సంకలన ప్రాకృత గ్రంథం గాథా సప్తశతిలోని అనేక వాడుక భాషా పదాలు సేకరించాలి. కరీంనగర్ మండలములోని ధూళికట్ట కోటిలింగాల ప్రాంతాల శాతవాహన సామ్రాజ్య చారిత్రక విశేషాలెన్నో ఉన్నాయి. ఈ ప్రాంతంలో గోదావరి, మానేరు నది పరిసర ప్రాంతాల్లో ఆదిమ, అనంతర కాలాల రాతియుగ మానవులు నివాసమున్నట్లు తవ్వకాలలో లభించిన రాతి పనిముట్లు సాక్ష్యమిస్తున్నవి. కైరాన్న్యు, బృహచ్ఛిలా సమాధులు అక్కడ ఉన్నాయి.

శాతవాహన, వాకాటిక, చాళుక్య, యాదవ, రాష్ట్రకూట, రేచెర్ల, పద్మనాయిక, కాకతీయ, మహ్మదీయ ప్రభువుల పాలన చవిచూసినదీ ప్రాంతం. మతాలలో శైవ శ్రీ వైష్ణవ, జైన, బౌద్ధ, వీరశైవ, అద్వైత, ఇస్లామీ బ్రహ్మ సమాజ, ఆర్య సమాజ, నాస్తికాలు చోటు చేసుకున్నాయి. తెలంగాణలో తెలుగు, కన్నడ, సంస్కృతం, ఉర్దూ, తమిళం, హిందీ, ఇంగ్లీషు వాడుకలో ఉన్నాయి.

ప్రాచీన చరిత్ర ఉన్న ఈ ప్రాంతాన్ని అనేక కోణాల నుండి ఉత్సాహ వంతులైన యువకులు పరిశీలించాలి. దాదాపు ముప్పైవేల ఆర్థిక సహాయమందించి శ్రీ మలయ శ్రీ చేత 1981లో కరీంనగర్ జిల్లా రచయితల చరిత్ర అచ్చు వేయించిన దీక్షాపరులు శ్రీ వెల్చాల కేశవ రావు గారు. అదే విషయం మీద ఆసక్తితో 1990-95 కాలంలో కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర పేరుతో మలయ శ్రీ గారి పరిశోధన గ్రంధానికి నాంది అయింది సేకరణే. భావి తరాల కనేక విషయాలను అందించాలనే ఆలోచన చేసిన శ్రీ వెల్చాల కేశవరావు గారు ముందు తరాలకు ప్రాతఃస్మరణీయులు.

# రెండు నదులు



**డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్**

ఇన్నాళ్లు అమ్మ కడుపులో వెచ్చగా ఉన్నది
పడిపోతానని భయమేమో!
పుట్టుకతోనే పట్టువెతుకు తున్నది
గులకరాళ్ళతో ఆడుకుంటున్నది
గాలితో పాడుకుంటున్నది

తీరని బాల్య స్పృహ
చల్లగా చిలకరిస్తున్నది
హొయలులు నేర్చింది
ఎత్తుపల్లాలు లెక్క లేదంటున్నది

ఎంత వయసరిదో!
ఉడుకు నెత్తురు ఉరుకుగా
హొరెత్తుతున్నది. పడిలేస్తున్నది
గారాబంగా కలుపుకుంటున్నది
ప్రేమ చాపల్యం లేకపోతే ప్రాణమిస్తదా !

అంతేనా భూమి పట్టి పాకుతున్నది.
చెట్టు గుట్ట తోడుగా
భుజ మిచ్చి సాగుతున్నది.
ఎన్నిపరివేదనలో!
మజిలీలు మజిలీలుగా విస్తరించుకున్న బంధాలో!
భవసాగర సంగమం మైళ్ళు నడిచి
ఉప్పుపేరిన పెరుగన్నం తట్ట
అనుభవాలు తలపోసుకుంటున్నది.

అలసట ఎరుగని ప్రవాహం
ఇప్పు డొక తపస్వి నిశ్చలత్వం కోసం
జీవన సంగీతం వింటున్నది.
కాలంతో ప్రయాణం ఎవరాపుతారు !
ఉద్యుక్త ధర్మం తప్ప మరు చూపు లేని వాహిని
సముద్రాన్నిఢీ కొంటున్నది.

# శ్రీకృష్ణుడు చల్దులారగించుట

## బమ్మెర పోతన - మహాభాగవతము



బమ్మెర పోతన పేరు గురించి భాగవతం గురించి తెలియని తెలుగువారుండరు. భక్తి భావమును తీయగా తేటగా తెలుగులో మధురాతి మధురంగా పంచిన కవి పోతన. రాజులనాశ్రయించక తన భాగవతమును శ్రీరామునకంకిత మిచ్చి నాటికాలంలో రాజులనెదిరించిన ధీరకవి. ఓరుగల్లు సమీపంలో బమ్మెర గ్రామవాసి. తల్లి లక్కమాంబ.తండ్రి కేసనమంత్రి. వీరభద్ర విజయము, భోగినీ దండకము ఇతర రచనలు. పరమ భక్తుడు. భాగవతంలో కొన్ని భాగాలు ఆయన శిష్యులు ఏర్చూరిసింగన, బొప్పరాజు గంగన, వెలిగందల నారన రాశారు. పోతన పద్యాలు తెలుగు వారి ఇండ్లలో నిత్యపారాయణాలుగా నిలిచిపోయాయి. ఆయన పద్యాలు మందార మకరందాలు.

ఎండన్ వ్రగ్గితి రాకటం బడితి రింకేలా విడంబింపగా
రండో బాలకలార! చల్ది కడువం రమ్యస్థలంబిక్కడే
దండన్ లేగలు నీరు ద్రావియిరవందన్ పచ్చికల్ మేయుచున్
దండంబై విహరించుచుండగ సమ్మోదప్రీతి భక్షింతమే

జలజాంతస్థిత కర్ణికం దిరిగిరా సంఘంబులై యున్న రే
కుల చందంబున కృష్ణునిన్ తిరిగిరా కూర్చుండి వీక్షింపుచున్
శిలలుం పల్లవముల్ తృణంబులు లతల్ చిక్కంబులున్ పువ్వులా
కులు కంచంబులుగా భుజించిరచటన్ గోపాలకుల్ భూవరా!

మాటి మాటికి వ్రేలు మడిచి యూరించుచు
యూరుగాయలు తినుచుండు నొక్క
డొకరి కంచములో దొడరి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరు చూపునొక్క
డేవురార్గుర తల్లులెలమి బన్నిదమాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్క
డిన్నియు దగపంచి యిడుట చెంచెలితన
మనుచు బంతెనగుండు లాడు నొకడు

కృష్ణు చూడుమనుచు గికరించి తన మ్రోలి
మేలి భక్ష్య రాశి మెసగు నొకడు
నవ్వు నొకడు సఖుల నవ్వించు నొక్కడు
ముచ్చటాడు నొకడు మురియు నొకడు

సంగడీల నడుమ చక్కగ కూర్చుండి
నర్మభాషణముల నగవు మెరసి
యాగభోక్త కృష్ణుడమరులు వెఱగంద
శైశవంబు మెఱసి చల్దిగుడిసె

# రామ్ లక్ష్మణ్ జానకీ...
# జైబోలో హనుమాన్ కీ

**రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం**



రంగు నవీన్ ఆచారి

శిశువు నిద్రలో ఉలిక్కిపడి ఏడిస్తే ఆ లోకం తెలియని పాపల భయాలను పోగొట్టడానికి అభయహస్తంగా హనుమాన్ రూపాన్ని చేయించి మెడలో వేస్తారు తల్లులు. హనుమాన్ గుడి దగ్గర కొని తెచ్చిన మొలతాడు సకల భయాల నుండి రక్షిస్తుందని మనందరి నమ్మకం. అనేక మానసిక బలహీన సందర్భాలలో భజరంగ్ బళి పేరు ఒక ధైర్యం. కలియుగంలో ఉపాసకులకు పిలిస్తే పలికే భవిష్యద్ బ్రహ్మ అభయాంజనేయుడు. పిల్లలకు పెద్దలకు అత్యంత ప్రీతిపాత్రుడు వీరాంజనేయుడు. దేశంలో దాదాపు ప్రతీ గ్రామంలో హనుమంతుని గుడి ఉండడం సహజం. తెలంగాణలో ఐతే ఏ గ్రామమైనా సరే వాడకు ఒక ఆంజనేయుడి విగ్రహం ఉండాల్సిందే. అది స్వామితో ఈ నేలకు ఉన్న అనుబంధం.

హనుమంతుని గుడులు ఎక్కడ ఉన్నా పెద్ద పెద్ద నిర్మాణాలు ఉండవు. చాలా చోట్ల చిన్న అరుగు తప్ప గుడే ఉండదు. కేవలం ఆ స్వామిపై భక్తే ప్రధానం ఇక్కడ. కాషాయ రంగులో చంద్రం (సింధూరం)తో వెలిగిపోతున్న అంజనీపుత్రుడంటే తెలంగాణ పల్లెలకు అంతులేని ధైర్యం, అపారమైన భక్తి. గ్రామీణ ప్రాంతాల్లో హనుమాన్ దేవాలయాలు సామూహిక జీవనానికి వేదికగా ఉంటాయి. అందరూ వచ్చి పూజించుకోవడం, వారం వారం సామూహిక భజనలు చేయడం, ఏడాదికోసారి దీక్షలు తీసుకోవడం ఇవన్నీ స్వయం క్రమశిక్షణకు దోహదం చేస్తాయి. సామాజిక అంతరాలు లేని సామూహిక జీవనశైలికి బాటలు వేస్తాయి. మానవ సంబంధాలను బలీయం చేస్తాయి.



గ్రామాలలో చాలా మంది చిన్నతనంలో నేర్చుకున్న అధ్యాత్మిక జ్ఞానమంతా హనుమాన్ దేవాలయం నుండే మొదలవుతుంది. హనుమంతుడి గుడులలో సహజంగా శనివారం జరిగే భజనలలో అందరు దేవతలపై పాటలు పాడడమే కాదు జీవిత సత్యాలను ఆవిష్కరించే పాటలు కూడా ఉంటాయి.

కేసరి, అంజనాదేవిల కుమారుడు శ్రీ హనుమంతుడు. ఏకాదశ రుద్రులలో ఒకరు శ్రీ ఆంజనేయస్వామి. వాయుదేవుని వరంచే పరమశివుని అంశతో జన్మించారు. సప్త చిరంజీవులలో ఒకరు. ఆంజనేయస్వామి హిమాలయాల్లో రామ నామ జపం చేస్తూ ఈనాటికి జీవించి ఉన్నారనేది భక్తుల విశ్వాసం.

"యత్ర యత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిం"

"ఎక్కడ రామనామ సంకీర్తనం జరుగుతుందో, ఎక్కడ శ్రీ రామాయణం చెప్తుంటారో, అక్కడ ఆనంద భాష్పాలు కారుస్తూ చేతులు జోడించి శ్రీ ఆంజనేయస్వామి కూర్చుని ఉంటారు.

మహాబలుడు ఆంజనేయుడు సదా శ్రీరామ దాసుడు. అమిత విక్రముడు. శతయోజనాలంత విస్తారమైన సముద్రమును ఒక్క ఉదుటున దాటినవాడు. లంకలో బందీయైన సీతమ్మతల్లి శోకమును హరించినవాడు.

ఔషధీ సమేతముగా ద్రోణాచలమును మోసుక వచ్చి యుద్ధంలో వివశుడైన లక్ష్మణుని ప్రాణాలు కాపాడినవాడు. దశకంఠుడైన రావణాసురుని గర్వమును అణచినవాడు. క్లిష్ట సమయాలలో రాముడి వెంట నడచినవాడు. అందుకే హనుమంతుడి దారిలో నడచిన వారికి సకల శుభాలు, సర్వత్రా విజయం లభిస్తుంది.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న రామకోటి స్థూప నిర్మాణం దశాబ్దాలుగా హనుమత్ భక్తులు ఎదురు చూస్తున్న మహా ధార్మిక కార్యక్రమం. అత్యంత ప్రభావశీలమైన ఈ స్థూప నిర్మాణం శ్రీ రామాంజనేయుల కృపాకటాక్షాలను తెలంగాణపై ప్రసరింప చేయగలదు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిధిలో ఉన్న కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం విలక్షణమైనది. దాదాపు 400 సంవత్సరాల పూర్వం ఇక్కడ కోరంద పొదల మధ్యన పవన సుతుడు, రామ భక్త ఆంజనేయస్వామి స్వయంభువుగా వెలిశాడు. సుమారు నాలుగు వందల ఏళ్ల క్రితం సింగం సంజీవుడనే వ్యక్తి ఆవులను మేపుతూ ఈ కొండకు రాగా, ఒక ఆవు తప్పిపోయింది. వెతికి వేసారి చివరికి ఓ చింతచెట్టు కింద సేదతీరుతుండగా స్వప్నంలో స్వామి కనపడి 'నేను కోరంద పొదల్లో ఉన్నాను. నాకు కాస్త ఎండ.. వాన.. ముండ్ల నుండి రక్షణ కల్పించు. నీ ఆవు ఇదిగో, ఇక్కడే ఉంది' అని చెప్పాడు. సంజీవుడు నిద్రలోంచి లేచి చూడగా ఆవు ఎదురు వచ్చింది. వెంటనే తన వద్ద ఉన్న గొడ్డలితో కోరంద పొదలను తొలగించి చూడగా శంఖు, చక్ర గధాలంకరణతో ఆంజనేయ స్వామి విశ్వరూపం దర్శనమిచ్చింది. నాటి నుండి స్వామి వారు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్నాడు.

**ఈ నేపథ్యంలో పూజ్య స్వామీజీల, ధర్మాచార్యుల ఆశిస్సులతో, శ్రీమతి కల్వకుంట్ల కవిత గారి చొరవతో ఏర్పాటైన కొండగట్టు అంజన్న సేవా సమితి హనుమాన్ భక్తులతో ధార్మిక సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తుంది. కొండగట్టు అంజన్న సేవా సమితి అభ్యర్థనతో తెలంగాణ వ్యాప్తంగా వందలాది ఆలయాలలో హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతూ ఉంది.**

కొండగట్టులో వెలసిన ఆంజనేయ స్వామి... నారసింహస్వామి, ఆంజనేయస్వామి రెండు ముఖాలతో ఉంటాడు. నరసింహస్వామి అంటే సాక్షాత్తూ విష్ణుస్వరూపం కాబట్టి కొండగట్టు ఆంజనేయస్వామి వారికి శంఖం, చక్రం, వక్షస్థలంలో రాముడు, సీత ఉండడం విశేషం. అలాగే ప్రస్తుతం ఉన్న దేవాలయం కృష్ణారావు దేశ్ముఖ్ గారి సంకల్పంతో 160 సంవత్సరాల క్రితం పునరుద్ధరించబడింది. ఒకే మంటపంలో మూడు వేర్వేరు గర్భగుడులున్నాయి. మధ్యలో ఆంజనేయ స్వామి, కుడిపక్కన వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు, ఎడమ పక్కన అమ్మవారు వెలిసి ఉండగా, ఆలయానికి పడమరవైపు క్షేత్ర పాలకుడు భేతాళస్వామి ఆలయం ఉంది.

అలాగే త్రేతా యుగంలో జరిగినట్లుగా పండితులు చెప్పే మరో కథ కూడా జానపదులలో ఉన్నది. రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు ఆంజనేయస్వామి సంజీవని పర్వతం తీసుకొని వెళ్తుండగా అందులోంచి ఒక ముక్క రాలి ఈ కొండలలో పడిందని, అదే కొండగట్టుగా ప్రసిద్ధి చెందిందని, అందుకే శారీరక, మానసిక బాధలు, ఇతర గ్రహ బాధలున్నవారు స్వామిని దర్శించుకోగానే



తొలగిపోతాయని పూర్వీకులు చెబుతుండేవారు. దేవాలయానికి సమీపంలో రాతి బండల మధ్య 30 గజాల లోతు పుష్కరిణి ఉంది. తపస్వీకులు స్నానాలు చేసి, స్వామిని సేవించి, సమీపంలోని గుహలో తపస్సు చేసేవారు.

కొండగట్టు ఆంజనేయస్వామికి నాలుగు వందల ఏళ్లుగా నిత్య హారతులు కొనసాగు తున్నాయి. అనారోగ్యం, దీర్ఘకాల పీడితులు, మతిస్థిమితం లేనివారు, స్వామి సన్నిధిలో 11, 21, 41 రోజులు నిష్ఠతో పూజలు చేయడమే కాక, మూడుపూటలా భజనలు చేస్తున్నారు. బేతాళస్వామి ఆలయం వద్ద గ్రహపీడితులు విగ్రహానికి మొక్కి, అల్లుబండను ఆలింగనం చేసుకుంటారు. స్వామి కలలోకి వచ్చి గ్రహ బాధ నుండి విముక్తి కలిగిస్తున్నట్లు భక్తులు చెబుతుంటారు. స్వామిని సేవిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని భక్తుల విశ్వాసం.

శక్తి ఉన్నా ఒద్దికగా ఉండటం రామ తత్వం...

అవకాశం ఉన్నా భర్త వెంట నడవడం సీత తత్వం....

కష్టాల్లో అన్నకు తోడుగా ఉండడం లక్ష్మణ తత్వం...

నమ్మిన వారి వెంట కడవరకూ నిలవడం హనుమ తత్వం.. అదే ఎల్లలులేని భక్తి తత్వం.

కొండగట్టులో మార్చి 17న ప్రారంభమైన రామకోటి స్థూప నిర్మాణపు పనులు వడివడిగా జరుగుతున్నాయి. మరో వైపు ఇదే సమయంలో రామ కోటి లిఖించడాలు, హనుమాన్ చాలీసా పారాయణాలు విస్తృతంగా జరగాలన్నది ధర్మాచార్యుల అభిమతం. సుమారు అర్ధ శతాబ్దం క్రితం తెలుగు నేలపై హనుమాన్ దీక్షలను ప్రారంభించి, యాభై ఏళ్లలో హనుమాన్ దీక్షలను మారుమూల గ్రామాలకు, తండాలకు సైతం చేర్చిన హనుమద్దీక్షా పీఠాధిపతులు శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ వంటి పెద్దలు, కొండగట్టు ప్రధాన అర్చకులు డా. తిరుక్కోవెల జితేంద్రప్రసాద్ గారి వంటి పండితులతో పాటు లక్షలాది దీక్షాధారుల చిరకాల వాంఛ రాష్ట్ర వ్యాప్త అఖండ హనుమాన్ చాలీసా పారాయణం.

ఈ నేపథ్యంలో పూజ్య స్వామీజీల, ధర్మాచార్యుల ఆశిస్సులతో, శ్రీమతి కల్వకుంట్ల కవిత గారి చొరవతో ఏర్పాటైన కొండగట్టు అంజన్న సేవా సమితి హనుమాన్ భక్తులతో ధార్మిక సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తుంది. కొండగట్టు అంజన్న సేవా సమితి అభ్యర్థనతో తెలంగాణ వ్యాప్తంగా మార్చి 17 నుండి జూన్ 04 వరకు 80 రోజుల పాటు వందలాది ఆలయాలలో హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతూ ఉంది. ఆలయాలే కాక ఇళ్లలోనూ సామూహికంగా చాలీసా పారాయణం పెద్దయెత్తున నిరాటంకంగా జరుగుతూ ఉండడం పవనపుత్రుని అనుగ్రహమే. అంతే కాక కొండగట్టు అంజన్న సేవా సమితి వివిధ ఆలయాలలో హనుమాన్ దీక్షాధారుల కోసం మధ్యాహ్న భిక్ష ఏర్పాటు చేస్తుంది. అలాగే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నిస్తోంది. రామ కోటి స్థూపం నిర్మాణం కోసం ఇప్పటికే ఐదు కోట్ల రామనామ పత్రాలు సిద్ధం కాగా మరిన్ని కోట్లాది రామ కోటి పత్రాలను ఈ మహా ధార్మిక క్రతువులో సమర్పించేందుకు సమాయత్తమయ్యారు భక్తులు. ఈ పవిత్ర ధార్మిక కార్యక్రమంలో భాగమవ్వాల్సిందిగా భగవద్బంధువులందరినీ ఆహ్వానిస్తున్నాం. మీ మీ ప్రాంతాలలో రామకోటి పుస్తకాలు భక్తులకు అందించి వ్రాయించండి. విరివిగా హనుమాన్ చాలీసా పారాయణాలు జరపండి. మహా రుద్ర హనుమానుని విశాల కృపకు పాత్రులు కండి. జై శ్రీరామ్..! జై హనుమాన్..!!




**కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న రామకోటి స్థూప నిర్మాణం దశాబ్దాలుగా హనుమత్ భక్తులు ఎదురు చూస్తున్న మహా ధార్మిక కార్యక్రమం. అత్యంత ప్రభావ శీలమైన ఈ స్థూప నిర్మాణం శ్రీ రామాంజనేయుల కృపాకటాక్షాలను తెలంగాణపై ప్రసరింప చేయగలదు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిధిలో ఉన్న కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం విలక్షణమైనది.**

**వ్యాసకర్త**
**తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి**

## నోబెల్ సాహిత్య బహుమతి విజేత
# టోమస్ ట్రాన్ స్ట్రోమర్






స్వీడన్ దేశానికి చెందిన టోమస్ ట్రాన్స్ స్ట్రోమర్ 2011లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి గెలుచుకున్నాడు. టోమస్ ట్రాన్స్ స్ట్రోమర్ తన రచనల ద్వారా పాఠకులకు వాస్తవికతను సరికొత్తగా, తాజాగా పరిచయం చేస్తాడు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, అత్యంత ప్రభావశీల స్వీడన్ రచయితల్లో ఒకరిగా టోమస్ ట్రాన్స్ స్ట్రోమర్ ఖ్యాతి గడించాడు. ఇతని రచనలు దాదాపు 60కి పైగా భాషల్లోకి అనువదించబడ్డాయి. సీక్రెట్స్ ఆన్ ద వే, ద హాఫ్ ఫినిష్డ్ హెవెన్, ద గ్రేట్ ఎనిగ్మా వంటివి ట్రాన్స్ స్ట్రోమర్ ప్రముఖ రచనలు.





## జ్ఞాన్ పీఠ పురస్కార గ్రహీత
# అమర్ కాంత్

ప్రసిద్ధ హిందీ రచయిత అమర్ కాంత్ 2009లో జ్ఞాన్ పీఠ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన అమర్ కాంత్, అనేక చిన్న కథలు, నవలలు మరియు సామాన్య ప్రజల జీవితాలను ప్రతిబింబించే రచనలు చేశారు. అమర్ కాంత్ 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అతని కథలు మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. క్విట్ ఇండియా నేపథ్యంలో రచించిన ఇన్హీ హతియారోన్ సే అనే నవలకు గాను ఆయన 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు.

# చుట్టూ వున్న సమాజాన్ని లోతుగా పరిశీలించి కలం పట్టాలి - అమృతలత

**సుదీర్ఘ సాహిత్య అనుభవాలను మనకు పంచుతున్న ప్రముఖ సాహితీ వేత్తతో ముఖాముఖి...**



నెల్లుట్ల రమాదేవి

**కవిత, కథ, నవల, నాటిక, పాట, వ్యాస ప్రక్రియల్లో చేయి తిరిగిన సీనియర్ రచయిత్రి మీరు... మీ మొట్టమొదటి రచన కవిత్వమా, కథా, వ్యాసమా?**

నేను ఆరవతరగతి చదివే రోజుల్లో - ఏవో పుస్తకాలు తిరగేస్తోంటే - మా చిన్నన్న ఎప్పుడో 1958లో రాసిన 'అదిగదిగో ఆంగ్లేయులు...' కవిత దొరికింది. చిన్నన్నలా నేను కూడా కవిత రాయవచ్చుకదా అనుకున్నాను... ఎదురుగా గోడమీద కమలంమీద కూర్చున్న లక్ష్మీదేవి అమ్మవారి ఫోటో కన్పించింది! లేడికి లేచిందే పరుగులా- కమలం మీద కవిత రాసేసాను! అదే నా మొదటి కవిత. చిన్నన్న కవిత ఆ రోజు నా కంటబడకపోతే బహుశ కవితలూ - కథలూ రాయాలన్న స్ఫూర్తి నాకు కలిగేది కాదేమో!? హెచ్చెస్సీ చదివే రోజుల్లోనే... రాత్రి పూట జరిగే దౌర్జన్యాలూ, దోపిడీలూ, అరాచక శక్తుల గురించి వివరిస్తూ... 'నిశాదేవి ఒడిలో ఉషాకన్య నిదురిస్తోన్న వేళ...' అంటూ ఓ కవిత రాసి, 'ఎలా రాసానో చూడూ' అంటూ హైదరాబాదులో వుంటోన్న నా ఫ్రెండ్ అమృత మధుకి దాన్ని పోస్ట్ చేసాను.

అమృత మధు నాకు రిప్లై ఇస్తూ - 'అమృతా! నువ్వు పంపించిన కవితను మా టీచర్‌కి చూపించాను. నీ పేరూ, నా పేరూ ఒకటే కావడంతో మా టీచర్ ఆ కవిత రాసింది నేనే అనుకుని మా ఆర్.బి.వి. ఆర్.ఆర్. స్కూల్ మాగజైన్‌లో ప్రింట్ చేయించింది. అయామ్ సారీ' అంటూ బాధపడింది. ఆ కవిత ఎలా వుందో నాకు గుర్తులేదు కానీ... 'ఆ టైటిల్ చాలా బావుందే... పరాయిపాలయిందే! మళ్ళీ ఆ టైటిల్‌తో రాయలేనే!' అని బాధపడ్డాను.

నిజామాబాదు విమెన్స్ కాలేజీలో పీయూసీ చదువుతోన్నప్పుడు సృజన పత్రికలో కవితల పోటీ వుందంటే అప్పటికప్పుడు 'కూలి' పేర ఓ కవిత రాసి పంపించాను. ఓ రోజు ప్రిన్సిపాల్ నన్ను ఆఫీసుకు పిలిపించారు. ఎందుకోనని భయపడుతూ వెళ్ళాను. 'ఇందూరు భారతి' సాహితీ సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఏ. సూర్యప్రకాశ్‌గారిని నాకు పరిచయం చేసారు. ఆయన నన్ను చూస్తూనే - "వరవరరావుగారి 'సృజన' పత్రికలో కవితల పోటీ ఫలితాలు వచ్చాయి. అమ్మంగి వేణుగోపాల్‌గారి కవిత 'ఉత్తమ కవిత'గా ఎంపికైంది, ఎన్. గోపిగారి కవితకి 'ప్రత్యేక బహుమతి' లభించింది. కె.వి.యస్. ప్రకాశ్‌రావు, సింగమనేని నారాయణ చౌదరి, మీరు రాసిన కవితలు సాధారణ ప్రచురణకి ఎంపికయ్యాయి. మా నిజామాబాదులో కవితలు రాసే కవయిత్రి వుందనుకోలేదు. సంతోషం!" అని అభినందించారు. మా ప్రిన్సిపాల్ నా వంక మెచ్చుకోలుగా చూసారు. ఆయన బయటికి వెళ్తూ - "మీ కవిత 'కూలి' చాలా బావుంది. మాస్టర్ పీస్‌లాంటి కవిత రాసారు. కంగ్రాట్స్!" అన్నారు.




ఊహ వచ్చాక నా మొదటి కవిత పబ్లిష్ అయింది కదా అని పట్టరాని

సంతోషంతో నా ముఖం వెలిగిపోయింది. సూర్య ప్రకాశ్‌గారికి థాంక్స్ చెప్పి క్లాస్‌కి వచ్చేసాను. ఆ తర్వాత మా కాలేజీ మ్యాగజైన్‌లో 'ఆ రోజులే నయం' అన్న కవిత రాసాను. అదే నా చివరి కవిత. మళ్ళీ ఎప్పుడూ కవితల జోలికి వెళ్ళలేదు.

**కవితతో మొదలైన మీ రచన కథలోకి ఎప్పుడు మారింది, బాల్యంలోనేనా... లేక....?**

నేను ఏడోతరగతి చదువుతున్నప్పుడు సంక్రాంతి సెలవుల్లో ఓసారి మా అమ్మమ్మా వాళ్ళ వూరు వెళ్ళాను. అక్కడ బోలెడు కథల పుస్తకాలు కనిపించాయి. ఒక పుస్తకంలో 'చిరకాల నిద్రితుడు' కథ చదివాను. కథ చాలా నచ్చింది. అదెవరు చదివి ఉంటార్లే అనుకుని... అందులోని పేర్లూ - ఊర్లూ - డైలాగ్స్ - సంఘట నలూ అన్నీ మార్చేసి - అదే కథని థీమ్ మార్చకుండా ఇంకోలా రాసి - మామయ్యకి చూపించాను!

మామయ్య ఆ కథని ఆసాంతం చదివి - 'భేష్! చదివిన కథని - పాత్రలు మార్చి కొత్తదానిలా రాసావ్! కానీ తలచుకుంటే - నువ్వే ఒక కొత్త కథ సృష్టించగలవు! ఇలా కాపీ కాకుండా - సొంతంగా రాయి!' సలహా ఇచ్చారు.

**మీ సాహిత్య వ్యాసంగానికి స్ఫూర్తినిచ్చింది...**

బాల్యంలో మామయ్య ఇచ్చిన సలహా, కుటుంబ సభ్యుల తో పంచుకున్న మధురానుభూతులూ నా చుట్టూ వున్న సమాజాన్ని లోతుగా పరిశీలించి- విశ్లేషించుకోవడానికి దోహదపడి -మనసు స్పందించిన ప్రతిసారీ నేను కలం పట్టుకునేలా చేసి - నాలోని రచయిత్రికి ఊపిరిపోసాయి! అదీగాక - ఒకటో తరగతిలో వున్నప్పుడే మా పెద్దన్నయ్య చందమామ, బాలమిత్రలాంటి పిల్లల పత్రికలనూ, ఆ తరువాత రోజుల్లో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ప్రజామతలాంటి వారపత్రికలను గుట్టల కొద్ది తెచ్చిచ్చేవారు. అలాంటి పుస్తకాలు చదవడం వల్లే నాకు అంతో ఇంతో సాహితీ సుగంధం అబ్బింది. నేను బి.ఏ రెండో సంవత్సరంలో వున్నప్పుడు... 19-03- 1970 రోజున మధ్యాహ్నం ఒంటి గంటకు... ఆలిండియా రేడియో, హైదరాబాదు స్టేషన్ నుండి నేను రాసిన కథ 'ఆశయాలూ- ఆదర్శాలూ' ప్రసారమైంది. కానీ హాస్టల్లో ఎవరి దగ్గరా రేడియో లేకపోవడంతో... మేమెవరమూ వినలేకపోయామని బాధపడ్డాం.

తాపీ ధర్మారావు (తాతాజీ)గారి అధ్యక్షతన 'ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం' సలహా మండలి డా॥ దివాకర్ల వెంకటావధానిగారిచే ఏప్రిల్ 07, 1970 రోజున స్థాపించబడింది. ఈ సలహా మండలికి శశాంకగారు గౌరవ అధ్యక్షులుగా డా॥ దివాకర్ల వెంకటావధాని, డా॥ సినారె, రావూరి భరద్వాజ, బోయి భీమన్నగార్లు సలహాదారులుగానూ, విద్యార్థి రచయితల సంఘానికి అడపా రామారావుగారు కార్యదర్శిగా, సుధామ సహాయ కార్యదర్శి గా, రఘుశ్రీ, ఉమాకాంత్‌లు నిర్వాహకులుగానూ వ్యవ హరించారు. ఎమెస్కో సంస్థ అధినేత ఎం.ఎన్.రావుగారి ప్రోత్సాహంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలలో చదువుతోన్న విద్యార్థుల కోసం - ఓ కథల పోటీ నిర్వహించారు. సుమారు రెండువేల మంది విద్యార్థులు ఆ కథల పోటీలో పాల్గొన్నారు. ఆ పోటీకి మా కాలేజీ నుండి నేనూ, మా జూనియర్ స్వాతి శ్రీపాద మా కథలను పంపించాం.

నేను రాసిన 'కన్నీళ్ళతో కాలక్షేపం', స్వాతి శ్రీపాద రాసిన 'ప్రతిఫలించని అద్దాలు' కథలు 'ఉస్మానియా యూనివర్సిటీ ఎమెస్కో కథల పోటీ'లో ఎంపికై ఎమెస్కో కథాంజలి-3లో ప్రింటయ్యాయి. ఇద్దరం కలిసి ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్లో జరిగిన ఆ పుస్తకావిష్కరణ సభకు హైదరాబాద్ వెళ్ళాం. ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థి రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆ సభకి డా॥ సి.నారాయణ రెడ్డి, రావూరి భరద్వాజ, శశాంక లాంటి సాహితీ ఉద్దండులు ముఖ్య అతిథులుగా విచ్చేయడం మాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆవిష్కరణ తరువాత కథలు రాసినవాళ్ళందరికీ ఆ పుస్తకాలూ, సర్టిఫికెట్లూ ఇచ్చారు. మొత్తం పదిహేడు కథలున్న ఆ పుస్తకంలో మొదటి కథ నాదే కావడం నాకు థ్రిల్ కలిగించింది..

ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థి రచయితల సంఘం కోరిక మేరకు... స్వాతి మాసపత్రిక (మే, 1971) నిర్వహించిన కథల పోటీలో నా కథ 'మనసు ఎదగని మనుషులు'కి రెండో బహుమతి లభించింది.

మొదటి బహుమతి ఎవరికీ దక్కలేదు. ఆ కథల పోటీలో నాకు వంద రూపాయల ప్రైజు మనీ వచ్చింది. కానీ, ఎన్ని రోజులు చూసినా ఆ ప్రైజు మనీ అందలేదు. ఎడిటర్ గారికి ఉత్తరం రాసాను. నా కథకి వచ్చిన ప్రైజు మనీ రాలేదని, దయచేసి పంపించండనీ!

కొన్ని రోజుల తర్వాత - 'మీరు ప్రైజు మనీ అడిగారట! స్వాతి పత్రిక వాళ్ళు మన స్టూడెంట్స్ కథలు వేయడమే గొప్ప! అలా డబ్బు అడుగుతారా? ఆ పత్రిక వ్యవస్థాపకులు చాలా బాధపడ్డారు' అంటూ ఓ విద్యార్థి నాయకుడి దగ్గరి నుండి ఉత్తరం వచ్చింది- 'అయ్యో! ఆ వంద రూపాయలు రచనల ద్వారా వచ్చిన నా మొదటి సంపాదన - దాన్ని ఖర్చు పెట్టుకోకుండా నా ఫోటో ఆల్బమ్‌లో భద్రంగా దాచుకోవాలనుకున్నాను. ఆయన ఏమైనా హర్ట్ అయితే అయాం సారీ!' అన్నాను.

పత్రికలు పెట్టడమే చాలా సాహసం, ఎన్నో కష్ట నష్టాలుంటాయి. పత్రికలు స్థాపించిన తొలినాళ్ళలో అవి రెమ్యు నరేషన్ ఇచ్చే స్థితిలో కూడా వుండవన్న అవగాహన లేక అడిగాను కదాని ఇప్పటికీ ఫీలవుతుంటాను. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి (20-7-1973) వీక్లీలో నా కథ 'ఆమె నవ్వు' ప్రచురింపబడింది. అనంతరం ఆంధ్రజ్యోతి, నవ్య, ఆంధ్రభూమి, మయూరి వీక్లీలలో నా మరో ఇరవైమూడు కథలు పబ్లిష్ అయ్యాయి.

ఓటర్లని చైతన్యం కలిగించే దిశలో... సంభాషణల రూపంలో(2017)లో 'ఓటెందుకు?' పుస్తకం వెలువరించాను.

**మీరు నాటికలు కూడా రాసారు కదా.... మీ మొదటి నాటిక... అదీ చిన్నప్పుడే మొదలైందా ?**

నేను హుజూరాబాద్‌లో తొమ్మిదో తరగతి చదువుతోన్న రోజుల్లో... స్కూల్ మ్యాగజైన్ కోసం 'పృథ్వి రాజ్ చౌహాన్' కథని కథా వస్తువుగా చేసుకొని ఓ చిన్న నాటిక రాసాను. అది ప్రింటై వచ్చినప్పుడు... పుస్తకంలో నా పేరు చూసుకుని ప్రపంచాన్ని జయించినంత

తృప్తిగా ఫీలయ్యాను.

హైదరాబాదు నగరానికి మొదటి మేయర్, రాజకీయవేత్త, ప్రముఖ రచయిత మాడపాటి హన్మంతరావుగారు ఆ నాటిక చదివి - 'ఈ అమ్మాయి భవిష్యత్తులో గొప్ప రచయిత్రి అవుతుంది' అని మెచ్చుకోవడం, దానిని మా హెడ్ మాస్టారు గారు ప్రతి క్లాస్‌లో వినిపించడం... నేను మరిన్ని రచనలు చేసేలా పురికొల్పింది. తర్వాతి రోజుల్లో స్కూల్స్ స్థాపించాక పిల్లల కోసం ఎన్నో ఏకాంకిలు రాసాను. అవి ఆంధ్రభూమిలో సీరియల్‌గా ప్రచురితమయ్యాయి.

**అవును... అవి నేనూ చదివాను. ఆ క్రమంలోనే మీతో ముఖాముఖి కూడా అదే పత్రికలో వచ్చేది. అయినా... ఏకాంకికలు రాయడం చాలా కష్టం. ఇందులో మీరు నిష్ణాతులు. 1977లో ఆంధ్రజ్యోతి వార పత్రికలో వచ్చిన మీ సీరియల్ 'సృష్టిలో తీయనిది' చదివాను. ఆ నవల ఆసాంతమూ కాలేజీ జీవితానికి సంబంధించింది అయినప్పటికీ అందులో మనోవిశ్లేషణ బాగా చేసారు. అప్పట్లో అందరినోటా మీ నవల గురించే చర్చలు! మరి మళ్ళీ నవలల జోలికి పోలేదు... కారణం?**

ఆ మాట కొస్తే నేను ఎనిమిదో తరగతి చదువుతోన్న రోజుల్లోనే... 'పర్వతాలూ - లోయలూ' అనే నవల రాసాను. సమాజంలో భర్తలని ఉన్నతంగా, భార్యల్ని తక్కువగా చూపిస్తున్నారనీ... కానీ, ఇద్దరూ సమానులేనని రాయాలనిపించి - భర్త మహోన్నత 'శిఖరం' అయితే - భార్య అగాధమైన 'లోయ' అనీ - ఆ రెండూ కలిస్తే ఒకదానిలో ఒకటి ఇమిడిపోతే జీవితం స్వర్గమవుతుందనీ - లేకపోతే నరకప్రాయం అవుతుందన్న 'కథాంశం'తో ఆ నవల రాసాను. ప్రతిరోజూ కొంత రాయడం, దాన్ని నా క్లాస్‌మేట్స్‌కి వినిపించడం, వాళ్ళు 'ఆహా... ఓహో...' అనడం నాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. అయితే 'సృష్టిలో తీయనిది' నవల తర్వాత నేను విద్యారంగంలో బిజీగా వుండడం మూలంగా నవలలు రాయలేకపోయాను.

**మీ 'పర్వతాలూ - లోయలూ' చందమామ కథ టైటిల్లా వుంది. ఆ ప్రతి ఏమైనా మీ దగ్గరుందా? సదరు కథా వస్తువు కొంతైనా గుర్తుందా ?**

బీఎడ్ పూర్తి చేసాక - నేను ఎనిమిదో తరగతిలో రాసిన 'పర్వతాలూ-లోయలూ' నవల దుమ్ము దులిపి కాలానుగుణంగా ఎన్నో మార్పులూ చేర్పులూ చేసాను. ఆ నవల పేరు మార్చాలని పించింది. 'ఆడపిల్లలు గాజుబొమ్మల్లాంటి వాళ్ళు. వాళ్ళని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి - మగాడు దాన్ని పగలగొట్టాలని చూస్తే- అది వాడి మణికట్టు మీద పగిలి అతడి ప్రాణాలనే హరిస్తుంది' అనే సందేశం ధ్వనించేలా 'గ్లాస్ విత్ కేర్' అన్న టైటిల్‌తో దాన్ని ఓ పత్రికకు పంపించాను. అయితే ఇంకో కాపీ నా దగ్గర పెట్టుకోలేదు - పోస్టులో ఆ పత్రిక వాళ్ళకి చేరలేదో, లేక మరెక్కడైనా మిస్సయ్యిందో, లేక పత్రికల వాళ్ళకి అది నచ్చలేదో తెలీదు. రెండొందల పేజీల ఆ నవలని నా అజాగ్రత్త మూలంగా పోగొట్టుకున్నాను.

**మీరు స్కూల్ టాలెంట్‌షోలకి ఎన్నో జానపద పాటలు రాసారు. మీరు రాసిన మొట్టమొదటి పాట...?**

మా చిన్న తరగతుల్లో 'బుర్రపిట్ట బుర్రపిట్ట తుర్రుమన్నది' అనే పాట పాడేవాళ్ళం. ఆ పాట చివర్లో 'మొగుడి చేత మొట్టికాయ తింటనన్నదీ' అనే మాటలు నాకు నచ్చకపో యేవి. హెచ్చెస్సీ చదివే రోజుల్లో (1966)... ఆ పాట మీద కోపం వచ్చి దాని మీద ఓ పేరడీని రాసి, నా ఫ్రెండ్స్‌కి చూపించాను.




ఆ పేరడీ చదివి మా ఫ్రెండ్సందరూ 'ఒరిజినల్ పాటకన్నా నువ్వు రాసిందే బావుంది' అని మెచ్చుకున్నారు.

**వివిధ సాహితీ ప్రక్రియల్లో మీది అందెవేసిన చేయి కదా... ఏ ప్రక్రియ మీకు కష్టతరమనిపించింది ?**

నిజం చెప్పాలంటే... నేను అమృత్‌కిరణ్ పక్షపత్రిక స్థాపించిన రోజుల్లో సంపాదకీయం రాయాల్సివచ్చేది. అది వ్యాస ప్రక్రియ. అయితే పుంఖాను పుంఖాలుగా... పేజీలకొద్దీ పెద్దపెద్ద పేరాలతో వ్యాసాలు రాయడం నా అభిమతానికి విరుద్ధం. ఏదైనా ఓ అంశం ఎన్నుకుంటే... దాని గురించి రాసేటప్పుడు అన్ని కోణాల నుండి దాన్ని పరిశీలించాలి, విశ్లేషించాలి. పొందికైన పద్ధతిలో తిరిగి సంశ్లేషిస్తూ.... సింగిల్ పేజీలో పొదగడం... అదో సవాల్‌గా నిలిచేది. నాకు అది కష్టమైనా... ఎంతో ఇష్టంగా వుండేది.

**పక్షపత్రిక సంపాదకురాలిగా, పబ్లిషర్‌గా, ప్రింటర్‌గా మీ అనుభవాలు? పత్రిక ఎక్కువ కాలం నడవకపోవడానికి కారణాలు చెబుతారా ?**

నాకు పత్రికలంటే ప్రాణం! నాకీమాత్రం సాహితీ సుగంధం అబ్బిందంటే.. ఆరోజుల్లోని ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, ఆంధ్రజ్యోతి వార పత్రికలూ, చందమామ, యువ, జ్యోతి మాస పత్రికలే మూల కారణం! పత్రికా రంగం మీదున్న అభిమానంతో నిజామాబాదు నుండి పక్షపత్రికని నడిపేందుకు నిర్ణయించుకున్నాను. పత్రిక కోసం ఒక ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ని కూడా కొన్నాం. ముగ్గురు డీటీపీ ఆపరేటర్లను నియమించుకున్నాం.

అమృత్ కిరణ్ పక్షపత్రికను 64 పేజీలతో ఆంధ్రభూమి, స్వాతి పత్రికల సైజులో పక్షానికోసారి క్రమం తప్పకుండా ఓ రెండేళ్ళు వెలువరించాం. చాలామంది కొత్త రచయితలని ప్రోత్సహించటంతో పాటు అంపశయ్య నవీన్, మల్లాది వెంకట కృష్ణమూర్తి, డా॥ సి. ఆనందారామం వంటి ప్రముఖుల రచనలు కూడా ఆ పత్రికలో సీరియల్‌గా ప్రచురించాం. 'అందుకో నా లేఖా...' పేర పాఠకుల అభిప్రాయాలకూ, 'తెలుసుకొనవె చెల్లి' పేర స్త్రీల సమస్యలపై చర్చలకూ, 'హిజ్ టీన్స్- హర్ టీన్స్' పేర టీనేజీ పిల్లల సమస్యలకి

అగ్రతాంబూలం ఇచ్చాం. కానీ చాలా కారణాల వల్ల నడపలేకపోయాం.

**ఏ ప్రాంతం వాళ్ళు ఆ ప్రాంతం మాండలికాన్ని ప్రాచుర్యంలోకి తేవాలనీ, అలా మాండలికంలో రాయనివాళ్ళు ఆ ప్రాంతాన్నీ, ప్రజల్నీ, అక్కడ జీవ భాషనీ సొంతం చేసుకోనట్టేననీ తరచూ ఒక విమర్శ వస్తూ వుంటుంది. తెలంగాణా బిడ్డగా దీనిపై మీ అభిప్రాయం...**

కథల్లో ప్రామాణిక భాషనే ఉపయోగిస్తే - అన్ని ప్రాంతాల పాఠకులకి అర్థమవుతుందని నా అభిప్రాయం. మాండలికంలో రచనచేస్తే పరిధి కుంచించుకుపోతుంది. అది ఆ ఒక్క ప్రాంతానికి మాత్రమే పరిమితం అయిపోతుంది. తెలంగాణా అయినా, రాయలసీమ అయినా, ఆంధ్రా అయినా... ఒక్కో ప్రాంతానికి ఒక్కో మాండలికం వుంటుంది. ఆ ప్రాంతాల్లో కూడా జిల్లాకొక మాండలికం వుంటుంది. పైగా ఒక జిల్లా మాండలికం ఇంకో జిల్లాకు అర్థంకాదు. ఏ మాండలికమైనా పాత్రోచితంగా ప్రవేశపెట్టాలి గానీ, కథనం కూడా మాండలికంలోనే రాస్తే - ఆయా మాండలికాలు తెలిసిన వాళ్ళు మాత్రమే అవి అర్థం చేసుకోగలుగుతారు. మిగిలిన పాఠకులు దూరమవుతారు. అప్పుడు ఆ కథ లక్ష్యం నెరవేరదు కదా!

మాండలికాలను మనం శ్రోతలుగా ఎంజాయి చేస్తాం! కానీ పాఠకులుగా చిరాకుపడతాం, ఒకప్పుడు కార్మికుల కార్యక్రమంలో రేడియో చిన్నక్క రతన్ ప్రసాద్‌గారు తెలంగాణ మాండలికాన్ని ఎంతో సహజంగా మాట్లాడేవారు. అది వినడానికి బావుండేది. ఇప్పుడు టీవీల్లో బిత్తిరి సత్తిలాంటి వాళ్ళు మాట్లాడే మాండలికం కూడా తెలంగాణ పల్లె యాసలో వినసొంపుగా వుంటుంది. అవే మాటలు పుస్తకంలో రాసి, చదవమంటే మాత్రం... ఆయా వాక్యాలు మన రీడింగ్‌కి అడుగడుగునా స్పీడ్ బ్రేకర్స్‌లా అడ్డుపడతాయి. రేడియోకో, టీవీకో మాండలికంలో రాస్తే... నిరక్షరాస్యులు కూడా ఎంజాయ్ చేస్తారు. పత్రికలకు మాత్రం ప్రామాణిక భాషలోనే రాస్తే చదువుకున్న వాళ్ళందరూ ఇష్టపడతారు. ఇంకో విషయం చెప్పమంటారా... మాండలికాల్లో కొన్ని పదాలు చాలా అప్రాప్రియేట్‌గా వుంటాయి. ప్రామాణిక భాషలో అవి దొరకవు. తెలంగాణాలో 'సోయిలేదా?, ఏయ్ బిత్తిరోడా!' లాంటి అందమైన పదాలు ప్రామాణిక భాషలో కనిపించవు. ఇలాంటి పదాలను తరచూ ఉపయోగించి తెలంగాణ భాషలోని సొగసు తెలిపే రచనలు చేస్తే ప్రామాణిక భాషలో అవి కూడా చేరి, తెలుగు భాష మరింత సుసంపన్నం అవుతుంది.

**'అమృతలత - అపురూప అవార్డ్స్' గురించి...**

ఒక ఉగాది రోజున మా జిల్లాలోని సాహితీవేత్తలనందర్నీ మా ఇంటికి ఆహ్వానించి సత్కరించడం జరిగింది. వారి కళ్ళల్లోని సంతోషాన్ని చూసిన ఆరోజే కళాకారులకు అవార్డులిచ్చి, సత్కరించాలన్న ఆలోచనకు నాలో అంకురార్పణ జరిగింది. ముఖ్యంగా ఇంటిపనులతో సతమతమవుతూ... ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొంటూ... తమలోని కళలను మెరుగుపరుచుకుంటోన్న మహిళలను గుర్తించి గౌరవించాలన్న భావనతో అపురూప అవార్డులు నెలకొల్పాం.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికకు అనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# తెలంగాణా సినిమాల్లో సాహిత్య రూపాంతరీకరణ

**సినిమాల్లో ప్రక్రియా రూపాంతరీకరణ తెలియజేసే వ్యాసం...**



వారాల ఆనంద్

మనిషి సృజన రంగంలో అనేక పాయలున్నాయి. అనేక రూపాలున్నాయి. ఇంకా అనేక దారులు విస్తరించాయి. అన్ని సృజనాత్మక రూపాలూ సొంత వ్యక్తిత్వం కలవే కాదు, అత్యంత విలక్షణమయినవి కూడా. ఆట, పాట, రాత, గీత, ఇట్లా ఒకటేమిటి రంగుల్లో రాళ్ళల్లో రససృష్టి చేసిన సృజన శీలి మనిషి. తనను తాను వ్యక్తం చేసుకోవటానికి తన శక్తి ఆసక్తుల మేరకు భిన్న మయిన రూపాలలో అనేక స్థాయిల్లో ఎంచుకుని సృజన చేసిన చరిత్ర మనిషిది. అలాంటి మనిషి తన లోపల అంతర్లీనంగా దాగి వున్న ఆలోచనల్ని, తాను అనుభవిస్తూ వచ్చిన అనుభవసారాన్ని ఉద్వేగాల్ని వ్యక్తం చేసే క్రమంలో అనాదిగా అనేక కళల్ని కళారూపాల్ని ఆవిష్కరిస్తూ వచ్చాడు. అలా సృజించబడిన రూపాల్లో సాహిత్యం వేలాది సంవత్సరాలది. ఆ సాహిత్యంలో కథా కథన రీతులు భిన్నంగా ఉండడటమే కాకుండా ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని సంతరించుకుంటూ వచ్చాయి. సాహిత్యంతో పాటు లలిత కళలు, దృశ్య కళలు, ప్రదర్శనా కళలు ఇలా భావ వ్యక్తీకరణ మాధ్యమాలు అనేక మయిన రూపాల్లో ఆవిష్కృత మవుతూ వచ్చాయి. అట్లా మనిషి తన సృజనాత్మకతతో రూపొందించుకున్న కళారూపాల నడుమ విడదీయరాని బంధమూ అనుబంధమూ వున్నాయి. అవి అన్నీ పరస్పర అధారితాలూ, ప్రభావితాలూ కూడా.

ఆయా కళారూపాల్ని పరిశీలించినప్పుడు అత్యంత ప్రాచీనమయిన సాహిత్యానికీ ఆధునిక దృశ్య మాధ్యమయిన సినిమాకూ నడుమ గొప్ప అనుబంధముంది. గత శతాబ్దంలో శాస్త్ర సాంకేతిక పరిణామ క్రమంలో రూపొందిన సినిమా విలక్షణమయింది వినూత్నమయింది కూడా. అదికూడా కాలక్రమేణ అనేక మార్పులను ఎదుగుదలను సంతరించుకొని ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమయిన కళా రూపంగా నిలబడింది. సమస్త కళల్నీ తనలో ఇముడ్చుకొని 24 క్రాఫ్ట్స్‌తో సినిమా ఎదిగింది. కదిలే బొమ్మల రూపంగా సినిమా, కనిపెట్టబడిన అతి స్వల్ప కాలంలోనే భారత దేశానికి వచ్చింది. తొలి రోజుల్లో సినిమా ప్రధానంగా ఫోటోగ్రఫీ పెయింటింగ్‌లకు చెందినదిగా భావించారు. కానీ కాలక్రమేనా కథ, కథనం కథనరీతుల విషయంలో సినిమా సాహిత్యానికి దగ్గరయింది. సాహిత్యంలో మాటలు కాగితం మీద పలికితే సినిమాలో దృశ్యాలు తెరపైన పలికాయి. ఇక సినిమా నాటక రంగ కొనసాగింపు అని కూడా కొంత కాలం భావించారు. నిజానికి సర్వకళా సమ్మిశ్రితమయింది సినిమా. అది కవిత్వం నుండి ఉపమానాల్ని, ప్రతీకల్నీ స్వీకరించి మనిషి అంతర్ బహిర్ లోకాలకు చేరే శక్తిని సంపాదించుకుంది. సంగీతం నుండి దృశ్యలయని, పెయింటింగ్ నుండి సున్నితత్వాన్నీ, రంగుల్నీ, దృశ్య రూపాల అల్లికల్నీ స్వీకరించింది. ఇవన్నీ ఉన్నప్పటికీ సినిమాకూ సాహిత్యానికీ అవినాభావ సంబంధం విడదీయరానిదిగా వుంది. సాహిత్యం భాషను తన మాధ్యమంగా చేసుకుంటే సినిమా దృశ్యాల్ని వాహకంగా తీసుకుంది. నిర్మాణ పరంగా పదం, వాక్యం, పారాగ్రాఫ్, చాప్టర్ లు కథా నవలా సాహిత్యంలో ముఖ్యమయితే, సినిమాల్లో ఫ్రేం, సీన్, సీక్వెన్స్‌లు ప్రమాణాలవుతాయి. సినిమాల్లో మాటలు, పాటలు, కథా కథనం అన్నీ సాహిత్య రూపాలే. అంతేకాకుండా అనేక సినిమాలు కథల్నీ, నవలల్నీ రూపాంతరీకరించుకున్నవే కావడం గమనించాల్సిన అంశమే.

ఇలా సాహిత్యానికీ సినిమాకీ వున్న అనుబంధం ఏ ఒక్క భాషకో పరిమితం కాదు. 1913 భారతదేశంలో నిర్మితమయిన మొట్టమొదటి మూకీ సినిమా 'రాజా హరిశ్చంద్ర' సాహిత్య రూపంతారీకరణమే. 'ఆలం ఆరా' తో మాటలు నేర్చిన మన సినిమా దేశంలోని అన్ని భాషల్లోకి చేరింది. అట్లే తెలుగులోకీ వచ్చింది. కానీ దశాబ్దాల తెలుగు సినిమా




తెలంగాణాకు, తెలంగాణ కళాకారులకు అంతగా అందుబాటులోకి రాలేదు. తెలంగాణాలో సినిమా లేదు అనే స్థాయికి వెళ్లిపోయింది

నిజానికి తెలంగాణ తెలుగు సాహిత్యానికి పుట్టిల్లు. ఉత్తమ రచనలకు గొప్ప సాహిత్య విలువలకు నిలయం. అంతే కాదు ఉత్తమ నవలలను, కథలను కొన్నింటిని రూపాంతరీకరించిన సినిమాలుగా మలచిన చరిత్ర తెలంగాణాది. సినిమా రంగంలో అరకొర ప్రాతినిధ్యం వున్నప్పటికీ తెలంగాణ నేపథ్యంలో గొప్ప రచనలను సినిమాలుగా మలిచి జాతీయ అంతర్జాతీయ గుర్తింపునూ గౌరవాన్ని సాధించింది.

నిజానికి తెలంగాణాలో వ్యాపార సినిమా లేదు కానీ అర్థవంతమయిన, కళాత్మకమయిన సినిమాకు మాత్రం తెలంగాణ దశాబ్దాలుగా నెలవుగానే వుంది. బి.నరసింగ రావు, బి.ఎస్. నారాయణ లాంటి దర్శకులు తెలంగాణ సినిమా కీర్తి కిరీటాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లారు. అంతేకాకుండా తెలంగాణ జనజీవితం నుండి ప్రేరణ పొందిన శ్యామ్ బెనెగల్, మృణాల్ సేన్ లాంటి వాళ్ళు తమ సినిమాలతో తెలంగాణ సినిమాను పరిపుష్టం చేశారు.

అంతే కాదు తెలంగాణ సినిమా సాహిత్య రూపాంతీకరణలో ముందుండి ఉత్తమ సాహిత్య విలువలు సామాజిక నేపథ్యమూ వున్న నవలల్ని కథల్ని దృశ్య రూపంలోకి తర్జుమా చేసి విజవంత మయిన సినిమాలు తీశారు. ఉత్తమ సాహిత్యమూ సినిమాల మధ్య రూప భేధమే తప్ప భావ బేధం లేదని నిరూపించారు. సాహిత్యంలో భావలయ, అర్థవంతమయిన సినిమాల్లో దృశ్యలయ రెండూ సమాంతరమేనని నిరూపించారు. ఆ క్రమంలో తెలంగాణ నేపథ్యంలో తెలంగాణ దర్శకులు, కొందరు తెలంగాణేతర దర్శకులు రూపొందించిన అనేక సినిమాలు సాహిత్య నేపథ్యాన్ని కలిగి వుండడం గమనార్హం. తెలంగాణ సాహిత్యం తెలంగాణ సినిమా పరస్పర ఆధారితాలే కాకుండా పరస్పర ప్రభావితాలు కూడా.

ఆ క్రమంలో 1960లోనే వచ్చిన "చివరకు మిగిలేది" బెంగాలీ రచయిత ఆశుతోష్ ముఖర్జీ రచించిన 'నర్స్ మిత్రా' కథ ఆధారంగా నిర్మించబడింది. దర్శకుడు జి. రామినీడు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉప్పునూతల పురుషోత్తమ్ రెడ్డి నిర్మాత కాగా ఆయన మిత్రులు ఏం. సత్యనారాయణ రావు, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, జి. విద్యాసాగర్ రెడ్డి, మండ్రెడ్డి కొండల్ రెడ్డి సహ నిర్మాతలుగా సహకరించారు. ఈ సినిమాను మంజీర ఫిల్మ్స్ బానర్ మీద 22 రోజుల్లో 2,20,000/- రూపాయల బడ్జెట్‌తో తీశారు. తర్వాత 1977లో ప్రముఖ దర్శకుడు మృణాల్ సేన్ భారతీయ మహా రచయిత ప్రేంచంద్ రచన "కఫన్" ఆధారంగా "ఒక వూరి కథ" తీశారు. 1988లో శ్యామ్ బెనెగల్ మరాఠీ రచయిత చింతామణి ఖానోల్కర్ నవల ఆధారంగా "అనుగ్రహం" నిర్మించారు. ఇక తెలంగాణ సినిమాల్లో విశిష్టమయిన విజయవంతమయిన సినిమాగా నిలిచిన "మా భూమి" కిషన్ చందర్ రాసిన "జబ్ ఖేత్ జాగే" నవలను రూపాంతరీకరించింది. రజాకార్లకు (నిజాంకు) వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాస్తవిక దృక్పథంతో తీసిన సినిమా మాభూమి. గౌతమ్ ఘోష్ దర్శకత్వంలో బి.నరసింగ రావు, రవీంద్రనాథ్‌లు నిర్మించారు. మా భూమి తెలంగాణ సినిమాకు ఓ లాండ్ మార్క్. హైదరాబాద్ చుట్టూ పక్కల వుండిన వేశ్యావాటికల సామాజిక ఆర్థిక నేపథ్యంతో గులాం అబ్బాస్ రాసిన చిన్న నవల ఆధారంగా శ్యామ్ బెనెగల్ "మండి" సినిమా రూపొందింది.

1977లోనే తెలుగు సినిమా రంగంలో ఆదుర్తి సుబ్బారావు లాంటి వాళ్ళ దగ్గర పనిచేసి 'తాళిబొట్టు' లాంటి విజయవంతమయిన సినిమాలు తీయడంతో పాటు పలు హిందీ సినిమాలకు కూడా దర్శకత్వం వహించిన మాధవరావు "చిల్లరదేవుళ్లు" సినిమాను వరంగల్‌కు చెందిన కొంతమంది

**నిజానికి తెలంగాణాలో వ్యాపార సినిమా లేదు కానీ అర్థవంత మయిన, కళాత్మకమయిన సినిమాకు మాత్రం తెలంగాణ దశాబ్దాలుగా నెలవుగానే వుంది. బి.నరసింగ రావు, బి.ఎస్. నారాయణ లాంటి దర్శకులు తెలంగాణ సినిమా కీర్తి కిరీటాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లారు. అంతేకాకుండా తెలంగాణ జనజీవితం నుండి ప్రేరణ పొందిన శ్యామ్ బెనెగల్, మృణాల్ సేన్ లాంటి వాళ్ళు తమ సినిమాలతో తెలంగాణ సినిమాను పరిపుష్టం చేశారు.**

మిత్రులతో కలిసి తీశాడు. 'ఏటి కేతం బట్టి ఎయ్యి పుట్లు పండించి ఎన్నడూ మెతుకెరుగరన్నా', 'కలువకు చెంద్రుడు ఎంతో దూరం', 'పాడాలనీ వున్నది' లాంటి మంచి పాటలతో ఆత్రేయ, కె.వి మహాదేవన్ లాంటి వాళ్ళతో కలిసి నిర్మించిన ఆ సినిమా తెలంగాణ అంశం మీద వచ్చిన తొలి సినిమాగా చెప్పుకోవచ్చు.

'చిల్లర దేవుళ్లు' కథాకాలం 1936-42 ప్రాంతంలోనిది. సాయుధ పోరాటానికి ముందున్న తెలంగాణ జీవితాన్ని చిత్రించే పనిని నవలలో తెలంగాణలో విశిష్ట నవలా రచయిత దాశరథి రంగాచార్య ఎంతగా విజయవంతంగా చేశారో సినిమాలో కూడా టి. మాధవరావు అంతే విజయవంతంగా చేశారు. దాదాపుగా అదే కాలంలో బి.ఎస్. నారాయణ తన "ఊరుమ్మడి బతుకులు" సినిమాని సి.ఎస్. రావు రచన ఆధారంగా తీశారు ఆ సినిమా జాతీయ అవార్డును అందుకోవడంతో పాటు పలు దేశాల్లో చిత్రోత్సవాల్లో ప్రదర్శించబడింది. 1983లో ప్రస్తుత ఏం.ఎల్.సి. నారాదాసు లక్ష్మణ్ రావు తన మిత్రులతో కలిసి ఉదయ కుమార్ దర్శకత్వంలో నిర్మించిన "విముక్తి కోసం" భూషణం రాసిన గొప్ప కథ ఆధారంగా నిర్మించబడింది.

ఒక తరాన్ని ప్రభావితం చేసిన నవీన్ నవల 'అంపశయ్య'ను కాంపస్ అంపశయ్య పేర వరంగల్‌కు చెందిన రచయిత ప్రభాకార్ జైనీ సినిమాగా మలిచారు. ఇట్లా తెలంగాణ నుంచి ఉత్తమ సాహితీ సామాజిక విలువలున్న సాహిత్య రూపాలు సినిమాలుగా రూపాంతరం చెందాయి.

వాటన్నింటిలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల జీవన రీతులు మానవ సంబంధాలూ అన్నీ దృశ్య రూపంలోకి అనువదించబడి అర్థవంతమయిన ప్రయత్నాలుగా నిలిచాయి. ఇట్లా మంచి సాహిత్యానికి మంచి సినిమాకు తెలంగాణలో పెద్దపీట వేశారు. సాహిత్యం ఎంతగా ప్రజల్నీ సంస్కృతినీ పట్టించుకున్నదో వున్న కొద్దిపాటి

**1977 లోనే తెలుగు సినిమా రంగంలో ఆదుర్తి సుబ్బారావు లాంటి వాళ్ళ దగ్గర పనిచేసి 'తాళిబొట్టు' లాంటి విజయవంతమయిన సినిమాలు తీయడంతో పాటు పలు హిందీ సినిమాలకు కూడా దర్శకత్వం వహించిన మాధవరావు "చిల్లరదేవుళ్లు" సినిమాను వరంగల్‌కు చెందిన కొంతమంది మిత్రులతో కలిసి తీశాడు.**

తెలంగాణ సినిమా కూడా ప్రజలనీ సంస్కృతినీ పట్టించుకుంది. తెలంగాణాలో సాహిత్యమూ సినిమా కళాత్మకతతో కూడి ప్రశంసలు అందుకున్నాయి.

నిజానికి సినిమా సాహిత్యం రెండూ భిన్నమయిన మాధ్యమాలుగా కనిపించినప్పటికీ. సాహిత్యం వ్యక్తిగత సృష్టి అయితే సినిమా దర్శకుడి మేధో మథనం




నుండి ఉత్పన్నమయినదే అయినప్పటికి సామూహికంగా పలువురు కళాకారులు సాంకేతిక నిపుణులు కలిసి రూపొందించాల్సి వుంటుంది. రెండింటి మధ్య భిన్నత్వం వున్నప్పటికీ సామాజిక దర్పణాలుగా ఏకత్వాన్ని కలిగి వున్నాయి. అంటే రెండింటి మధ్య సాధారణంగా కనిపించే భిన్నత్వమూ అసాధారణంగా కనిపించే ఏకత్వమూ వున్నాయి. సాహిత్య పఠనం వ్యక్తిగత అనుభవమయితే సినిమా వీక్షణం సామూహిక అనుభవం. పాఠకుడికి ప్రేక్షకుడికీ ఆయా సందర్భాల్లో మిగిలే అనుభూతి భిన్నమయింది. రచనల్లో జీవిత దృశ్యాలు పదాలుగా నిర్మిత మయితే సినిమాల్లో దృశ్యాలుగా రూపొందుతాయి. సాహిత్య రచన మొదట పాఠకుడి ఆలోచనా సహజాతంపై ముద్రవేసి క్రమంగా అక్కడి నుండి భావోద్వేగాన్ని కలిగింప చేస్తుంది. కానీ సినిమా మొదటే భావోద్వేగాల్ని ప్రభావితం చేసి ఆ తర్వాత సినిమా స్థాయిని బట్టి ప్రేక్షకుడి ఆలోచనలపై ప్రభావాన్ని కలిగిస్తుంది.

అట్లా ఆ రెండింటి మధ్య వున్న అనుబంధాన్ని, భేదాల్ని తెలంగాణ చలన చిత్రకారులు అర్థం చేసుకొని కొన్ని గొప్ప నవలల్నీ, కథల్నీ దృశ్యీకరించారు. ఇక ముందు కూడా తెలంగాణా సినిమా స్వీయ వ్యక్తిత్వాన్ని రూపొందించుకుని సాహిత్య రూపంతారీకరణలతో పాటు ఇంకా అనేక వైవిధ్యభరిత సినిమాలకు వేదిక కావాలని ఆశిద్దాం.



కవిత

# జీవన వి'ప్లవ'మై



డా॥ గండ్ర లక్ష్మణరావు

ఎండిన జీవులందు చివురెత్తిన యాశల వెల్గులట్లుగా
గుండెల నిబ్బరమ్ముగను కొమ్మల తీయని రాగమట్లుగా
మొండిదియైన కాలమును మోదుగు పూలతొ కాలబెట్టుచున్
పండుగవోలె వచ్చెడిది భావియె నవ్వెడు మల్లె పువ్వుగా.

శార్వరి యెంతజేసితివి చావుభయంబు ప్రపంచమంతటన్
పర్వగ దూరముంచితివి పాపల తల్లుల బంధుమిత్రులన్
సర్వవిధాలజీవనప్రసారిత రక్తము చింద జేసియున్
యుర్విమహానుభావులనునూరక పొట్టన బెట్టుకొంటివే.

శార్వరియనగరాత్రి ప్రశాంతమనుచు
మోదమునబిల్వ మమ్ముల మోసపుచ్చి
శార్వరియనగాఢ తిమిరపిశాచమట్లు
పగలు రాత్రియు చీకటే పంచినావు

కాలము మంచిచెడ్డలకు కష్టసుఖాలకు సాక్షిరూపమౌ
కాలమనాద్యనంతమగు, ఖండము చేయుచు పేర్లుపెట్టినన్
లీలగ కాని పించు నవలీలగ హర్షముపంచియిచ్చి తా
పాలన చేయుచుండునొక వర్షము పాటుగ లోకమంతయున్

వేపసుమించుహర్షమున వేడ్కను మింటను తారలోయనన్
పూపవయస్సులో పికము ముద్దుగకూయుచు నన్ని బాధలన్
బాపనుగాదివచ్చెనట, పాపలనెత్తిరసాలమూయలై
ప్రాపుగనుండవత్తువన పల్కుదు నో 'ప్లవ' స్వాగతమ్మికన్

భువిపాలించెడు దుష్టరాజులకు పోగాలంబు నేతెంచు విచ్చేయు, సం
భవమౌధర్మము సల్పుపాలనము సౌభాగ్యంబు సద్వర్షమై
'ప్లవ'మై జీవనదాన వి'ప్లవ'ము సంభావించు ప్రాభాతమై
పువులన్ నింపినమల్లెతీగవయి సమ్మోదమ్ముతోరమ్మికన్

**'ప్లవ' నామ సంవత్సర**
**ఉగాది శుభాకాంక్షలతో....**



# రంగుల కళ

రంగుల చిత్ర ప్రపంచం వెనుక చీకటి నీడలు చూపించే కథ...

హుమాయున్ సంఘీర్

ఫిల్మ్‌నగర్ బస్తీలో ఉన్న సింగిల్ రెంటెడ్ రూంలో ఒంటరిగా కూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రాజు. తల తిప్పి గోడకు ఓ వైపు షెల్ఫుల నిండా ఉన్న పుస్తకాల వైపు చూస్తూ నిట్టూర్చాడు. ఆ పక్కనే మంచం మీద ఉన్న ల్యాప్‌టాప్ వైపు నిరాసక్తంగా చూశాడు. ఇవాళ నిర్మాతకు చెప్పిన కథ నచ్చి సినిమాకు దర్శకత్వం వహించే ఛాన్స్ ఇస్తే తన పదేళ్ల శ్రమకు ఫలితం దక్కుతుందని మనసులో పదే పదే అనుకుంటున్నాడు. గోడకు వేలాడుతున్న వినాయకుడి ఫోటో ఉన్న క్యాలెండర్ వైపు చూస్తూ కళ్లు మూసుకుని గట్టిగా అర్జీ పెట్టుకున్నాడు. అప్పుడతనికి మాజీ రూంమేట్స్ హరి, జగన్ గుర్తుకు వచ్చారు. సినిమా స్ట్రగుల్స్ చేస్తూ నిత్యం వాళ్లిద్దరు ఆ వినాయకుడికి మొక్కుకోనిదే కాలు బయట పెట్టేవారు కాదు. అప్పుడు రాజు తన కష్టాన్ని, ప్రయత్నం తప్ప దేనిని నమ్మేవాడు కాదు. కాలం గడుస్తున్న కొద్ది వారిద్దరిలో ఒకరు సినీ నటుడిగా, మరొకరు టీవీ యాంకర్‌గా స్థిరపడ్డారు. అంతా వినాయకుడి చలువే అనేవారు. ఆటోమేటిగ్గా తాను ఆ ఫోటోకి దండం పెట్టడం అలవాటు చేసుకున్నాడు.

ఇంతలో తన ఫోన్‌కు యూట్యూబ్ నోటిఫికేషన్ వచ్చిన సౌండు విని క్లిక్ చేశాడు. ఓ ఛానెల్‌లో హరి చేసిన స్కిట్ అది. హరి చేసే కామెడీ రాజుకు చాలా ఇష్టం. దీంతో అతని ముఖంలో చిన్న మెరుపు. నాలుగున్నర నిమిషాల నిడివి ఉన్న ఆ వీడియోను చూస్తున్నాడు. యాంకర్‌కు, హరికి జరిగే సెటైరికల్ కన్వర్జేషన్ అది. కులమతాలు అంటూ పరువు హత్యలకు పాల్పడుతున్న వారికి చక్కటి సెటైరికల్ సందేశం ఇచ్చారు ఆ వీడియోలో. రాజు చాలా ఇంట్రెస్టింగ్‌గా చూస్తున్నాడు. పరువు హత్యలు జరిగినప్పుడు చాలా మంది ఆ ఇద్దరి కులం ఏదని గూగుల్ చేస్తున్నారని హరి చెప్తాడు. ఎవరైనా ఏ రంగంలోనైనా విజయం సాధిస్తే అతని గురించి చాలా మంది గూగుల్‌లో సెర్చ్ చేసేది అతనిది ఏ కులం అని. వీడియో చివర్లో తన రక్తం బిందువులను ఓ ఇద్దరు ముగ్గురి రక్త బిందువులను ఓ రాయి మీద వేసి అందరి రక్తం ఎర్రగానే ఉందే.. ఈ ఎరుపు రక్తం నీ కులం ఇది నా మతం ఇది అని చెప్పడం లేదే అంటాడు హరి. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లలో ఎన్ని పెటాకులు అవడంలేదు.. ఇంకా ఎన్నెన్ని తరాలుగా ప్రేమికుల రక్తాన్ని చిందిద్దాం అని స్కిట్ ముగిస్తాడు.

"కరెంట్ ఇష్యూ మీద పర్‌ఫెక్టుగా హరి ఈ వీడియో చేసిండు. వెల్‌డన్ హరి" అనుకున్నాడు మనసులో. వెంటనే వాట్సాప్ ఓపెన్ చేశాడు. హరి నంబర్ తీశాడు. ఆర్నెల్ల క్రితం హాయ్, హలో అని ఉన్న తమ చాట్‌ను చూసి మనసులో చిన్నగా కలుక్కుమంది. ఇష్టమైన ఫీల్డులో మనుషులు బిజీ అవుతున్న కొద్దీ కమ్యూనికేషన్ గ్యాప్ చాలానే వస్తుంది అనుకున్నాడు. రేపు తాను బిజీ అయినా ఇలాగే తయారవుతానేమో అని తనను తాను ప్రశ్నించుకుని ఛఛ తానలా కానని మళ్లీ సర్ది చెప్పుకుంటున్నాడు. హరికి ఎప్పుడైనా ఫోన్ చేస్తే షూటింగ్ అనో, ఈవెంట్ అనో బిజీగా ఉన్నానని చెప్తాడు. జగన్ కూడా ఆ మాటే చెప్పాడు. ఇక అప్పటి నుంచి బిజీగా ఉన్నవారికి ఖాళీగా ఉన్న తను ఫోన్ చేయడం నామోషీగా భావించాడు రాజు. రూమ్మేట్‌గా గుర్తుకు వచ్చినప్పుడు వాళ్లే ఫోన్ చేస్తారను కున్నాడు. కానీ అది అబద్ధం అయిపోయింది. వాట్సాప్‌లో తనకు తాను హలో హరి, జగన్ ఎలా ఉన్నావని అడిగితే తప్ప రెండు మూడు రోజులకు రిప్లై వచ్చేది కాదు. అది చాలా పొదుపైన ఎమోజీ రూపంలో వచ్చేది. బంధాలు, స్నేహాలు మనసు విప్పి మాట్లాడుకోనంత, ఆ భావాలను కనీసం టైప్ చేసో, వాయిస్ మెసేజో పంపనంతగా.. పెద్ద భావాన్ని చిన్న ఎమోజీలతో పొదుపు చేసేశారని నిట్టూర్చిన సందర్భాలు రాజుకు ఎన్నో. సంశయిస్తూనే హరికి ఫోన్ కలిపాడు.

లక్కీగా ఎత్తాడు. "హాయ్ రాజూ ఎలా ఉన్నావ్?" అన్నాడు ఆప్యాయంగా. చాలా

రోజుల తర్వాత హరి వాయిస్ వినగానే రాజులో ఒక రకమైన ఆనంద చారిక. “బాగున్నా హరీ.. నీ స్కిట్ ఇప్పుడే చూసిన. మస్త్ చేసినవు” “థాంక్యూ రాజా.. మనం ఇట్ల ఫోన్‌ల కన్నా లైవ్‌ల మాట్లాడుకుందామా” “యాహ్ ష్యూర్ హరీ” “నాకు రేపు ఓ వినాయకుడి మండపం కాడ ఈవెంట్ ఉంది. జగన్ గూడ వస్తున్నడు. నువ్వూ వస్తే మాట్లాడుకుంట పోదాం సరేనా” అన్నాడు హరి. “ఓకే హరీ” అన్నాడు. ఫోన్ కట్ అయింది.

★ ★ ★

హరి, జగన్ ఇద్దరూ నటననే ఎంచుకోబట్టి ఎక్కువ టైం తీసుకోకుండా సక్సెస్ అయ్యారు. ఇద్దరూ అటు సినిమాలు, ఇటు టీవీ షోలు, మరోవైపు ఈవెంట్లు చేసుకుంటూ బాగా సంపాదించుకుంటున్నారు. వారు అనుకున్నట్టుగానే మంచి గుర్తింపును కూడా సంపాదించుకున్నారు. ఫేమ్ వచ్చాక వాళ్లు తన రూం ఖాళీ చేసి వెళ్లిపోయారు. పెద్దింటి సంబంధాలు చూసుకుని పెళ్లిళ్లు చేసుకుని మణికొండలో సొంతిల్లు కొనుక్కుని పోష్ లైఫ్ అనుభవిస్తున్నారు. వాళ్లిప్పుడు బయట స్టార్లు కానీ తనకు పాత దోస్తులే.

రాజు మాత్రం అదే రూంలోనే ఉన్నాడు. ఇండస్ట్రీలో రాణించాలంటే కొండల కొద్దీ టాలెంట్ ఎంత ముఖ్యమో పెసర గింజంత లక్ కూడా అంతే అవసరం. ఏడీగా మొదలైన రాజు ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు. చేసిన కష్టానికి జీతం ఉండదు. సినిమా రంగంలో ఎదగాలంటే తొలుత పైకం ఆశించొద్దు అని ఎంతో మంది చెబుతుంటే వింటూ వచ్చిన అవకాశాన్నల్లా చేజార్చుకోకుండా కష్టపడ్డాడు. అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి నుంచి కో డైరెక్టర్ వరకు ఎదిగాడు. నాలుగు సినిమాలకు ఏడీగా, ఒక సినిమాకు కో డైరెక్టర్‌గా, రెండు సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా వర్క్ ఎక్స్‌పీరియన్స్ సంపాదించుకున్నాడు. ఆ అనుభవంతో ఓ నాలుగు షార్ట్ ఫిలింస్, ఓ డాక్యుమెంటరీ చిత్రం, ఒక వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించి ట్రాక్ రికార్డ్ బిల్డ్ చేసుకున్నాడు. ఇక వెండితెర మీద దర్శకుడిగా తన పేరు చూసుకోవడమే తరువాయి. ఆ తర్వాత పర్సనల్ లైఫ్ మీద ఫోకస్ పెట్టి పెళ్లి చేసుకుని సెటిల్ అవ్వాలి అనుకున్నాడు. రాజు గత ఎనిమిదేళ్ల నుంచి అదే రూంలో ఉంటున్నాడు. హరి, జగన్ వెళ్లిపోయినా ఒంటరిగా తను ఆ రూంలోనే ఉంటున్నాడు. తన ఎన్నో ఆలోచనలకు పురుడు పోసింది ఆ రూం. కథలతో కుస్తీ పట్టాడు ఆ గదిలోనే. తాను బాధలో ఉన్నప్పుడు అమ్మలా ఓదార్చింది ఆ రూం. అందుకే దానిని వీడలేకపోతున్నాడు రాజు.

> **“ఫేమ్, పైసా వచ్చినంక ఇసుంటి ఫోన్ కాల్స్ శాన చిరాకు వెడ్తయి. జగన్ అంటుంటంగా హరి ఫోన్ మళ్లీ మోగింది. హరిలో అదే చిరాకు. స్క్రీన్ మీద లక్ష్మి అన్న పేరు కనిపించింది రాజుకు. ఆ పేరు చూడగానే రాజుకు ఆ లక్ష్మే గుర్తుకు వచ్చింది. అప్పట్లో హరి, లక్ష్మి అనే అమ్మాయితో ఫోన్‌లో ఎప్పుడూ బిజీగా మాట్లాడేవాడు. ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. నాలుగైదేళ్లు రూంలో టైం దొరికినప్పుడల్లా లక్ష్మితో మాట్లాడేవాడు.**

వాళ్లిద్దరు ఉన్నప్పుడు రూంలో నిత్యం నవ్వులు పూసేవి. వాళ్లు నటులు అవడంతో వాళ్లను, వీళ్లను ఇమిటేట్ చేసి చూయించేవారు. వారంలో మందు, చికెన్ అంటూ ఎంజాయ్ చేసేవారు. బ్యాచ్‌లర్లుగా ముగ్గురూ కలిసి గది అద్దె షేర్ చేసుకునేవారు. తినడానికి అయ్యే ఖర్చులను కూడా బుక్కులో రాసుకుని సమానంగా పంచుకునేవారు. ఎదిగాక స్టేటస్ ఇష్యూ అని భావించిన వారిద్దరు అకస్మాత్తుగా ఆ బస్తీలోని రూం ఖాళీ చేసి వెళ్లడంతో తాను ఒక్కసారిగా ఒంటరిని అయిన ఫీలింగ్ కలిగింది. వాళ్లు మళ్లీ తన రూంకు రావడానికి అదే ఫేం అడ్డొచ్చింది.

ఈ క్రమంలో ఊళ్లో ఉన్న అమ్మ ఫోన్ చేసి అవసరాలకు డబ్బులు పంపివ్వమనేది. ఇక్కడేమో నెలనెలా ఠంచనుగా వచ్చే జీతాలు ఉండవు సినిమా స్ట్రగులర్లకు. “ఇంకెప్పుడు సంపాదిస్తవురా. నీ తోటోల్లు లగ్గాలు జేసుకుని పెండ్లాం పిల్లలతోని ముద్దుగా ఉంటున్నారు. నీ ఈడు పెరుగుతున్నది. ఆ సీన్మలు మనకు పడయి. సప్పుడుదాక ఇంటికచ్చి ఏదన్న పని జేసుకుందువు గానీ. నీ ఒక్కని లగ్గం జేస్తే నా బాధ్యత తీరినట్లైతది బిడ్డా. నా మాటిను కొడుకా” అని ఎప్పుడు ఫోన్ చేసినా అమ్మ ఇదే మాట అంటుంటుంది. అన్న కూడా ఫోన్ చేసి “ఇదే నీకు లాస్ట్ ఇయర్. నువ్వు డైరెక్టర్‌వి కాకపోతే నెక్స్ట్ ఇయర్ పెండ్లి జేసుడు ఖాయం” అంటూ అన్న టార్గెట్ పెట్టాడు. ఇన్ని రోజులు ఏదో ఒకటి చెప్తూ వస్తున్న రాజుకు ఈ సారి వాళ్లను ఆప తన తరం కాదనుకున్నాడు. స్థిరపడాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

★ ★ ★

ఎండలు మండిపోతున్నాయి. కారులో ముగ్గురూ బయలుదేరారు. హరి డ్రైవింగ్ చేస్తున్నాడు. అతని పక్కనే ముందు సీట్లో జగన్ కూర్చున్నాడు. రాజు వెనుక సీట్లో కూర్చున్నాడు. చాలా రోజుల తర్వాత లైవ్‌లో వారిద్దరిని చూస్తున్న రాజులో ఆనందం వర్ణనాతీతంగా ఉంది. హరి, జగన్ ఎప్పటి మాదిరే అవే జోకులు పేలుస్తూ నవ్వులు పూయిస్తున్నారు. “నువ్వు డైరెక్టర్‌వు ఎప్పుడు అయితవో మా అన్న ఎప్పుడు కలుస్తవో” జగన్ మాటకు హరి కూడా గొల్లున నవ్వాడు. ఆ మాట వినగానే రాజు మనసు చివుక్కుమంది. ముఖంలో నెర్వెస్ భావన కనిపించకుండా తను కూడా అది పంచ్ జోక్ అన్నట్టు నవ్వు కలిపాడు. “అంటే నేనిప్పుడు వాళ్ల స్నేహితుడిని కానా? నేను డైరెక్టర్‌ను అయి డబ్బు హోదా సంపాదించుకుంటే వాళ్లల్ల కలుస్తనా? ఒకవేళ నేను ఏం సాధించకపోతే?” రాజు లోపల ప్రశ్నలు. ఇంతలో హరి ఫోన్ పదేపదే మోగుతోంది.

స్క్రీన్ మీద నంబర్ చూస్తూ చిరాకు పడుతున్నాడు. "ఎవరో ఫోన్ జేస్తున్నట్టున్నరు గదా ఎత్తు హరీ" అన్నాడు రాజు. ఆ మాటకు జగన్ హరి వైపు చూసి కిసుక్కుమన్నాడు. "ఆ ఫోన్ కావాలనే ఎత్తుతలేడు రాజు" అన్నాడు జగన్. రాజుకి ఏం అర్థం కాలేదు.

"ఫేమ్, పైసా వచ్చినంక ఇసుంటి ఫోన్ కాల్స్ శాన చిరాకు పెడ్తయి. జగన్ అంటుంటగా హరి ఫోన్ మళ్లీ మోగింది. క్షిహరిలో అదే చిరాకు. స్క్రీన్ మీద లక్ష్మి అన్న పేరు కనిపించింది రాజుకు. ఆ పేరు చూడగానే రాజుకు ఆ లక్ష్మే గుర్తుకు వచ్చింది. అప్పట్లో హరి, లక్ష్మి అనే అమ్మాయితో ఫోన్‌లో ఎప్పుడూ బిజీగా మాట్లాడేవాడు. ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. నాలుగైదేళ్లు రూంలో టైం దొరికినప్పుడల్లా లక్ష్మితో మాట్లాడేవాడు. లక్ష్మిది, తనది పక్కపక్క ఊళ్లే. ఇద్దరూ కలిసి ఒకే స్కూల్లో చదువుకున్నామని, పసితనం నుంచే ఇద్దరి మధ్య కనెక్షన్ ఏర్పడిందని హరి కథలు కథలుగా చెప్పిన మాటలు ఆ క్షణం రాజు చెవుల్లో మారుమోగసాగాయి. ఒకే బడిలో చదువుకుని, ఆడిపాడి పెద్దయ్యారు. సెటిల్ అవగానే లక్ష్మినే పెళ్లి చేసుకుంటాడేమో అనుకున్నాడు రాజు. లక్ష్మి హరినే తన ప్రపంచంగా భావించి ప్రాణంగా ప్రేమించింది. రూంలో ఎప్పుడైనా ఖర్చులకు డబ్బులు లేకపోతే లక్ష్మి పంపించేది. పండగలకు బట్టలు కూడా గిఫ్ట్ ఇచ్చేది. హరి ఎదుగుదలలో లక్ష్మిది పెద్ద పాత్ర. ఎంతో ప్రోత్సహించింది. అవకాశాలు రావు అని నిర్వేదానికి లోనైన హరికి లక్ష్మి అందించిన ధైర్యం ఎప్పటికీ మరిచిపోలేనిది. డిగ్రీ వరకు చదువుకున్న లక్ష్మి ఊళ్లో తమకున్న పౌల్ట్రీఫాం వ్యాపారం చూసుకుంటోందని హరి చెప్పేవాడు. అప్పుడప్పుడు రాజు, జగన్‌లతో కూడా లక్ష్మి ఫోన్‌లో మాట్లాడేది. ఛామనఛాయలో కళగా ఉండే లక్ష్మి రూపాన్ని చూస్తూ హరి ఎంతో మురిసిపోవడాన్ని రాజు ఇంకా మరిచిపోలేదు.

సెటిల్ అయ్యాక అనూహ్యంగా హరి జీవితంలోంచి లక్ష్మి వెళ్లిపోయింది. ఎందుకు? ఆ విషయం దాదాపుగా అందరూ మరిచిపోయారు. ఆ ప్రస్తావన తెద్దాం అనుకుంటే వాళ్లు కలిసిన సందర్భాలు చాలా తక్కువ. "ఆ లక్ష్మేనా హరి" ఆదుర్దాగా అడిగాడు రాజు. "అవును రాజు. మనం ఎన్నో అనుకుంటం గనీ మనకు ఏ పిల్ల రాసిపెట్టి ఉంటే ఆ పిల్లనే పెండ్లి చేసుకుంటం" తత్వం బోధించిన వాడిలా అన్నాడు హరి. రాజు భృకుటి ముడిపడింది. "మన పైసా, ఫేమ్‌ను చూసి ఇసుంటి లక్షుమ్మలు చాలామంది వస్తరు పోతరు కదా రాజు" జగన్ మాటలకు రాజు లోలోన ఉడుక్కున్నాడు. పైకి నవ్వలేక నవ్వాడు. హరి కూడా ఫక్కున నవ్వుతున్నాడు. "లక్ష్మిని అంత ఈజీగా హరి ఎట్ల మరిచిపోయిండు? వీళ్ల బ్రేకప్‌కి బలమైన కారణం వేరే ఉంది?" అని రాజు ప్రశ్నించుకుంటున్నాడు. మొదటిసారి వాళ్ల పంచులు చాలా గలీజుగా అనిపించసాగాయి రాజుకి. "అయింది అయిపోయింది. మా అమ్మానాయినలు లక్ష్మిని వద్దన్నరు. నేను వాళ్ల మాటకు విలువిచ్చి, వాళ్లు జూసిన పిల్ల మెడలనే పుస్తెలతాడు కట్టిన. ఈమె గూడ నన్ను మరిచిపోవచ్చుగదా. ఇగో ఊకె గిట్ల చేస్తది. తెలువని ఏజుల ప్రేమించిన. తెలిసినంక మరిచిపోయిన గంతే" ముఖం చిట్లిస్తూ అన్నాడు హరి. "వాళ్లూర్లనే మన ఈవెంట్ అని పొల్ల నిన్ను కలవాలనుకుంటున్నదేమో" జగన్ ఎగతాళికి "ఛీఛీ" అన్నాడు హరి. ఛీఛీనా? రాజులో మరిన్ని ప్రశ్నలు. "అబ్బా మనం నీళ్ల బాటిల్ తీసుకునుడు మరిచినం. నాకు దూప బాగైతున్నది" హరి అన్నాడు. "అక్కడ ఎవరైనా ఇయ్యరా నీళ్లు" రాజు అన్నాడు. "ఏ నీళ్లు పడితే అవి తాగుతే పడిశం అయితది" జగన్ వక్కాణించాడు.

మాటల్లోనే ఈవెంట్ ఉన్న గ్రామానికి చేరుకున్నారు. కారు దిగుతున్న వాళ్లిద్దర్ని చూసి జనాలు, గోలలు చేయసాగారు. ఆ గణపతి మండలి పెద్దలు ఓ ఇద్దరు ముగ్గురు వచ్చి మెడలో పూలదండలు వేసి స్వాగతాలు పలికారు. రాజు వైపు



**వారం తర్వాత ఆరోజు రాత్రంతా ఓ సీన్ విషయంలో తర్జన భర్జనలు పడ్డ రాజు లేట్ నైట్ నిద్రపోయాడు. ఉదయం పదకొండు అవుతున్నా లేవలేదు. ఫోన్ రింగుతో మెలకువ వచ్చి కళ్లు నులుముకుంటూ ఫోన్ స్క్రీన్ చూశాడు. కొత్త నంబర్ ఉంది. లిఫ్ట్ చేసి 'హలో' అన్నాడు. "హలో రాజు నేను లక్ష్మిని మాట్లాడుతున్నా" అంది. లక్ష్మి వాయిస్ వినగానే రాజుకి నిద్రమబ్బు ఎగిరిపోయింది. రక్కున లేచి కూర్చున్నాడు. ఐదేళ్ల తర్వాత లక్ష్మితో మాట్లాడుతున్నాడు రాజు. చాలా ఎగ్జైట్‌మెంట్‌గా ఫీలవుతున్నాడు.**

ప్రశ్నార్థకంగా చూస్తున్నారు వారంతా. "నా అసిస్టెంట్" అని చెప్పాడు హరి. రాజు షాక్ అవుతూ ముఖంలో బలవంతంగా నవ్వును పులుముకున్నాడు. ఎప్పుడూ వాళ్ల వెంట వెళ్లే అసిస్టెంట్ రాలేదని తనను తీసుకొచ్చారని తెలుసుకున్నాడు రాజు. వెంట అసిస్టెంట్ లేకపోతే నామోషీగా భావిస్తారనుకుని పోనీలే అనుకున్నాడు. వారికున్న క్రేజ్ కారణంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి జనాలు విరగబడ్డారు. వాళ్లను కంట్రోల్ చేయడానికి పోలీసులు వచ్చారు. ఆ జనాలను ఆశ్చర్యంగా చూస్తున్న రాజు చూపు ఓ చోట ఆగిపోయింది. జనాల మధ్య లక్ష్మి నిలుచుంది. తెల్లని చుడిదార్ వేసుకుని అందంగా కనిపించింది. హరి, జగన్‌లు వినాయకుడి వద్ద పూజలో పాల్గొన్నారు. అదే అదునుగా భావించిన రాజు, లక్ష్మి ఉన్న చోటికి ఒక్క ఉదుటున వెళ్లాడు. రాజును చూడగానే గుర్తు పట్టిన లక్ష్మి "రాజు బాగున్నావా" గట్టిగా అంది. జనాల లొల్లి కారణంగా రాజు కూడా వాయిస్ పెంచాడు. "బాగున్నా. నువ్వెలా ఉన్నావ్" అనగానే బాగానే ఉన్నానన్నట్టు తలాడిస్తూ కళ్లు చెమర్చుకుంది. తన చేతిలో ఉన్న వాటర్ బాటిల్ చూసి "అవి మంచినీళ్లే గదా" అనగానే అవునన్నట్టు తలూపుతూ బాటిల్‌ను అతనికి అందించింది. ఇందాక హరి దాహం అన్నాడు కదా ఈ నీళ్లు ఇద్దామనుకున్నాడు రాజు.

దూరం నుంచి రాజు అన్న పిలుపు విని కంగారుపడుతూ.. "నేను నీతోని ఫోన్ల మాట్లాడ్త ఇగో ఇది నా నంబర్. కాల్ జేసుడు మరిచిపోకు" అని ఓ చీటీ లక్ష్మికి అందించాడు. వెంటనే అక్కడి నుంచి స్టేజీ వద్దకు వెళ్లాడు. స్టేజీ మీద హరి, జగన్‌లు మాట్లాడుతున్నారు. జోకులు పేల్చుతూ అక్కడున్న వారిని నవ్విస్తున్నారు. రాజు ఆ జనాల్లో నిల్చున్న లక్ష్మినే చూస్తున్నాడు. హరి మాట్లాడుతూ లక్ష్మిని చూసి చూపులు తిప్పుకోవడాన్ని రాజు గమనిస్తున్నాడు. కానీ, లక్ష్మి కళ్లలో అదే తరగని ఆరాధనా భావం. శాలువాలతో సన్మానించి తిరిగి ఇంటికి పంపిస్తూ ఈవెంట్‌కు

> **"కరెంట్ ఇష్యూ మీద పర్‌ఫెక్టుగా హరి ఈ వీడియో చేసిండు. వెల్‌డన్ హరి" అనుకున్నాడు మనసులో. వెంటనే వాట్సాప్ ఓపెన్ చేశాడు. హరి నంబర్ తీశాడు. ఆర్నెల్ల క్రితం హాయ్, హలో అని ఉన్న తమ చాట్‌ను చూసి మనసులో చిన్నగా కలుక్కుమంది. ఇష్టమైన ఫీల్డులో మనుషులు బిజీ అవుతున్న కొద్దీ కమ్యూనికేషన్ గ్యాప్ చాలానే వస్తుంది అనుకున్నాడు. రేపు తాను బిజీ అయినా ఇలాగే తయారవుతానేమో అని తనను తాను ప్రశ్నించుకుని ఛఛ తానలా కానని మళ్లీ సర్ది చెప్పుకుంటున్నాడు.**

మాట్లాడినంత సొమ్మును వారి చేతిలో పెట్టారు. కారులో కూర్చున్నారు. లక్ష్మి కారు దగ్గరకు పరుగెత్తుకు వచ్చింది. హరి ఆమెను కావాలనే ఇగ్నోర్ చేస్తూ రేసు పెంచాడు. కారు దుమ్ము రేపుకుంటూ ముందుకు వెళ్తోంది. ఆ దుమ్ము లక్ష్మిని ఆవరించింది. అయినా రెప్పవాల్చకుండా వెళ్తున్న కారునే చూస్తోంది. హరి చర్యకు షాక్ అయిన రాజు కారు వెనుక అద్దంలోంచి లక్ష్మినే చూస్తున్నాడు. మనసులో దేవినట్టైంది రాజుకు. 'పాపం లక్ష్మి ఎంత బాధపడుతున్నదో' అనుకుని అటే చూస్తున్నాడు. దూరం వెళ్తున్న కొద్దీ లక్ష్మి ఆ ధూళిలో కనుమరుగైంది. రాజు ఉండబట్టలేక "హరీ.. లక్ష్మిని కనీసం పల్కరియ్యాల్సింది" అన్నాడు.

ఆ మాటకి రాజు వైపు ఉడుగ్గా చూశాడు హరి. ఆ టాపిక్ ఇష్టం లేనట్టు మాట మారుస్తూ "అబ్బా దూపైతున్నది" జగన్ అనగానే రాజు తన చేతిలో ఉన్న లక్ష్మి ఇందాక ఇచ్చిన బాటిల్ ఇవ్వబోయాడు. "నాకియ్యి ముందుగాల" అని హరి ఆ బాటిల్ లాక్కుని "ఏడ తెచ్చినవు బాటిల్" అంటూ గొంతులో పోసుకుంటున్నాడు. "లక్ష్మి ఇచ్చింది" అనగానే ఏదో షాకింగ్ వార్త విన్నట్టు కారుకు సడెన్ బ్రేక్ వేసి, నోట్లో పడ్డ నీళ్లను ఊసేశాడు. చేతిలో ఉన్న బాటిల్ వైపు అసహ్యంగా చూస్తూ దూరంగా విసిరేశాడు. నీళ్లు ఇంకా నోట్లో మిగిలి ఉన్నాయేమోనని లోగొంతులోంచి కాకరించి ఉమ్మేస్తున్నాడు. "రాజూ.. హరికి ఇసుంటియి నచ్చయి గదా. ఎందుకిట్ల చేసినవు" అంటూ కారు దిగి అక్కడే ఉన్న ఓ కిరాణా షాపులోకి వెళ్లి మినరల్ వాటర్ బాటిల్ అందుకున్నాడు జగన్. వెంటనే ఆ బాటిల్ అందుకుని పుక్కిలించి ఉమ్మాడు. నోట్లో నోట్లో ఏవో మంత్రాలు చదువుతూ లెంపలు వేసుకుంటున్నాడు. రాజు ముఖం ప్రశ్నార్థకంగా మారింది? లక్ష్మి మీద హరికి ఎందుకు ఇంత అసహ్యం? ఆమె ఇచ్చిన నీళ్లు తాగనంతగా ఏమంత పెద్ద తప్పు చేసింది? రాజు బుర్ర వేడెక్కుతోంది. ఇంక ఏం మాట్లాడకుండా మౌనం వహించాడు రాజు.

★ ★ ★

గదిలో అవే ఆలోచనలతో సతమతం అవుతున్నాడు రాజు. లక్ష్మితో మాట్లాడి ఈ గందరగోళానికి క్లారిటీ తీసుకోవా లనుకుంటున్నాడు. తన నంబర్ లక్ష్మికి ఇచ్చాడు గానీ, ఆమె నంబర్ తీసుకోవడం మర్చిపోయాడు రాజు. తను ఫోన్ చేస్తుందో లేదో అని హైరానా పడుతున్నాడు.

★ ★ ★

వారం తర్వాత ఆరోజు రాత్రంతా ఓ సీన్ విషయంలో తర్జన భర్జనలు పడ్డ రాజు లేట్ నైట్ నిద్రపోయాడు. ఉదయం పదకొండు అవుతున్నా లేవలేదు. ఫోన్ రింగుతో మెలకువ వచ్చి కళ్లు నులుముకుంటూ ఫోన్ స్క్రీన్ చూశాడు. కొత్త నంబర్ ఉంది. లిఫ్ట్ చేసి 'హలో' అన్నాడు. "హలో రాజు నేను లక్ష్మిని మాట్లాడుతున్నా" అంది. లక్ష్మి వాయిస్ వినగానే రాజుకి నిద్రమబ్బు ఎగిరిపోయింది. తక్కున లేచి కూర్చున్నాడు. ఐదేళ్ల తర్వాత లక్ష్మితో మాట్లాడుతున్నాడు రాజు. చాలా ఎగ్జైట్‌మెంట్‌గా ఫీలవుతున్నాడు. మరోవైపు

కథ

తనలో రగులుతున్న ఎన్నో అనుమానాలను నివృత్తి చేసుకోవాలనుకుంటున్నాడు. "రాజు నీకు వీలైతే ఒకసారి మా పౌల్ట్రీఫాంకు రా మాట్లాడుకుందాం" అంది. సరే అన్నాడు రాజు. బైక్ కిక్ కొట్టాడు, ఎక్సలేటర్ పెంచాడు.

★ ★ ★

సిటీ నుంచి డెబ్బై కిలోమీటర్ల దూరం. లక్ష్మి చెప్పిన ఊరి శివారులో ఉన్న పౌల్ట్రీఫాంకు వెళ్లాడు. మగాడి కన్నా ఎక్కువగా కష్టపడుతోంది లక్ష్మి. ఆమెను చూడగానే తెలియని ఆత్మీయత ఉప్పొంగింది రాజులో. రాజును చూడగానే బుట్టల్లో కోడిగుడ్లు ఏరుతున్న లక్ష్మి వాటిని పక్కన పెట్టి చేతులు కడుక్కుంది. అటుపక్క లక్ష్మి వాళ్ల అమ్మానాన్నలు ఓ ఇద్దరు కూలీవాళ్లు గుడ్లను ట్రేలలో పేర్చుతున్నారు. ఫామ్ బయటున్న గద్దెను చూపించింది కూర్చోమని. లక్ష్మిలో అదే చెరగని అందం. మార్చి మార్చి చూస్తున్నాడు రాజు. ఆ కళ్లల్లో హరి ఇంకా ఉన్నాడని తెలుస్తోంది. మరో మాటకు ఆస్కారం లేకుండా "అసలేం జరిగింది నీకు హరికి మధ్య. నిన్ను అసహ్యించుకునేటంత తప్పు పని ఏం చేసినవ్ నువ్వు" అడిగాడు. ఆ ప్రశ్నకు నొచ్చుకుంది లక్ష్మి. మౌనంగా కూర్చున్న ఆమె కంట్లోంచి టపటపా కన్నీళ్లు నేల మీద రాలుతున్నాయి. మళ్లీ రాజే అందుకుంటూ "మీరిద్దరు పెళ్లి చేసుకుంటరు అనుకున్నా. సరే బ్రేకప్ అయిందేమో అనుకున్నా కానీ, ప్రేమించిన వ్యక్తిని అసహ్యించుకునేటంత తప్పు నువ్వైతే చెయ్యవు" అంటున్న రాజు మాట పూర్తి అవనేలేదు లక్ష్మి అందుకుంటూ "నేను తక్కువ కులంల పుట్టిన. అందుకే నన్ను అసహ్యించుకుంటున్నడు" లక్ష్మి సమాధానానికి రాజు తల గిర్రున తిరిగింది.

"చిన్నప్పటి నుంచి మా నడుమ ప్రేమ చిగురించింది. నా ప్రాణం కన్నా ఎక్కువ హరిని ప్రేమించిన. అది నీకు జగన్‌కు ఎర్కనే. అప్పటికి మా అమ్మానాయిన మొత్తుకుంటనే ఉన్నరు. 'అద్దు బిడ్డా.. మన కులం వాళ్ల కన్నా శాన తక్కువ కులం. పెండ్లికి ఒప్పుకోరు' అన్నారు. కానీ కళాకారులకు కులం మతం ఉండయి గదా అనుకున్నా. వాళ్ల అమ్మానాయినలు నన్ను పెండ్లి చేసుకోవద్దని గట్టిగ చెప్పిన్రు. అప్పటికే హరి, జగన్‌లు ఓ సంఘంల జాయిన్ అయ్యిన్రు. ఆ సంఘంల ఏ కులపోల్లు దేవుని దేహంలకెల్లి ఎక్కడెక్కడి నుంచి పుడుతరో చెప్తరు. వాళ్ల లెక్క ప్రకారం మేము దేవుని కాళ్లకాడినుంచి పుట్టినం అన్నమాట. దేవుని ఛాతిలకెల్లి పుట్టిన వాళ్లు నన్ను ఎట్ల పెండ్లి చేసుకుంటరు చెప్పు? హరిని నమ్మి పిచ్చిదాని లెక్క నా సర్వస్వాన్ని అప్పజెప్పిన. హరికి నాతోని లవ్, రొమాన్స్ అంత నడిసింది గానీ, పెండ్లి కాడ అవన్నీ నడవయి అన్నట్టే నడుసుకున్నడు" అంటున్న లక్ష్మి కళ్లు ఏరుధారలయ్యాయి. రాజు మరింత షాక్ అయ్యాడు. హరి కులమతాలు ఏం లేవని చేసిన స్కిట్ ఉత్తకతనే అనుకున్నడు. "మీదికి చెప్పేతందుకు నీతులు మస్తు చెప్తరు గానీ అసలు కత వేరే ఉంటది" అనుకున్నాడు.

"కేవలం కులాలను పట్టుకొని మనసుల ఉన్న ప్రేమను సంపుకున్నడు హరి. కనీ నాకు హరి మీద ఎసుంటి కోపం లేదు. మనిషిగా హరిని నేను నా కంట్ల పానం ఉన్నంతవరకు ప్రేమిస్తనే ఉంట" జీరగా అంటున్న లక్ష్మిని చూస్తున్న రాజు రెండు చేతులెత్తి మొక్కాడు. "తన కులం అమ్మాయిని, అన్ల పైస బగ్గున్న అమ్మాయిని పెండ్లి చేసుకుని తన ధర్మాన్ని నిలవెట్టిండా హరి? నీ అసుంటి దేవతను కాలదన్నిన హరి ఏదో ఒకరోజు నీ వ్యాల్యూ తెలుసుకుంటడు" రాజు మాటలకు దీర్ఘంగా శ్వాస పీల్చి వదులుతూ నిట్టూర్చింది లక్ష్మి. కాసేపు మౌనం. లక్ష్మి ఇచ్చిన నీళ్లను ఇందుకోసమా తాగలేడు? అనుకుని నోరు వెళ్లబెట్టాడు రాజు. హరి లక్ష్మిని అసహ్యించుకున్న దానికి వంద రెట్లు ఎక్కువ అసహ్యం కలుగుతోంది వారిద్దరి మీద. ఆలోచనల నుంచి బయటకు వచ్చి "దాహంగా ఉంది మంచినీళ్లు ఇయ్యి లక్ష్మి" అని అడిగాడు. వెంటనే లక్ష్మి వెళ్లి అక్కడున్న కుండలోని నీళ్లను గ్లాసులో తెచ్చి ఇచ్చింది. తన చేతి నీళ్లు తాగుతాడా లేదా అనే సంశయం ఆమె కళ్లల్లో చదివాడు రాజు. నవ్వుతూ ఆ గ్లాసును అందుకున్నాడు గటగటా తాగుతున్నాడు. గొంతు దిగుతున్న ఆ నీళ్లలో వారికి కనిపించిన ఏ కులం కంపు వాసన కనిపించడంలేదు రాజుకి. 'అదే రుచి, అదే పవిత్రత. ఒకరి శేత తీసుకున్నంత మాత్రాన గంగ అపవిత్రం అయిపోతదా.. వాళ్ల పిచ్చి గాకపోతే" అనుకుంటూనే నీళ్లు తాగేశాడు. "నాకు ఉన్న ఈ పేరు గూడ అగ్రకుల దేవత పేరని మార్చుమంటరేమో ముందుముందు" సంశయంగా అంది లక్ష్మి.

"మూర్ఖులు ఎన్నో అనుకుంటరు. అనుకోనియ్. కనీ లాస్టుకు మిగిలేది మానవత్వం, మంచితనమే" ఎదనిండా శ్వాస పీలుస్తూ అన్నాడు రాజు. రాజును మురిపెంగా చూస్తోంది లక్ష్మి. "నీతోని ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి లక్ష్మి" అన్నాడు. ఏంటన్నట్టు చూస్తోంది లక్ష్మి. "నువ్వు, హరి, జగన్ అనుకున్నట్టు నా పేరు రాజు కాదు.. మొహమ్మద్ ఖలీల్" అంటున్న రాజును చూస్తూ షాక్ అయింది లక్ష్మి. "ఏంది నువ్వు చెప్తున్నది నిజమా?"

**సిటీ నుంచి డెబ్బై కిలోమీటర్ల దూరం. లక్ష్మి చెప్పిన ఊరి శివారులో ఉన్న పౌల్ట్రీఫాంకు వెళ్లాడు. మగాడి కన్నా ఎక్కువగా కష్టపడుతోంది లక్ష్మి. ఆమెను చూడగానే తెలియని ఆత్మీయత ఉప్పొంగింది రాజులో. రాజును చూడగానే బుట్టల్లో కోడిగుడ్లు ఏరుతున్న లక్ష్మి వాటిని పక్కన పెట్టి చేతులు కడుక్కుంది. అటుపక్క లక్ష్మి వాళ్ల అమ్మానాన్నలు ఓ ఇద్దరు కూలీవాళ్లు గుడ్లను ట్రేలలో పేర్చుతున్నారు. ఫామ్ బయటున్న గద్దెను చూపించింది కూర్చోమని.**

కథ

"అవును లక్ష్మి. నా ఆధార్ కార్డ్ వాళ్లకు కనిపియ్యకుంట చాలా జాగ్రత్త పడ్డ. నేను ఈ కులపోన్నని తెలుస్తే నన్ను గూడ రూంలకెల్లి, దోస్తాన్‌ల కెల్లి ఎప్పుడో వెలేసెటోళ్లు గావచ్చు. వాళ్లు గూడ ఇట్ల మారి మనిషిని కులం కండ్లతోని సూస్తరని అనుకోలే. ఎన్నో రంగుల కలలు కని ఇక్కడికి వస్తే కళారంగం సొంతం రంగులు పులుముకుని ఉంది. మీదికి మాత్రం హరిలాగ సామాజిక స్పృహ అనుకుంట తెగ నటిస్తున్నది. ఓటు బ్యాంకు రాజకీయాలు ఎట్లనో కళారంగంల గూడ తెర మీద అందరం సమానం అని తెగ కలర్ ఇస్తున్నరు. సినిమాను అందరు సూస్తెనే పైసలు వస్తయి కాబట్టి కలుపుకుపోతున్నట్టు మసలుతున్నరు. కానీ లోపట ఇసుంటి కపట బుద్ధి వేన్నూళ్లకున్నది. ఇట్ల నాలెక్క ఎందరో తమ అస్తిత్వాలను సంపుకొని పేర్లు మార్సుకుంటున్నరు. ఉన్న పేరు జెప్తే అంటనియ్యరు, ఎదగనియ్యరు. అందుకే నేను ఈడికి వచ్చేటప్పుడే పేరు రాజుగా మార్సుకున్న. నేను మా ఇంటోళ్లతోని ఎప్పుడు హిందీలనే మాట్లాడేటోన్ని. అప్పుడు హరి, జగన్ నన్ను అడిగేటోళ్లు ఎందుకు హిందీల మాట్లాడుతున్నవని. అప్పుడు నేను ఇంకో కట్టుకథ అల్లిన. మేము నార్త్ ఇండియన్స్.. ఈడికి బతకొచ్చినం అని చెప్పిన" అంటున్న రాజు వైపు నమ్మలేనట్టు చూస్తోంది లక్ష్మి.

మళ్లీ రాజే అందుకుంటూ "నీ బాధ ఇన్నంక నేనేందో నీకు చెప్పాలనిపిచ్చింది" ముభావంగా అన్నాడు. షాక్ నుంచి తేరుకుంటూ "అబద్ధపు పునాదుల మీద మనం ఎదగొద్దు రాజు. మన అస్తిత్వం, మన పేరుతోనే ఎదగాలి. ఎంతమందిని తొక్కేస్తరు వాళ్లు చెప్పు?" అంటున్న లక్ష్మి మాటలు వింటున్న రాజులో ఆత్మవిశ్వాసం రెట్టింపై బలపడుతోంది. మనసులో ఏదో గట్టిగా నిర్ణయించుకున్నాడు.

★ ★ ★

మంచి ఆత్మీయురాలిగా మారిన లక్ష్మి నిత్యం అందిస్తున్న ప్రోత్సాహంతో ఖలీల్ అలియాస్ రాజు దర్శకుడిగా సినిమా తీశాడు. తన అసలు పేరుతోనే ఇండస్ట్రీకి దర్శకుడిగా పరిచయం అయ్యాడు. సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. పలు యూట్యూబ్ ఛానెల్స్‌లో ఖలీల్ ఇంటర్వ్యూ లను జగన్, హరి చూసి షాక్ అయ్యారు. "నీ పేరు రాజు కాదా? నీది ఆ మతమా?" ఇద్దరి దగ్గరి నుంచి ఇవే ప్రశ్నలు. "యస్ నేను నా కులం కన్నా ముందు మనిషిని. నేను మనిషిని మాత్రమే గౌరవిస్త" అని రిప్లై ఇచ్చాడు. 'తన సమాధానం విని ఇంతకాలం తనతో కలిసి ఉన్న పాపాన్ని ఏ నీళ్లతో కడుక్కుంటారోనని" అనుకుని చిన్నగా నవ్వుకున్నాడు. తల తిప్పి ఎదురు సోఫాలో కూర్చున్న లక్ష్మిని చూశాడు. లక్ష్మి ముసిముసిగా నవ్వుతోంది. తర్వాతి సినిమా డిస్కషన్‌లో పడ్డారిద్దరు.

కవిత

# ఇప్పుడిప్పుడే...



దాస్యం సేనాధిపతి

సంసార సాగరంపై
ఎగిసి పడే
సంఘర్షణ అలలు...
చందమామను కమ్మిన
మేఘాల వలే..
తాత్కాలికమని ఇప్పుడిపుడే..
తెలుసుకుంటున్నా!

అపోహల
వలయం నుండి బయటపడ్డాక..
నీవేమిటో...
క్రమంగా గ్రహిస్తున్నా!

మనిద్దరి మధ్యన ఉన్న
సందేహాల దొంతరలు
కనుమరుగయ్యాక తెలిసింది..
నా కోసం...
ఆనందాలను పంచే
ఈ పూదోటను నువ్వే
నిర్మించావనీ...
నేను ఈ పూల దారుల వెంటే
నీ సన్నిధి చేరాలనీ..!

కుసుమాలు ఇంట విరియకున్నా..
నీ భరోసా పరిమళాలు
నన్ను తాకుతుంటే..
పూర్వ వైభవం వైపు
వడివడిగా..
అడుగులు వేస్తున్నా!

ఔను
నా కింతవరకు అసలే
స్ఫురించలేదు
కొన్ని తెలుసుకోవాలన్నా..
మరికొన్ని
వెతుక్కోవాలన్నా..
మనల్ని మనం
అప్పుడప్పుడు...కాసేపు
అజ్ఞాత పరుచుకోవాలనీ...!
సంభాషణల ఆసరాతో
అలకలు తీరాకే...
వాస్తవ మొలకలు
అంకురిస్తాయనీ!!



# "బతుకమ్మ" కథలు - తెలంగాణ గ్రామీణ జీవన చిత్రణ

సాహిత్యంలో ప్రతిఫలించిన తెలంగాణ గ్రామాలు...

వి. వింధ్యవాసినీ దేవి

తెలంగాణ బతుకుచిత్రాన్ని ప్రపంచానికి దృశ్యమానం చేసిన తెలంగాణ దినపత్రిక - "నమస్తే తెలంగాణ" వలస పాలనలో నామమాత్రావశిష్టమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, యాస, ఆచార వ్యవహారాలను పునరుజ్జీవింప చేయడంలో ఈ పత్రిక నిర్వహించిన పాత్ర గణనీయమైనది. పరపీడనలో మూగబోయిన తెలంగాణ ప్రజల గొంతుకను గల్లీ నుంచి ఢిల్లీ దాకా బలంగా వినిపించింది. కేవలం రాజకీయ, ఆర్థిక, సాంఘిక అంశాలకే ప్రాధాన్యతనీయకుండా తెలంగాణా సాంస్కృతిక వైభవాన్ని సైతం నలుదిశలా వ్యాపింప చేయడానికి చేసిన కృషి అనన్యసామాన్యమైనది. తెలంగాణ ప్రాంత గత చారిత్రక వైభవాన్ని చాటిచెబుతూ, వర్తమాన ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపిస్తూ, భవిష్యత్ బంగారు తెలంగాణ కల సాకారానికి తన వంతు బాధ్యతగా నిర్మాణాత్మకమైన కృషి చేస్తూ కొనసాగుతున్న దినపత్రిక 'నమస్తే తెలంగాణ' - అని పేర్కొనడం అతిశయోక్తి కాదు.

ఈ క్రమంలో ఆదివారం వెలువడే అనుబంధ పత్రికకు 'బతుకమ్మ' అని నామకరణం చేయడం ఔచితీవంతంగా ఉంది. బతుకమ్మ వారపత్రిక తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజవంశాలు, సంస్థానాలు, పాలకుల చరిత్రను వెలికితీసి అందించడంతో పాటు ఈ ప్రాంతానికే పరిమితమైన, ప్రత్యేకమైన సాంస్కృతిక చిహ్నాలైన ఆట-పాటలు, పండుగపబ్బాలు, ఉత్సవాలు-జాతరలు, కోటపేటలు, ఆచార సంప్రదాయాలు, ఆహారపు టలవాట్లు మొదలగు అనేకాంశాలకు సముచితమైన గుర్తింపునిచ్చింది. భాషకు సంబంధించి పలుకుబడులు, జాతీయాలు, సామెతలు, నుడులు, నానుడులు, లోకోక్తులు మొదలగు విషయాల్లో ప్రత్యేకంగా నిలిచే తెలంగాణా మాండలిక భాషను, యాసను బలపరిచింది. మొత్తం మీద సహజమైన ప్రాకృతిక సౌందర్యానికి పెద్దపీట వేస్తూ, ఉనికి కోల్పోయేదశకు చేరుకున్న తెలంగాణ ప్రాంత చిత్రానికి రంగులద్ది, ప్రపంచ పటంలో నిలబెట్టిందని చెప్పొచ్చు.

ఈ నేపథ్యంలో 'బతుకమ్మ' వారపత్రికలో ప్రచురితమైన కథానికల్లో కథకులు చిత్రించిన తెలంగాణ గ్రామీణ జీవన చిత్రణను పరిశీలించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం. 'బతుకమ్మ' కథలు తెలంగాణా గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తాయి అని నిస్సందేహంగా చెప్పొచ్చు. అర్థ దశాబ్దపు బతుకమ్మ కథల్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

సంస్కృతీసంప్రదాయాలను ఒక తరం నుంచి మరోతరానికి సంక్రమింప చేయడంలో గ్రామాలదే ముఖ్య పాత్ర. భారతీయ సంస్కృతిని తెలుసుకోవాలంటే గ్రామాల్లోకి పయనించాలని చెప్పిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాటలు అక్షర సత్యాలుగా గ్రహించవచ్చు. దేశానికి వెన్నెముకగా నిలిచేవి గ్రామాలే. తెలంగాణ సంస్కృతిని అధ్యయనం చేయడానికి ముఖ్య ఆధారం గ్రామాలే. గ్రామాల్ని, గ్రామ జీవితాన్ని పరిశీలిస్తే తెలంగాణ ప్రాంత సంస్కృతి తెలుస్తుంది. అయితే బతుకమ్మ కథలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబించడంతో పాటూ, వలస పాలకుల దోపిడీయుత పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు, కులవృత్తులు అంతరించడం, సాగునీటి వసతులులేక వ్యవసాయ రంగం కుంటుపడడం, ఇతర ఉపాధి మార్గాలు అందుబాటులో లేక, నిలకడైన ఆర్థిక స్థితి లేక, దైన్యంగా మారిన స్థితిని, ఆ పరిస్థితిని మార్చాల్సిన ఆవశ్యకతను వ్యక్తం చేశాయి.

మలి దశలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదం తెరపై వస్తున్న క్రమంలో, ఉద్యమ నినాదాలు ఊపందుకున్న తరుణంలో ప్రతి కథకుడు తాను పుట్టిన మట్టి ఋణం తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. తన ప్రాంత అస్తిత్వం పై అలుముకున్న చీకట్లను పారద్రోలడానికి కథకులు కథా

సమాజం

సాహిత్యాన్ని ఒక అస్త్రంలా ప్రయోగించారు. గత కాలంలో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ భాషను ఉన్నత స్థానంలో నిలబెట్టే ప్రయత్నం చేశారు. తెలంగాణ మాండలిక యాసలో కథనాన్ని నడపడం ద్వారా కొత్త శిల్ప సౌందర్యాన్ని సాధించారు. యదార్థ జీవిత గాథలనే కథలుగా మలచుకోవడంలోనే కథకుల ప్రతిభ వెల్లడవుతుంది. “బతుకమ్మలో ప్రచురింపబడిన కథలన్నీ వాస్తవ జీవితావిష్కరణకావించి గ్రామీణ ప్రాంత సహజత్వానికి ప్రతిబింబంగా నిలుస్తాయి. స్వరూప, స్వభావ చిత్రణల రెండింటిలోనూ యధార్థతకు పెద్ద పీట వేయడంలో కథకుల దృక్పథం వెల్లడవుతుంది కల్పనలకు, ఊహలకు ఆస్కారం లేకుండా ఉన్నదున్నట్లుగా చిత్రీకరించడంలో కథకులు కృతకృత్యులయ్యారని చెప్పొచ్చు.



‘బతుకమ్మ’ కథలు ఈ క్రింది ప్రయోజనాలను సాధించినట్లు గ్రహించవచ్చు.

● గ్రామీణ జీవితంలోని సహజత్వాన్ని ఏ మాత్రం కల్పనలు లేకుండా కళ్ళముందు నిలిపాయి.

● శ్రామిక జీవన వ్యథలను, వెతలను వాస్తవిక దృష్టికోణంలో ఆవిష్కరించాయి.

● ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర కల నెరవేరిన తర్వాత సాధించుకోవాల్సిన బంగారు తెలంగాణకు ప్రతిబంధకాలుగా ఉన్న సమస్యలను ఎత్తి చూపాయి.

● తెలంగాణా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడలన్న స్పృహను కలిగించాయి.

● సహజ ప్రాకృతిక జీవన మాధుర్యాన్ని అనుభూతి మయం చేశాయి.

● వెల్లువలా దూసుకొచ్చే అభివృద్ధి ప్రభంజనంలో మానవ సంబంధాలను నిలుపుకోవాలని సూచించాయి.

**గ్రామం అంటేనే రైతు, రైతు అంటేనే గ్రామం. గ్రామీణ రైతు భూమినే తన గుండెగా భావించి సేద్యమే ఊపిరిగా మలచుకున్న విధానాన్ని రచయిత్రి వై.వసంత “చంద్రన్న” కథలో హృద్యంగా చిత్రించారు. భూమిని దుక్కిదున్నడం నుంచి పంట చేతికొచ్చేవరకు వ్యవసాయ వృత్తిలోని ప్రతిదశను కళ్ళకు కట్టించారు. ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా, ఆకలి దప్పులు మరచి పంట పండించడానికి రైతు పడే శ్రమనంతా ఈ కథలో అక్షరీకరించారు.**

● వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతును రాజుగా మార్చాల్సిన ఆవశ్యకతను వెల్లడించాయి.

● విభిన్న వృత్తులవారి జీవితాల్లోని అపశృతులను సరిచేయాలని చాటి చెప్పాయి.

● ‘గోబ్యాగ్ టు వేదాస్’ అన్నట్లు నేటి నాగరిక అరణ్యంలో తప్పిపోయిన మనిషి, తాను కోల్పోతున్న మనిషితనాన్ని వెతుక్కోవడానికి పల్లెబాటపట్టాల్సిన అవసరాన్ని తెలియజేసాయి.

● అంతరించిందని భావించే దోపిడీయుత భూస్వామ్య వ్యవస్థ నేటికీ ఏదో ఒక రూపంలో కొనసాగుతుందనీ బడుగు జీవుల్ని జలగల్లా పీడిస్తున్న పరిస్థితులకు చరమగీతం పాడాలని ఆకాంక్షించాయి.

● గ్రామ చిల్లర దేవుళ్ళయిన దొరలు, భూస్వాముల పడగనీడ నుంచి తప్పించుకోవడానికి శ్రామిక జనమంతా ఏకమై పోరాటానికి సిద్ధం కావాల్సిన అనివార్యతను వ్యక్తం చేశాయి.

“బతుకమ్మ కథల్లో తెలంగాణా గ్రామీణ జీవన చిత్రణ”ను ఈ క్రింది

అంశాల ఆధారంగా పరిశీలించడం జరిగింది.

1) శ్రామిక జీవన సౌందర్యం
2) రైతు జీవితం
3) హిందూ ముస్లిం సమైక్యత
4) కులవృత్తుల క్షీణత
5) భూస్వామ్య వ్యవస్థ అస్తిత్వ చిహ్నాలు
6) సంచార కళాకారుల జీవనం
7) గ్రామీణ స్త్రీల చైతన్యం
8) గిరిజన జీవన చిత్రణ
9) గ్రామీణ సంస్కృతి
10) పశుపక్ష్యాదుల పట్ల మమకారం

**శ్రమైక జీవన సౌందర్యం...**

గ్రామీణ జీవితంతో విడదీయలేని అంశం శ్రమ, శ్రామిక జీవనం. శ్రమైక జీవన సౌందర్యమంతా గ్రామాల్లో సుస్పష్టంగా దర్శమిస్తుంది. శ్రమలోంచే సమస్త సంస్కృతి రూపుదిద్దుకుంది. శ్రమలోంచే నాగరిక ప్రపంచం ఆవిష్కృతమైంది, విలువ కట్టలేని అమూల్య సంపద శ్రమ. శ్రామికులు శ్రమైకజీవుల జీవితాలు ఎంత తృప్తిగా ఉంటాయో తెలియ చెప్పే కథ "ఊరు మెచ్చిన మనిషి" రచయిత గుడిపెల్లి నిరంజన్ ఈదన్న కక్కయ్య పాత్రను శ్రామిక జన ప్రతినిధిగా తీర్చిదిద్ది పాత్రకు జీవం పోశాడు. ఈదన్న కక్కయ్య అవసానదశలో ఊరు ఊరంతా కదిలొచ్చి బాధపడుతుంటే 'ఈదన్న కక్కయ్య' తృప్తిగా ఊపిరి విడుస్తాడు, "ఈదన్న కక్కయ్య ఊరిని మెప్పించడానికి సెప్పులే కారణం. సచ్చిన గొడ్లనొలిపి తోలు కర్రగల్లలో నానేసి మురిగిన తోలును ముద్దుగా కడిగి, ఎండలో నానబెట్టి తోలు సాపు జేసేటోడు. సిన్న పెద్ద తేడా లేకుండా ఊరికంత సెప్పుల జతలు నేసేటోడు. ఊరు ఊరంత సెప్పుల్తొడుక్కొని నడుస్తుంటే ఆనంద పడెటోడు. సెప్పుల్జేసుడే అతని ప్రపంచం. అతజ్జేసిన సెప్పుల్జూస్తే అతనికి సెప్పరాని ఆనందం. సెప్పుల్జేసుట్లపుట్టి, సెప్పుల్జేసుట్లనే పెరిగిండు, సెప్పులే అమ్మ కౌగిలనుకునేటోడు. మునివేళ్లతో సెప్పులను ముద్దాడెటోడు. పాదాలు సాపుగుంటెనే మనిషి సాపుగుంటడని నమ్మెటోడు. తాజ్జేసిన సెప్పులే ఊరి పాదాలను ముండ్ల నుండి, పెంట నుండి, రాళ్ల నుంచి కాపాడుతున్నై అనుకునేటోడు. కుక్కలు కొరికేసిన సెప్పుల్ని కుసురు కోకుండా, బాగు జేస్తుండె, ఉంగుటం పోయిన చెప్పుల్ని, కప్పూసిపోయిన సెప్పుల్ని, ఉంగుటం బిగ్గరయిన సెప్పుల్ని గూటంతో గూటించేటోడు, సెప్పుల్ని ఊరికి ఆయుధంగా మలసినోడు. చిన్న పిల్లలకు పూలు వెట్టి కుచ్చుల చెప్పులు, కిర్రుసెప్పులు చేసెటోడు. చెప్పుల్జేసి ఊరికి రక్షనైనోడు. అందుకే ఊరు ఊదన్నపట్ల అంత ప్రేమ సూయించేది" అంటూ రచయిత గ్రామాల్లో శ్రామికుల దృక్పథాన్ని తెలుపుతూ, గ్రామాల్లో శ్రమకు దక్కే గౌరవాన్ని హుందాగా చిత్రించారు. అయితే ఆర్థికంగా నిలదొక్కుకోకపోవడం శ్రామిక జీవితాల్లోని విషాదకోణం, సరైన ఆర్థిక స్థోమత లేక చెడిపోయిన కిడ్నీలను బాగు చేసుకోవడానికి, డయాలసిస్ చేయించుకోవడానికి గానీ ఆర్థిక శక్తి లేక ఈదన్న కక్కన్న మరణించడమనే పెను విషాదాన్ని నేటి సామాజిక వ్యవస్థ వైఫల్యంగా పేర్కొంటూ అసమసమాజ స్వరూపాన్ని దృశ్యకరణ చేసారు రచయిత.

> **గ్రామీణ జీవితంతో విడదీయలేని అంశం శ్రమ, శ్రామిక జీవనం. శ్రమైక జీవన సౌందర్యమంతా గ్రామాల్లో సుస్పష్టంగా దర్శమిస్తుంది. శ్రమలోంచే సమస్త సంస్కృతి రూపుదిద్దుకుంది. శ్రమలోంచే నాగరిక ప్రపంచం ఆవిష్కృతమైంది, విలువ కట్టలేని అమూల్య సంపద శ్రమ. శ్రామికులు శ్రమైకజీవుల జీవితాలు ఎంత తృప్తిగా ఉంటాయో తెలియ చెప్పే కథ "ఊరు మెచ్చిన మనిషి" రచయిత గుడిపెల్లి నిరంజన్ ఈదన్న కక్కయ్య పాత్రను శ్రామిక జన ప్రతినిధిగా తీర్చిదిద్ది పాత్రకు జీవం పోశాడు.**

రమేష్ హజారి రాసిన "మట్టిబండి" కథ నాటకీయశైలిలో నడుస్తూ గ్రామీణుల, శ్రామిక మనస్తత్వాన్ని వెల్లడిస్తుంది. చెరువుల మట్టిని పంటపొలాల్లోకి తోలడానికి మట్టిబండ్లను సిద్ధం చేయడంతో మొదలైన కథ శ్రామికుల చెమట చుక్కల పరిమళాన్ని అందిస్తూ, తెలంగాణ, భాష, యాసతో మరింత సుగంధాన్ని కలుపుకొని జీవన సమరంలో శ్రమ ప్రాధాన్యతను వ్యక్తం చేస్తుంది.

**రైతు జీవన చిత్రణ...**

గ్రామ జీవితంలో ముఖ్య పార్శ్వం రైతు జీవితం. వ్యవసాయమే ప్రాణప్రదంగా భావించే కర్షక జీవితాల స్థితిగతులను వెల్లడించే కథలు - 'చిల్ల మల్లేశం' - 'మట్టి మనిషి', వై.వసంత -'చంద్రన్న' తమ్మిడి మాసయ్య 'పల్లెపిలిచింది' రమేష్ హజారి 'మట్టిబండి' బి.కళాగోపాల్ 'బోనం' మెహక్ హైదరాబాదీ - 'సర్సయ్య బాయి' (మూల ఉర్దూ రచయిత - జీలానీ బానూ) మంగారపు రమేష్ యాదవ్ - 'ఎపుసంకు ఎలుగు, రెహానా బేగం - 'పత్తిపూలు' హుమాయున్ సంఫీర్-'పచ్చశిర" అల్లాణి శ్రీనివాస్ - "మార్పు" కూతురు రాంరెడ్డి 'సర్వేనెం-321" పెద్దింటి అశోక్ కుమార్ "గుండెలో వాన' మొదలైనవి. ఈ కథలన్నీ రైతుకు పొలంతో గల అనుబంధాన్ని తెలియజేస్తాయి. అలాగే రైతు జీవితంలోని విషాదాన్ని పట్టిస్తాయి. రైతులు తమ ప్రాణాలైన వదులు కోవడానికి సిద్ధపడతారు కానీ తల్లిగా భావించే భూమిని మాత్రం వదులుకోలేరు. అనివార్యంగా భూమిని కోల్పోవలసిన పరిస్థితి తలెత్తినపుడు, అందుకు ఇష్టపడని రైతు మనస్తత్వాన్ని, అతడనుభవించే తీవ్ర మానసిక క్షోభకు అద్దం పట్టే కథ "మట్టి మనిషి". రచయిత చిల్లమల్లేశం రాజయ్య పాత్ర ద్వారా భూమిని వదులుకోవాల్సిన సందర్భంలో సగటు రైతు అంతరంగ సంఘర్షణను దృశ్యకరించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం

సమాజం

రైతుల నుంచి భూమి తీసుకోవడం నష్టపరిహారం చెల్లించడం, ముంపు గ్రామాల ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించడం, వందల వేల ఎకరాల భూమికి సాగునీరందించడం అభివృద్ధికి సోపానమే కానీ, ఈ దశలో భూమిని కోల్పోతున్న రైతు మానసిక స్థితి వర్ణనాతీతం. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీళ్లు తన పంటపొలాల్ని ముంచేస్తాయన్న ఆలోచన, తన తాత ముత్తాతల నాటి భూమి సంబంధ జ్ఞాపకాలు ప్రవాహంలో కల్సిపోతాయన్న వేదన భరించలేక భూమి పుత్రుడైన రాజయ్య గుండె పగిలి, తన భూమాత నుండి తననెవరూ విడదీయలేరని ఆ భూమిలోనే శ్వాస విడవడమనే హృదయ విచలితమైన సంఘటనను 'మట్టిమనిషి' కథ ద్వారా రచయిత వ్యక్తీకరించారు.

గ్రామం అంటేనే రైతు, రైతు అంటేనే గ్రామం. గ్రామీణ రైతు భూమినే తన గుండెగా భావించి సేద్యమే ఊపిరిగా మలచుకున్న విధానాన్ని రచయిత్రి వై.వసంత "చంద్రన్న" కథలో హృద్యంగా చిత్రించారు. భూమిని దుక్కిదున్నడం నుంచి పంట చేతికొచ్చేవరకు వ్యవసాయవృత్తిలోని ప్రతిదశను కళ్ళకు కట్టించారు. ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా, ఆకలిదప్పులు మరచి పంట పండించడానికి రైతు పడే శ్రమనంతా ఈ కథలో అక్షరీకరించారు. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, దళారులు, మధ్యవర్తుల మోసాలతో కుదేలవుతున్న రైతాంగాన్ని, తగిన సమయానికి కనికరించని వరుణదేవుడు సైతం రైతన్నను నిర్దాక్షిణ్యంగా బలిదీసుకుంటున్న తీరు హృదయ విదారకం. తాను నమ్ముకున్న మట్టి నిట్టనిలువునా ముంచేసినా రైతు మాత్రం ఆ మట్టిని వదలకపోవడం, చివరికి ఆ మట్టిలోనే కలిసిపోవడానికి సిద్ధపడడం, రైతు జీవన దృక్పథాన్ని, అతని నిబద్ధతను, భూమి పట్ల అతని కున్న మమకారాన్ని వ్యక్తం చేస్తుంది. "పల్లె అక్కడ బత్కెటోళ్ళ బత్కులల్ల ఓ భాగమైతది. గామనిషి మట్టిని తన బతుకుని యేరు చేసి సూడడు. పుట్టినప్పట్నుంది. సచ్చిందాకాగా మట్టిల్నే తన్లాడతుంటడు. తనకంతాగా మట్టే అనుకుంటడు. గిదంత తెల్వకుంటనే జరిగిపోతది. గా మట్టే బువ్వ పెడ్తదనుకుంటడు. గా మట్టే అడవి తల్లనుకుంటడు. గా మట్టే అన్నింటిని పుట్టిస్తది. గా మట్టే అన్నింటిని తనలోన కలిపేసుకుంటది. గా మట్టినే అల్కుతం, ముగ్గులు పెడ్తం, పూజలు చేస్తం, చివరికి మట్టిల మట్టి లెక్క కల్సిపోతం..... కొంత మంది యేమున్నది ఊర్లల్ల అంతా మట్టే గదా అన్కుకుంటారు. కొంత మంది గా ఊర్లున్న మట్టినే పానమనుకుంటారు అని గ్రామీణ రైతుల మనస్తత్వాన్ని వెల్లడించడంతోపాటూ, మానవ జీవన తాత్త్వికతను సైతం ధ్వన్యాత్మంగా వ్యక్తీకరిస్తారు రచయిత్రి.

ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణా అవతరించిన తర్వాత గ్రామాలు పునరుజ్జీవనం పొందుతున్న సందర్భంలో గతంలో ఉపాధి లేక వలస పోయిన రైతులు తిరిగి పల్లెబాట పట్టడాన్ని సహజంగా చిత్రించిన కథ-'పల్లెపిలిసింది'' రచయిత తమ్మిడి మాసయ్య పరిస్థితుల దృష్ట్యా కథను ఎన్నుకొని కథనంలో గ్రామాల సహజత్వాన్ని వర్ణించారు. "ఊరొచ్చేశెయ్యి, మల్లా తాతల కాలం నాటి రోజులొచ్చినయి, మన చెరువుకు నీళ్ళొచ్చినయి, అంతటా నాట్లు మొదలైనయి. నడిమున్న నీ పొలమొక్కటే పడావుంది'' అని చెప్పిన మిత్రుడు గొల్ల పర్వతాలు మాటల ప్రకారం చంద్రయ్య ప్రైవేటు కాలేజీ వద్ద సెక్యూరిటీ ఉద్యోగం వదిలిపెట్టి పల్లెకు చేర్తాడు. ఈ కథలో రచయిత మిషన్ కాకతీయ పథకంలో చెరువులు అభివృద్ధి చేయబడటాన్ని సూచించారు. కులమతాల పట్టింపులు లేక గ్రామంలోని వివిధ వృత్తి కులస్తులందరూ కలిసి మెలసి, కష్టం-సుఖం పంచుకోవడం, అన్ని మతాల ఆచారాన్ని గౌరవించడం, స్వచ్ఛమైన మనుషుల ప్రేమాభిమానాలు, ఆదరాభిమానాల మధ్య జీవించడంలో ఉన్న ఆనందాన్ని, ఆ ఆనందం గ్రామాల్లో లభించడాన్ని తెలియజేసాడు రచయిత.

**హిందూ-ముస్లింల సమైక్యత...**

భారతీయ గ్రామీణ జీవితం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుంది విభిన్న కులాల, మతాలు, భాషలు, ఆచార సంప్రదాయాలు, వృత్తులున్నప్పటికీ గ్రామీణులందరు కలిసి మెలసి సహజీవనం చేయడం గమనించవచ్చు. కులాల, మతాల భేదాభిప్రాయాలు లేకుండా ఒకరి కష్టానికి మరొకరు ఆసరాగా నిలిస్తుండడం చూస్తూనే వుంటాము. గ్రామాల్లో హిందూ-ముస్లింల సమైక్యతను తెలిపే కథలకు వేదికగా నిలిచింది 'బతుకమ్మ' పత్రిక. ఫరిష్తా, ఆవు, మెహందీ, జూకాలు, రంగుల గూడూ మొ॥ కథలు హిందు ముస్లిం కుటుంబాల మధ్య సంబంధాల్ని వారి మధ్య నెలకొన్న స్నేహాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

'ఆవు' కథలో రచయిత వల్లపాటి సురేంద్ర-వడ్డీ వ్యాపారి అంజిరెడ్డి నెలవారీ వడ్డీ డబ్బులు కట్టలేదని వెంకన్న ఆవు 'గంగ'ను తీసుకెళ్ళి సంతలో బేరానికి పెట్టినప్పుడు వెంకన్న ఇంటి పక్కనే నివసించే కరీంబాయ్ విషయం తెలుసుకొని అంజిరెడ్డి నుంచి ఆవును కొనుక్కొని తిరిగి వెంకన్నకు అందించడం హిందూ, ముస్లింల ఐక్యతను

**వడ్రంగి పని, శిల్పాలు చెక్కేపనికి ఆదరణ ఉన్న సమయంలో బాగా బతికిన కాశయ్య కుటుంబం, యాంత్రీకరణలో భాగంగా పుట్టుకొచ్చిన కొత్త పరికరాలతో పోటీ పడలేక కులవృత్తి మూలన పడుతుంది. రాయిని శిల్పంగా మార్చి, దేవతా మూర్తిగా మలచి, గుళ్ళో ప్రతిష్టించి, వేల, లక్షల మందితో పూజలందుకోవడానికి కారణమైన శిల్పులకు, దక్కింది పేదరికమేనని 'గ్రానైట్ భూతం' కథలో ఏనుగు వీణారెడ్డి స్పష్టం చేశారు.**

తెలుపుతుంది.

పేదల జీవితాలు బాగుపడడం కోసం సులేమాన్ సాబ్ తన చిరకాల కోరిక 'హజ్ యాత్రను' రద్దు చేసుకొని ఆ డబ్బును ఆపన్నులకు అందించడాన్ని స్కైబాబ 'ఫర్తిషా, కథలో చూడవచ్చు అయితే ఆ పేదలు హిందువులు కావడమిక్కడ గమనార్హం. హిందూ అయినా ముస్లిం అయినా లేమితనం ఒక్కటే. సాయం చేయడానికి మతం అడ్డురాదని రచయిత నిరూపించాడు.

"మొహంది" కథలో రచయిత బి. కళాగోపాల్ గ్రామీణ ముస్లిం వీధులను ఎంతో సహజంగా వర్ణించారు. "ఆ వీధిలో నుండి నడవటం నాకెప్పుడూ ఆసక్తే! ఎందుకంటే.... ఆ వీధిలో గుమ్మానికి వేలాడే రంగురంగుల పరదాలు, నెమలీకలు, విసనకర్రతో దట్టంగా ఊదు పొగను ఊదుకుంటూ వెళ్లే ఫకీర్ సాయెబులు, అరుగులపై పాన్‌దాన్ పక్కన పెట్టుకొని, ముచ్చట్లు పెట్టుకునే దాదీమాలు, మాసిన కమీజు, చిరుగులలుంగీతో కనిపించే సైకిల్ మెకానిక్ 'రహీం' తాత" అంటూ వాస్తవికతను చిత్రించారు రచయిత.

**కుల వృత్తుల క్షీణత...**

ఒకప్పటి గ్రామం సమస్త కులాల సమాహారం. చేనేత, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి మొ॥ కులాలవారు కులవృత్తులు చేసుకుంటూ జీవికకు ఏలోటు లేకుండా సంతృప్తిగా, ఆనందంగా, మనశ్శాంతితో జీవితం సాగించడం తెలిసిందే. అయితే ఆర్థిక సరళీకరణ పేరుతో విశ్వవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రపంచీకరణ నినాదం గ్రామీణ కులవృత్తులను కోలుకోకుండా దెబ్బతీసిందనేది చారిత్రక సత్యం. యాంత్రీకరణ కులవృత్తి దారుల కడుపు కొట్టింది. క్రమంగా కులవృత్తులు అంతరిస్తుండడాన్ని నేటి సమాజంలో గమనించవచ్చు. ఈ స్థితిని 'బతుకమ్మ' కథలు ఎత్తి చూపాయి.

తమ పాలిట దైవమైన మగ్గాన్ని నమ్ముకొని జీవితం వెళ్ళదీస్తున్న నేతన్నల జీవితాల్లోని చీకట్లను తెలిపే కథ-"పొడుస్తున్న పొద్దు"-నాయని సుజనాదేవి రాసిన ఈ కథ చేనేత కార్మికుల బతుకుల్ని కళ్ళ ముందు నిలుపుతుంది. చేనేత బట్టలకు గిరాకీ లేక, యంత్రాలపై తయారయ్యే వస్త్రాలతో పోటీపడలేక చితికిన నేతన్నల జీవితాలను చూపెడుతుంది. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసే పనితనం ఉన్న నేతన్నలు, విదేశాల్లో సైతం కీర్తించబడటానికి పనికొచ్చారని, దేశ ప్రతిష్ఠను పెంచడానికి పనికి వచ్చిన వారి కళానైపుణ్యం నేతన్నల కనీసావసరాలు తీర్చుకోవడానికి అక్కరకు రాలేదన్న చేదునిజాన్ని రచయిత్రి బట్టబయలు చేశారు.

వడ్రంగి, కమ్మరి కార్మికుల వర్తమాన పరిస్థితులను, కులవృత్తులకాదరణ తగ్గడంతో వారి జీవితాల్లోని విషాద కోణాన్ని వెల్లడించే కథలు - అమ్మోరు, గ్రానైటు భూతం.

రావుల పుల్లాచారి 'అమ్మోరు' కథలో కులవృత్తులు క్షీణించడంతో మరో ఉపాధి మార్గం లేక కూలీపనులు చేయలేక నిస్సహాయ స్థితిలో మిగిలిపోయిన కాశయ్య పాత్రను నేటి వెనుకబడిన వర్గాల ప్రతిరూపంగా చిత్రించాడు.

వడ్రంగి పని, శిల్పాలు చెక్కేపనికి ఆదరణ ఉన్న సమయంలో బాగా బతికిన కాశయ్య కుటుంబం, యాంత్రీకరణలో భాగంగా పుట్టుకొచ్చిన కొత్త పరికరాలతో పోటీ పడలేక కులవృత్తి మూలన పడుతుంది. రాయిని శిల్పంగా మార్చి, దేవతా మూర్తిగా మలచి, గుళ్ళో ప్రతిష్ఠించి, వేల, లక్షల మందితో పూజలందుకోవడానికి కారణమైన శిల్పులకు, దక్కింది పేదరికమేనని 'గ్రానైట్ భూతం' కథలో ఏనుగు వీణారెడ్డి స్పష్టం చేశారు.

**భూస్వామ్య వ్యవస్థ అస్తిత్వ చిహ్నాలు...**

స్వాతంత్రానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం కొంత కాలం వరకు తెలంగాణా గ్రామాలు నిజాం నిరంకుశ పాలనలో, దొరలు, భూస్వాములు,

**'బతుకమ్మ' వారపత్రికలో ప్రచురితమైన కథానికల్లో కథకులు చిత్రించిన తెలంగాణ గ్రామీణ జీవన చిత్రణను పరిశీలించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం. 'బతుకమ్మ' కథలు తెలంగాణా గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తాయి అని నిస్సందేహంగా చెప్పొచ్చు. అర్థ దశాబ్దపు బతుకమ్మ కథల్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. సంస్కృతీ సంప్రదాయాలను ఒక తరం నుంచి మరోతరానికి సంక్రమింప చేయడంలో గ్రామాలదే ముఖ్య పాత్ర.**

జమీందార్లు, పటేల్ పట్వారీల, అధికారిక అనధికారిక దోపిడీలో నిర్బంధ జీవనాన్ని అనుభవించాయి. భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ విధానం, లేవీగల్లా కొలవడం వంటి దోపిడీ విధానాల్లో ప్రజలు నిట్టనిలువునా మోసానికి గురయ్యారు. అయితే నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో సైతం, చాపకింద నీరులా, ఏదో ఒక రూపంలో కొనసాగుతున్న ఈ పీడనను ఎత్తి చూపుతూ రాయబడిన కథలు బి.నర్సన్ 'జలగలు', వై.వసంత - 'ఆవేదిరా', చందు తులసి - "పాలపిట్టలపాట" ఉప్పు నూతల నరసింహారెడ్డి - "తుఫాను" మొదలైనవి.

పీడనకు, దోపిడీకి గురవుతున్న ఉత్పత్తి కులాల వెతలను, నిస్సహాయతను, న్యాయం కోసం పోరాడే శక్తి లేక మౌనం వహిస్తున్న దైన్యస్థితిని ఈ కథలు వెల్లడిస్తున్నాయి.

దోపిడి వర్గానికి వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితం కావాలని అప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చుని 'ఆవేది రా'! కథ ద్వారా రచయిత్రి వై. వసంత సూచించారు "ఊర్లగాలితప్ప అన్ని దొర చేతిలకెంచే నడుస్తది" అన్న మాటలో దొరల నియంత్రత్వం వెల్లడవుతుంది. దొరదగ్గర వడ్డీకి అప్పు తెచ్చుకొని

కొనుక్కున్న ఆవును, బాకీ తీరిపోయినా, తీర్చలేదని చెప్పి దొర మనుషులు ఆవును స్వాధీనం చేసుకుంటే కడుపు ఎండి మండిన తాత దొరను ప్రశ్నించడానికి సన్నద్ధం కావడం ప్రజా చైతన్యానికి సంకేతం. "తుఫాను" కథలో రచయిత ఉప్పునూతల నరసింహారెడ్డి, ఏకమైన ప్రజల్ని అణచివేసి ప్రజాగ్రహానికి గురికావడం కంటే వారి అవసరాలు నెరవేర్చడం ద్వారా, వారికి ఆశ్రయ మివ్వడం ద్వారా, ప్రజా మద్దతును కూడగట్టుకొవచ్చని దొరలు ఆలోచిస్తున్నారని రచయిత మారుతున్న దొరల మనస్తత్వాన్ని నిరూపించాడు.

**సంచార కళాకారుల జీవనం...**

సంచార జీవితం గడుపుతూ, తరతరాలుగా వారసత్వ ఆస్తిగా అందివచ్చిన కళను నమ్ముకొని జీవనం సాగించే కళాకారులెందరెందరో తెలంగాణా పల్లెల్లో ఉన్నారు. ఒకప్పుడు సంచార కళాకారుల జీవితాలు ఏ లోటూ లేకుండా గడిచిపోయాయి. కానీ రాన్రాను సమాజంలో వస్తున్న మార్పులు సహజ కళలకు, కళాకారులకు స్థానం లేకుండా చేస్తున్నాయి. ప్రపంచీకరణ ముసుగులో, యాంత్రీకృత, పాశ్చాత్య సంస్కృతి విషబీజమై మన సంస్కృతీ సంప్రదాయాలను మింగేస్తూ, ప్రజా కళాకారుల జీవితాలకు ఆధారం లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన కథ - వజ్జీరు ప్రదీప్ రాసిన "రంగుల గూడు". తెలంగాణ గ్రామాల్లోచిందు, గుర్రపు, గంగిరెద్దు, కాకిపడుగ, బుడిగజంగాలు, మిధుల, గోయిందు, కూనపలి వంటి తెగల్లో సంచార జాతుల వాళ్ళు కళను నమ్ముకొని జీవనం సాగించేవారు. అక్షర జ్ఞానం లేని జానపదులు రామాయణ, భారత, భాగవతాలలోని సన్నివేశాలను, ఇతర పౌరాణిక గాథలను అద్భుతంగా ప్రదర్శించి జీవనోపాధి పొందేవారు. అయితే నేటి అధునాతన మీడియా విప్లవం ముందు గ్రామీణ కళలు వెలవెలబోతున్నాయన్న నగ్నసత్యాన్ని తెలియజేసారు రచయిత. ఈ కథ ద్వారా గ్రామీణ కళాకారులను ఆదుకోవాలని, ప్రాచీన కళల్ని నిలబెట్టుకోవాలని, ఆందుకు ప్రభుత్వాలు సైతం వారికండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**గ్రామీణ స్త్రీల చైతన్యం...**

పురుషులతో పోల్చినపుడు స్త్రీలు శారీరంగా కాస్త బలహీనులు. కానీ వారి మనో నిబ్బరం, గుండెధైర్యం, పోరాట తత్వంలో పురుషుల కంటే ధృఢ చిత్తులు. ముఖ్యంగా గ్రామాలలో కాయకష్టం చేసుకొని బతికే స్త్రీలు, వ్యవసాయం చేసే స్త్రీలు, కూలీపనులు చేసుకునే స్త్రీలు, బతుకులో నిత్యం అడుగడుగునా అనేక సవాళ్ళతో పోరాటం చేస్తూ జీవిక కోసం శ్రమిస్తుంటారు. ఇటువంటి శ్రామిక స్త్రీల చైతన్యాన్ని "బతుకమ్మ" కథలలో గమనించవచ్చు. బతుకు పోరాటంలో అలిసిన భర్త దిగులు చెందినపుడు భార్య ధైర్యం చెప్పడాన్ని బి. కళాగోపాల్ - "బోనం", రావుల పుల్లాచారి 'అమ్మోరు', హుమాయున్ సంఘీర్ - 'పచ్చశీర', బి. నర్సన్ - 'జలగలు', చిల్ల మల్లేశం - 'మట్టిమనిషి', రావుల కిరణ్మయి - 'శ్రీ తెలంగాణ' కథలలో గమనించవచ్చు సమ్మెట ఉమాదేవి - 'పని మంతులు', 'ద్వాలి', బి. కళాగోపాల్ - 'లచ్చుమమ్మ', కూతురు రాంరెడ్డి - 'కాలుతున్న కట్టెలు', ఉప్పరి చెన్నయ్య - 'వానొచ్చింది', నామని సుజనాదేవి - 'పొడుస్తున్న పొద్దు' శారద "కర్రావు', పర్కపెల్లి యాదగిరి - 'రాజమణి' మొదలైన కథలలో చిత్రించబడిన స్త్రీ పాత్రలను మహిళా చైతన్యానికి ప్రతీకగా గుర్తించవచ్చు.

> "**మొహంది" కథలో రచయిత బి. కళాగోపాల్ గ్రామీణ ముస్లిం వీధులను ఎంతో సహజంగా వర్ణించారు. "ఆ వీధిలో నుండి నడవటం నాకెప్పుడూ ఆసక్తే! ఎందుకంటే.... ఆ వీధిలో గుమ్మానికి వేలాడే రంగురంగుల పరదాలు, నెమలీకలు, విసనకర్రతో దట్టంగా ఊదు పొగను ఊదుకుంటూ వెళ్లే ఫకీర్ సాయెబులు, అరుగులపై పాన్‌దాన్ పక్కన పెట్టుకొని, ముచ్చట్లు పెట్టుకునే దాదీమాలు, మాసిన కమీజు, చిరుగులలుంగీతో కనిపించే సైకిల్ మెకానిక్ 'రహీం' తాత" అంటూ వాస్తవికతను చిత్రించారు రచయిత.**

సమ్మెట ఉమాదేవి 'ద్వాలి' కథలో ద్వాలి పాత్ర రాజకీయాలలో మహిళాస్థానం గురించి ఆలోచింప జేస్తుంది. ఒక నాయకురాలిగా ప్రజలకు న్యాయం చేయడమే తన కర్తవ్యమని, ఇందుకోసం భర్తను సైతం ఎదిరించిన వైనం ఆమె ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. భర్త మరొక స్త్రీతో కలిసి జీవిస్తూ ద్వాలిని నిర్లక్ష్యం చేసినా, ఏమాత్రం నిరుత్సాహపడకుండా బతుకు పోరాటానికి సిద్ధపడుతుంది. 'భోనం' కథలో దేవవ్వ. రాజమణి కథలో 'రాజమణి' 'పొడుస్తున్న పొద్దు' కథలో లక్ష్మి మొదలయిన స్త్రీ పాత్రలన్ని స్త్రీ స్పూర్తికి, చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

**గిరిజన జీవన చిత్రణ...**

డా॥ సూర్యాధనంజయ్ - 'ఝుళి', సమ్మెట, ఉమాదేవి - 'ద్వాలి' కథలు గిరిజనుల జీవితాలకు ప్రతిబింబంగా రాయబడినవి. గిరిజనుల జీవితంలోని కన్నీటి చారికలను, మూఢ నమ్మకాలను, తండా ప్రజల అమాయకత్వాన్ని ఈకథలు ఎత్తిచూపాయి. 'ఝుళి' కథలో ఆడపిల్లల పట్ల వ్యతిరేక భావాన్ని, వారిని వదిలించుకోవడానికి అమ్మకానికి సైతం వెనుకాడని నిస్సహాయ స్థితిని, హృద్యంగా ఆవిష్కరించి, గిరిజనులలో ఆడపిల్లల పట్ల ఉన్న దృక్పథం మారాలని, ఆడ శిశు వులను అమ్మే సంస్కృతి నశించాలని ఆడపిల్లల అక్షరాస్యతను ప్రోత్సహించడం ద్వారా గిరిజనుల్లో చైతన్యం కలిగించాలని, అప్పుడే గిరిజన జాతుల్లో గూడు కట్టుకొని ఉన్న మూఢనమ్మకాలను పారద్రోలవచ్చని ఉద్భోధించారు రచయిత్రి. సమ్మెట ఉమాదేవి 'ద్వాలి' కథలో ద్వాలి పాత్రను గిరిజన మహిళలకు, రాజకీయరంగంలో ఉన్న స్త్రీలకు ఆదర్శంగా నిలిపారు.

సమాజం

**గ్రామీణ సంస్కృతి...**

ఎన్నుకున్న కథాంశం ఏదైనా ప్రతికథలోను గ్రామీణ సంస్కృతి అంతర్భాగంగా చిత్రింపబడింది. దండలో దారంలాగా ప్రతి కథకు గ్రామీణ నేపథ్య సంస్కృతి ఆధారభూతమైంది. సాంస్కృతిక జీవనంలో భాగమైన, పండుగలు, జాతరుల, పెళ్ళి, పేరంటాలు, ఆట పాటలు, కుల, మత సంబంధమైన వస్తు సంస్కృతి, ఆహారపుటలవాట్లు ఇతర ఆచార వ్యవహారాలన్నీ సందర్భానుసారంగా వ్యక్తమయ్యాయి.

తెలంగాణా సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలు బతుకుమ్మ, బోనాలు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబట్టే పూలపండుగ బతుకమ్మ. కథనంలో భాగంగా బతుకమ్మ పండగను స్పృశించిన కథలు, పెద్దింటి అశోక్ కుమార్ "గుండెలో వాన", చందుతులసి - "పాలపట్టిలపాట" కొట్టం రామకృష్ణా రెడ్డి - 'ఇగురం' మొ॥నవి. "పాలపిట్టల పాట' కథలో బతుకమ్మను పేర్చడానికి కావలసిన పూల వివరాలతో పాటూ, బతుకమ్మను పేర్చడం, ఆడడం నిమజ్జనం చేయడం వరకు గల ప్రతి దశను కళ్ళకు కట్టించారు రచయిత. బతుకమ్మ పండుగలో బతుకమ్మ పాటలకు విశిష్టమైన స్థానం ఉంది. యజమానుల కోసం అడవంతా గాలించి పూలు సేకరించి తెచ్చేఅట్టడుగు వర్గాల ఆడబిడ్డలకు మాత్రం బతుకమ్మ ఆడే అవకాశం లేకపోవడాన్ని ఈ కథలో వ్యక్తం చేసారు.

బి. కళాగోపాల్ 'బోనం' కథలో "పొద్దునే లేచి ఇల్లు, వాకిలి అలుక్కొని ముగ్గులు పెట్టి తీర్చిదిద్దింది. గుమ్మానికి వేపాకు మండల్ని కట్టింది. కట్టెల పొయ్యి ముట్టించి, విత్తనాలకై కాగులో దాచి వుంచిన గింజల్ని బాగు చేసి ఉడకేసి బెల్లన్నం వండింది. కుండలో సాక సిద్ధం చేసుకొని కంచుడులోపెద్ద వత్తివేసి దీపం ముట్టించి, ఆ కొత్త కుండకు పసుపు కుంకుమ బొట్టు పెట్టి వేపాకులు కట్టి

**తెలంగాణా సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలు బతుకుమ్మ, బోనాలు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబట్టే పూలపండుగ బతుకమ్మ. కథనంలో భాగంగా బతుకమ్మ పండగను స్పృశించిన కథలు, పెద్దింటి అశోక్ కుమార్ "గుండెలో వాన", చందుతులసి - "పాలపట్టిలపాట" కొట్టం రామకృష్ణా రెడ్డి - 'ఇగురం' మొ॥నవి.**

బోనమెత్తింది దేవవ్వ .కట్టమీద పోశవ్వ దగ్గర ఊర్ల అందరి ఇండ్ల నుంచి వచ్చిన బోనాల్ని కలిపి, బలిచ్చిన జంతువు రక్తంతో తడిపి, బలి అన్నాన్ని ఎండుతున్న పైర్ల మీద, చేన్ల మీద, బీడు పొలాలో చల్లాడు పూజారి" అంటూ గ్రామీణులు భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు బోనం సమర్పించుకోవడం, తద్వారా గ్రామదేవతలు శాంతించి గ్రామాన్ని కాపాడతారన్న విశ్వాసం వ్యక్తం చేయబడింది. భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో శుచీ శుభ్రతలను పాటిస్తూ గ్రామదేవతలకెత్తే 'బోనం' లాగానే వారి జీవనానికి ఆధారమైన దేశవాళీ విత్తనాలను సైతం భద్రపరచుకుంటే వ్యవసాయక జీవితం పండుగవుతుందని రచయిత సందేశం.

తెలుగు భాష ప్రాచీనతను, ప్రాశస్త్యాన్ని వెల్లడించే కథలు వజ్జీరు ప్రదీప 'దేవక్కపెళ్లి కూతురు' జయశ్రీ మాస్టారు తబాదలా".

**పశుపక్ష్యాదుల పట్ల మమకారం...**

గ్రామీణులు పశుపక్ష్యాదుల పట్ల పెంచుకునే మమకారానికి నిదర్శనంగా నిలిచే కథలు - "క్రావు", "ఆవు" 'తాత దోస్త్' 'క్రావు' కథలో రచయిత్రి శారద ప్రధాన పాత్ర రాజవ్వకు క్రావు పట్ల ఉన్న ప్రేమను, వాత్సల్యాన్ని కంటినిండుగా చూపించి, గుండె నిండుగా అనుభూతి చెందేలా చిత్రించారు. క్రావు నాలుగు రోజులు కనబడకపోతే రాజవ్వ అస్థిమితమైన మానసిక స్థితి, అది దొరికినపుడు పట్టపగ్గాలు లేని ఆమె ఆనందం, ఇరుగుపొరుగు, చూసిపోతే దానికి దిష్టి తగులుతుందని భావించిన తీరు, క్రావు ఈనిన దూడను మరణించిన తన కూతురుగా ఎంచడం మొదలైనవన్నీ గ్రామీణుల స్వచ్ఛమైన కల్మషం ఎరుగని మనస్తత్వానికి దర్పణం పడతాయి. 'ఆవు' కథలో రచయిత వల్లపాటి సురేంద్ర వెంకన్నకు తన ఆవుతో ఉన్న అనుబంధాన్ని అది కనపడకపోతే ఊరంతా గాలించడం, ముస్లిం అయిన కరీం దాన్ని ఏం చేశాడోనని చింతించడం మొ॥వన్నీ మూగజీవాల పట్ల గ్రామీణుల దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. 'ఆవు'కు గంగ అని పేరు పెట్టుకోవడంలోనే జంతువులకు మనుష్యత్వాన్ని ఆపాదించుకునే గ్రామీణుల నైజం తేటతెల్లమవుతుంది.

'బతుకమ్మ' కథలు తెలంగాణా గ్రామ జీవనంలోని ప్రతి అంశాన్ని స్పష్టంగా, సున్నితంగా స్పృశించాయి. గ్రామీణుల సామాజిక జీవితంలోని సుఖదుఖాల్ని, మంచి చెడ్డల్ని కష్టనష్టాల్ని, గ్రామీణుల దృక్పథంతో రూపుకట్టించాయి.

జోగినీ వ్యవస్థ, మద్యపానం, బాల్యవివాహాలు, రైతుల ఆత్మహత్యలు, ఆడశిశువు అమ్మకాలు, ఉపాధి వలసలు, అనాధల జీవన్మరణ సమస్యలు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బలవుతున్న పంటపొలాలు, నిరక్షరాస్యత, వడ్డీ వ్యాపారుల దోపిడి, వాణిజ్య పంటల సాగులో నష్టపోతున్న రైతాంగం, సఫాయి కార్మికుల వెతలు మొ॥న సామాజిక సమస్యలతో పాటూ, తెలంగాణా రాష్ట్రోద్యమం, రాష్ట్రం ఏర్పాటు అనంతరం పునరుజ్జీవనం పొందుతున్న పల్లెలు, హరితహారం, ప్రభుత్వ పాఠశాలలో ఒకప్పటి తరానికున్న అనుబంధం మొదలగు అనేకాంశాలకు బతుకమ్మ వేదికగా నిలిచి, భవిష్యత్తరాల వారికి పల్లెలను పదిలంగా అందించాల్సిన ఆవశ్యకతను తేటతెల్లం చేస్తున్నాయి.

## "తెలుగు సాహిత్యం- రైతాంగ సమస్యలు" అంశంపై జాతీయ సదస్సు




ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం హనుమకొండ వారు సంయుక్తంగా మార్చి 7,8 తేదీలలో "తెలుగు సాహిత్యం- రైతాంగ సమస్యలు" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు సంబంధించిన వివిధ పోరాటాలను, మహిళలు పురుషులకు ధీటుగా పోరాడిన తీరును, ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న రైతు పోరాటాన్ని ప్రస్తావించారు. ప్రారంభ సమావేశవేదికపై ప్రముఖ రచయిత విమర్శకుడు శ్రీ అల్లం రాజయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ అంపశయ్య నవీన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, పూర్వ విద్యార్థుల సంఘ కన్వీనర్ శ్యామల ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తెలంగాణ కార్యదర్శి కాత్యాయని విద్మహే పాల్గొన్నారు. రెండు రోజుల ఈ సదస్సులో మొత్తం ఐదు సమావేశాలు జరిగాయి.

**- రిపోర్టర్, తంగేడు**

## 'సృజన' సాహితీ సమాఖ్య తరపున కవి డాక్టర్ దామెర రాములు దంపతులను జీవన సాఫల్యపురస్కారం



ఖమ్మం జిల్లాసత్తుపల్లిలో 24.1.21 ఆదివారం 'సృజన' సాహితీ సమాఖ్య తరపున ప్రముఖ కవి డాక్టర్ దామెర రాములు దంపతులను జీవన సాఫల్యపురస్కారంతో సన్మానిస్తున్న సత్తుపల్లి శాసనసభ్యులు గౌరవ సండ్ర వెంకటవీరయ్య మరియు సంస్థ సభ్యులు.

## 'గుప్పెటలో గోదారి" కథల సంపుటిని ఆవిష్కరించిన కవిత



అక్షరయాన్ ఉమెన్ రైటర్స్ ఫోరం వారి వెబ్‌సైట్ ప్రారంభోత్సవ సందర్భంగా ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి 'గుప్పెటలో గోదారి" కథల సంపుటిని శ్రీమతి కవిత ఆవిష్కరించారు. రచయిత్రి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

## హన్మకొండలో మహావైభవంగా అష్టావధానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హన్మకొండలోని భద్రుక కామర్స్ డిగ్రీ కళాశాలలో అష్టవధాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ లేఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో డా॥ టి. రంగస్వామి అధ్యక్షతన శతవధాని, అవధాన కళానిధి శ్రీ ఆముదాల




మురళి పృచ్ఛకులు అడిగిన వాటికి జవాబు చెబుతూ ఆహ్లాదకరంగా అష్టావధానం చేశారు. అష్టావధానికి, పృచ్ఛకులకు కళాశాల యాజమాన్యం శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కంది శంకరయ్య, ఎన్. రవీందర్, కళాశాల కరస్పాడెంట్ యస్ ఎన్ మనోజ్ మరియు కవులు, రచయితలు, సాహితీమూర్తులు హాజరయ్యారు.

**- కపిల భారతి**




## కరోనా వైరసీయం

బొందిడి పురుషోత్తమ రావు
నిర్మల్

సెల్ : 9676227899
వెల : రూ. 59 /-




## భార్గవానందలహరి

సిరిప్రెగడ భార్గవరావు

**సాహితీ మేఖల**, చండూరు,
**శ్రీ షిర్డి సాయిబాబా ట్రస్టు**
సెల్ : 98668 63913
వెల : రూ.190/-




## జమానా

బి.ఎన్.బి

**దర్శా ప్రచురణలు**
నిజామాబాద్
సెల్ : 77023 07678




## రవి కిరణాలు

సత్యనీలిమ

సెల్ : 95021 56813
వెల : రూ. 100/-




## శాస్త్రీయ ఆలోచనా విధానం

ఎడ్వర్డ్ కూంజ్
అనువాదం: సుంకర రామచంద్రరావు,
పామిరెడ్డి శివారెడ్డి
శివరామయ్య పబ్లికేషన్స్
సెల్ : 98661 71256
వెల.రూ. 150/-




## మాతృదేవోభవ

దారం గంగాధర్

వెల.రూ. 100/-




## ఎర్రమట్టి గాజులు

రేణుక అయోల

**బోధి ఫౌండేషన్**
సెల్ : 98482 54745
వెల.రూ. 100/-




## స్వరసాహితి - భక్తిగీతాలు

మల్లెల కబీర్‌దాస్

**పద్మసూర్య ప్రచురణలు**
సెల్ : 95509 74119
వెల.రూ. 40/-




## శ్రీ సీతారామాంజనేయ సంవాదము బాలబోధ

డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి

**సాహితీ మేఖల**, చండూరు,
**శ్రీ షిర్డి సాయిబాబా ట్రస్టు**
సెల్ : 99498 49583
వెల.రూ. 150/-




## స్థిత ప్రజ్ఞుడు

గుర్రపు సత్యనారాయణ

మహబూబాబాద్
సెల్ : 98499 82452

